




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 217 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 17 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 217 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 17 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


# కిషన్‌రెడ్డి గారూ.. ఎక్కడికైనా వస్తా..

# మీ కాల్ కోసం వెయిటింగ్

## కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ బహిరంగ లేఖ

**హైదరాబాద్ పెన్ పవర్:** కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. మెట్రో రైలు ప్రాజెక్టు వ్యవహారంలో ఇటీవల సీఎం చేసిన విమర్శలపై కిషన్‌రెడ్డి స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కిషన్‌రెడ్డిని కోరారు. "సమస్య పరిష్కారానికి ఏ మీటింగ్‌కైనా నేను ఎప్పుడూ సిద్ధమే. రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో వీలైనంత త్వరగా భేటీ ఏర్పాటు చేయించాలి. ఆ సమావేశానికి సంబంధించి మీ కాల్ కోసం ఎదురు చూస్తాను. అన్ని పత్రాలతో వచ్చి స్పష్టత ఇస్తా. ఈ అంశంలో మీతో వ్యక్తిగత భేటీకి కూడా సిద్ధమే. ఎక్కడికైనా, ఎప్పుడైనా డాక్యుమెంట్లు, అధికారులతో వస్తాను" అని రేవంత్ పేర్కొన్నారు.

**బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్ట్‌పై సీఎం సమీక్ష**

అంతకుముందు బుల్లెట్ రైలు ప్రాజెక్టు, వరంగల్ ఎయిర్‌పోర్టు అంశాలపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్-పుణె రైల్వే మార్గంలో అనంతగిరి వద్ద స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని.. అక్కడి నుంచి ఐటీ హబ్‌కు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. హైదరాబాద్-బెంగళూరు రైల్వేమార్గంలో ఫ్యూచర్ సిటీలో స్టేషన్ ఏర్పాటు చేయాలి. మన్ననూర్ వద్ద నల్లమల స్టేషన్, సోమశిల సమీపంలో స్టేషన్ ప్లాన్ చేయాలని సూచించారు. టూరిజం ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని రైల్వే లైన్ ఉండాలన్నారు. కాకతీయ సామ్రాజ్యం, వారసత్వ సంపద ఉట్టిపడేలా వరంగల్ ఎయిర్‌పోర్టు ఉండాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఎయిర్‌పోర్టు ముందు రుద్రమదేవి, రుద్రదేవుడు, నంది విగ్రహంతో ఐలాండ్ ఉండాలన్నారు. ఎయిర్‌పోర్టు డిజైన్లపై ఢిల్లీ వెళ్లి ఎయిర్‌పోర్టు అథారిటీ అధికారులతో చర్చించాలని అధికారులకు సూచించారు.





## మెట్రోపై రగడ.. ఐఆర్‌ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి

- తెలంగాణ అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందన్న కిషన్‌రెడ్డి
- మెట్రో విస్తరణకు సహకరిస్తున్నామని వ్యాఖ్య
- అభివృద్ధిపై తమకు పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదన్న కేంద్ర మంత్రి
- తాను చెబితే ప్రాజెక్టులు ఆగవన్న కిషన్‌రెడ్డి
- దిగజారుడు రాజకీయాలు చేయొద్దంటూ విమర్శలు

- మిగతా 2లో



## జగిత్యాల జిల్లాలో ఎవరు ఏ పార్టీనో తెలియడం లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** జగిత్యాల జిల్లాలో ఏ నాయకుడు ఏ పార్టీలో ఉన్నారో తెలియడం లేదని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వ్యాఖ్యానించారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ధర్మాజీపేటలో పల్లె దవాఖానా నూతన భవనాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎంపీ మాట్లాడుతూ.. పల్లె దవాఖానాకు కేంద్ర ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం కేవలం

- మిగతా 2లో

## పడక గది కప్‌బోర్డులో రూ.1.54 కోట్లు

- ఏసీబీకి చిక్కిన సర్వే, భూ రికార్డుల ఉపసంచాలకుడు నరహరిరావు
- ఆదాయానికి మించిన ఆస్తులు రూ.13.05 కోట్లు.. బహిరంగ మార్కెట్లో విలువ రూ.100 కోట్ల పైమాటే



- ఏసీబీ తనిఖీల్లో ఇంట్లో ఇంత భారీ నగదు లభ్యమవడం ఇదే తొలిసారి

2లో

### నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై

# తాత్కాలిక నిషేధం

- భారత్‌లో యాప్‌పై ఆంక్షలు.. స్పందించిన టెలిగ్రామ్ సీఈఓ
- చీటింగ్, తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకే ఈ నిర్ణయం
- జూన్ 21న దేశవ్యాప్తంగా నీట్-యూజీ పునఃపరీక్ష
- కేంద్రం చర్యను తప్పుబట్టిన టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్
- ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్ యాప్‌ను తొలగించిన గూగుల్

**పెన్ పవర్ డెస్క్:**నీట్-యూజీ 2026 పునఃపరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌పై దేశవ్యాప్తంగా జూన్ 22 వరకు తాత్కాలిక ఆంక్షలు విధించింది. పరీక్ష సమయంలో చోటుచేసుకునే అక్రమాలను, తప్పుడు ప్రచారాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) సిఫార్సు మేరకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సెక్షన్ 69ఏ కింద ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై

- మిగతా 2లో





## పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..

### రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!

- గురుకుల పాఠశాలల్లో భారీ కుంభకోణం జరిగిందన్న హరీశ్
- తమ శాఖల్లో ఏం జరుగుతోందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా
- పిల్లలకు ఇచ్చే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా అని మండిపాటు

- మిగతా 2లో

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణ కోరుతూ ఏబీవీపీ ఆందోళన
- హైదరాబాద్ లో పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వద్ద ఉద్రిక్తత
- ఫీజుల నియంత్రణకు వెంటనే చట్టం తేవాలని డిమాండ్
- ప్రభుత్వ హామీలున్నా ఫీజుల పెంపుతో ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు
- నిరసనకు దిగిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను అరెస్ట్ చేసిన పోలీసులు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా పెంచుతున్న ఫీజులను అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మంగళవారం హైదరాబాద్‌లో చేపట్టిన

- మిగతా 2లో

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్




- ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సుకు ప్రధాని మోదీ హాజరు
- హర్మూజ్ గుండా చమురు సరఫరా సులభతరమైందన్న ట్రంప్
- రష్యా చమురుపై త్వరలో మళ్లీ ఆంక్షలు విధిస్తామని వెల్లడి

**పెన్ పవర్ డెస్క్:**ఫ్రాన్స్‌లోని ఇవియాన్‌లో జరుగుతున్న జీ7 శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. మంగళవారం నిర్వహించిన కీలకమైన 'ఔట్‌రీచ్ సెషన్'లో భాగంగా ఆయన ప్రపంచ నేతలతో కలిసి

- మిగతా 2లో

## దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి

**హైదరాబాద్ పెన్ పవర్:**విశాఖపట్నం(ఏయూ ప్రాంగణం): తూర్పు విదర్భ, తెలంగాణ మీదుగా దక్షిణ కోస్తాంధ్ర వరకు ద్రోణి విస్తరించి ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. 'బుధవారం విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు,

- మిగతా 2లో





## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు..

### తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- తెలంగాణ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్న బండి సంజయ్
- అక్రమ వలసదారుల ఓట్లపై కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న
- తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ అభివృద్ధిని అడ్డుకునే ప్రసక్తే లేదని, ప్రధా ని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం తెలంగాణ ప్రగతికి ఎల్లప్పుడూ

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## ఆపరేషన్ కమలం హరీశ్ రావు
# బీజేపీలోకి వెళ్లారా?

బీఆర్ఎస్ నేత హరీశ్ రావు బీజేపీలోకి వెళతారా? బీజేపీ కూడా హరీశ్ రాకకు ప్రత్యేకంగా ఆపరేషన్ సిద్ధం చేసిందా? అంటే అవుననే అనిపిస్తుంది. హరీశ్ రావు ను తమ పార్టీలోకి తీసుకు వచ్చేందుకు బీజేపీ రంగం సిద్ధం చేసినట్లు పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. తెలంగాణలో బలమైననేత అవసరమని భావించిన బీజేపీ హరీశ్ రావుకు పార్టీ కండువా కప్పేయాలని డిసైడ్ అయిందని సమాచారం. రానున్న ఎన్నికలలో అధికారంలోకి రావాలంటే బలమైన వాయిస్ అవసరమని భావించిన బీజేపీ కేంద్ర నాయకత్వం హరీశ్ రావును పార్టీలోకి తీసుకుంటే ఖచ్చితంగా అది పార్టీకి ప్లస్ అవుతుందని అంచనా వేస్తుంది.

**హరీశ్ అసంతృప్తిగా...**

హరీశ్ రావు బీఆర్ఎస్ లో ప్రస్తుతం కంఫర్ట్ గానే ఉన్నారు. అయితే ఆయనలో ఒకింత అసంతృప్తి అయితే కనపడుతుందని అంటున్నారు. తనను లక్ష్యంగా చేసుకుని కల్వకుంట్ల కవిత విమర్శలు చేస్తున్నప్పటికీ కవితకు కౌంటర్ ఇచ్చేందుకు బీఆర్ఎస్ నేతలు ఎవరూ ముందుకు రావడం లేదు. తనను గుంటనక్క అంటూ కవిత పదే పదే అంటున్నప్పటికీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నుంచి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా ఖండించకుండా మౌనంగా ఉండటం హరీశ్ రావును అసహనానికి గురి చేస్తుందని అంటున్నారు. అందుకే తన మేనమామ కేసీఆర్ కోసం పార్టీలో ఉన్నప్పటికీ జరుగుతున్న పరిణామాలు మాత్రం అసంతృప్తికి లోను చేస్తున్నాయి.

**ఉష్ణోగ్రతలు ఎప్పుడు తగ్గుతాయంటే?**

కవితను తిరిగి...

దీంతో పాటు కవితను తిరిగి బీఆర్ఎస్ లో చేర్చుకునే అవకాశాలను ఎవరూ కొట్టిపారేయడం లేదు. కవిత తిరిగి బీఆర్ఎస్ లోకి వస్తే తనకు ప్రాధాన్యత తగ్గుతుందని కూడా హరీశ్ రావు భావిస్తున్నట్లు చెబుతున్నారు. అలాగే కవిత కొత్తగా పెట్టిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) తమకు ఇబ్బందికరంగా మారుతుందని భావించిన కేసీఆర్ ఆమెను బుజ్జగించి తిరిగి పార్టీలోకి తీసుకోవాలని యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. కవిత పార్టీలోకి వస్తే తాను ఇక అక్కడ ఉండకూడదని డిసైడ్ అయినట్లు హరీశ్ సన్నిహితులు చెబుతున్నారు. దీంతో పాటు బీజేపీకి కూడా సరైన నేత అవసరం కావడంతో హరీశ్ రావును బీజేపీలోకి తీసుకోవాలని డిసైడ్ అయి మంతనాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. మరి ఇందులో వాస్తవాలు ఎంత ఉందో తెలియదు కానీ ప్రచారం అయితే గట్టిగానే జరుగుతుంది.

## మెట్రోపై రగడ.. ఐఆర్ఎఫ్‌సీ రుణాలకు సాంకేతిక ఇబ్బందులున్నాయి

హైదరాబాద్ మెట్రో విస్తరణను కేంద్రం అడ్డుకుంటోందంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ఆరోపణలను కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఖండించారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే సీఎం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.మెట్రో రైలు ప్రాజెక్టు విషయంలో రేవంత్ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 అమలుకు కేంద్రం రూ.1,200 కోట్లు అందించిందని వెల్లడించారు. మెట్రో విస్తరణ కోసం మరింత చురుగ్గా పనిచేయాలని తానే రేవంత్‌రెడ్డికి లేఖ రాశానన్నారు. ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రుణం పొందేందుకు కూడా కేంద్రం సహకరిస్తోందని చెప్పారు. ఐఆర్ఎఫ్‌సీ రూ.13 వేల కోట్ల రుణ ప్రతిపాదన విషయంలో కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని తెలిపారు. వాటిని కేంద్రంతో చర్చించి పరిష్కరించుకోవాల్సింది పోయి రాజకీయ విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఆ సమస్యను తనపై నెట్టేందుకు ప్రయత్నించడం బాధాకరమన్నారు.తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధిపై తమకు ఎవరూ పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ ప్రాజెక్టు, ఎన్‌టీపీసీ విద్యుత్ ప్రాజెక్టు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో కేంద్రం సహకరిస్తోందన్నారు. మూసీ పునరుజ్జీవన కార్యక్రమానికి అవసరమైన రుణాల మంజూరుకు కూడా కేంద్రం ఎన్‌ఓసీ ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా కేంద్రం ఎలాంటి వివక్ష చూపదని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు.

దిగజారుడు రాజకీయాలకు పాల్పడకుండా అభివృద్ధి అంశాలపై కేంద్రంతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాలని సూచించారు. కిషన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన ప్రాజెక్టులు ఆగిపోవని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని రేవంత్‌రెడ్డికి హితవు పలికారు.

# పిల్లల గుడ్లు, పప్పుల్లో రూ. 2 వేల కోట్ల స్కామ్..
## రేవంత్ అన్నదమ్ములే కోటీశ్వరులయ్యారంటూ హరీశ్ రావు ఫైర్!

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్‌గా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు విమర్శల డోస్ పెంచాయి. తాజాగా జరిగిన బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురుకుల పాఠశాలల టెండర్లలో ఏకంగా రూ. 2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు.
కాంగ్రెస్ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ విసిరిన సవాళ్లకు హరీశ్ రావు కౌంటర్ ఇచ్చారు. గురుకులాల్లో యూనిఫాంలు, టైల కోసం రూ. 1,200 కోట్లు.. ఉప్పులు, పప్పులు, చికెన్, గుడ్ల కోసం రూ. 800 కోట్లకు టెండర్లు పిలిచారని, ఈ రెండు కలిపితేనే రూ. 2,000 కోట్లు అవుతుందని లెక్కలు చెప్పారు. తమ శాఖల్లో ఏం జరుగుతుందో కూడా తెలియని స్థితిలో మంత్రులు ఉన్నారని ఎద్దేవా చేశారు. చివరకు గురుకులాల్లో చదువుకునే పేద పిల్లలకు పెట్టే గుడ్లు, పప్పుల్లో కూడా స్కామ్ చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు.ఎన్నికల ముందు కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని హరీశ్ రావు గుర్తుచేశారు.

కానీ ఇప్పటివరకు రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా కోటీశ్వరురాలు కాలేదని, అయితే రేవంత్ అన్నదమ్ములు మాత్రం కోటీశ్వరులయ్యారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రే స్వయంగా మొత్తం టెండర్లు పిలుస్తూ, ఆ నిధులన్నీ తన అన్నదమ్ములకే కట్టబెడుతున్నారని.. అందుకే ఈ వ్యవహారాలు రాష్ట్ర మంత్రులకు కూడా తెలియడం లేదని ఆరోపించారు.

## పడక గది కప్‌బోర్డులో రూ.1.54 కోట్లు

హైదరాబాద్: పడక గదిలో బీరువా.. దాని పైన కప్‌బోర్డు.. దాన్ని తెరిచి చూస్తే నిండా 500 రూపాయల నోట్ల కట్టలు.. లెక్కిస్తే ఏకంగా రూ.1.54 కోట్లు.. తెలంగాణ 'సర్వే, సెటిల్‌మెంట్, భూ రికార్డులు' మల్టీజోన్-2 ఉపసంచాలకుడు సుంకరి నరహరిరావు అవినీతి ప్రతాపమిది. హైదరాబాద్ పాతబస్తీ ఛత్రినాకలోని నరహరిరావు ఇంటికి మంగళవారం తెల్లవారుజామునే చేరుకున్న ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలోని అధికారుల బృందం చేపట్టిన సోదాల్లో కట్టలు కట్టలుగా అవినీతి సొమ్ము బహిర్గతమైంది. ఆరోపణల నేపథ్యంలో కొద్దిరోజులుగా ఆదాయానికి మించిన ఆస్తుల చిట్టాపై లోతుగా ఆరా తీసిన ఏసీబీ బృందాలు మంగళవారం ఆయన ఇంటితోపాటు మరో 11 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించడంతో ఆ గుట్టు రట్టయింది. నగదు కట్టలే కాకుండా పెద్దఎత్తున ఇతర అక్రమాస్తుల్ని గుర్తించారు. వాటి మొత్తం అధికారిక విలువ రూ.13.05 కోట్లుగా లెక్కగట్టారు. అయితే, ఆయన అధీనంలోని స్థిరాస్తులన్నీ హైదరాబాద్ శివార్లలోని ప్రముఖ ప్రాంతాల్లో ఉండటంతో బహిరంగ మార్కెట్‌లో వాటి విలువ రూ.100 కోట్లపైనే ఉంటుందని అంచనా వేస్తున్నారు. నారాయణగూడలోని సర్వే భవన్‌లో ఆయన కార్యాలయంలోనూ సోదాలు నిర్వహించి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

**ఐదు సంచుల్లో కుక్కి.. అటకెక్కించి..**

ఛత్రినాకలోని నరహరిరావు ఇంటిని తనిఖీ చేసిన సమయంలో బీరువాపై ఉన్న కప్‌బోర్డు ఏసీబీ అధికారుల దృష్టిని ఆకర్షించింది. దాన్ని తనిఖీ చేయడంతో ఒకదాని వెంట ఒకటి ఐదు సంచులు కనిపించాయి. వాటిని విప్పి చూస్తే అన్నీ రూ.500 నోట్లే కనిపించడంతో ఏసీబీ అధికారులు విస్తుపోయారు. వాటిని లెక్కించగా మొత్తం రూ.1.54 కోట్లున్నట్లు తేలింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో తనిఖీల సమయంలో ఒకే ఇంట్లో ఇంత పెద్దమొత్తం నగదు లభించడం ఏసీబీ చరిత్రలోనే ఇదే తొలిసారి. ఇంట్లో తనిఖీ చేసినకొద్దీ నగదు కట్టలు బయటపడుతుండటం చూసి అధికారులే ఆశ్చర్యపోయారు. అలాగే మరింత క్షుణ్ణంగా పరిశీలించడంతో బంగారం, వెండితోపాటు ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలు బహిర్గతమయ్యాయి.

**భార్య పేరిట రెండు లాకర్ల గుర్తింపు**

నరహరిరావుకు చెందిన బ్యాంకు ఖాతాల పాసుపుస్తకాల్ని పరిశీలించగా వాటిలో రూ.2.29 కోట్లు ఉన్నట్లు తేలింది. బ్యాంకుల్లో ఏకంగా రూ.5.04 కోట్ల మేర ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నట్లు వెల్లడైంది. దీంతో ఆయా ఖాతాల్ని స్తంభింపజేయాలని బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. నరహరిరావు భార్య పేరిట రెండు లాకర్లున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇంట్లోనే అంత భారీగా నగదు, ఆభరణాలు లభ్యం కావడంతో లాకర్లలో మరింతగా సొత్తు ఉంటుందని అనుమానిస్తున్నారు. బుధవారం వాటిని తెరవనున్నారు. సోదాల అనంతరం మంగళవారం సాయంత్రం నరహరిరావును అరెస్టు చేసినట్లు ప్రకటించారు. బుధవారం న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.

## జగిత్యాల జిల్లాలో ఎవరు ఏ పార్టీనో తెలియడం లేదు

- మొదటి పేజీ తరువాయి

రూ.3 లక్షలు ఇచ్చిందన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలు చేయొద్దని, నేతల ఫ్లెక్సీల కోసం పెట్టిన ఖర్చు ఆరోగ్య కేంద్రానికి వెచ్చిస్తే మరింత అభివృద్ధి జరిగేదన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన యూరియా యాప్‌తో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మాట్లాడిన అనంతరం ఎంపీ తనకు పని ఉందని అక్కడి నుంచి వెళ్లిపోయారు.ఎమ్మెల్యే డా.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తాను రెండున్నర గంటలు ఎంపీ కోసం వేచి చూస్తే సభా మర్యాద పాటించకుండా మధ్యలోనే వెళ్లిపోయారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఎస్టీ రూపంలో కేంద్రానికి వెళ్లే రూ.100లో రూ.41 మాత్రమే తెలంగాణకు నిధుల రూపంలో ఇస్తున్నారని పేర్కొన్నారు. యూరియా
సరఫరాలో కేంద్రం కోత విధించినందునే రాష్ట్ర ప్రభుత్వం యాప్ తీసుకొచ్చిందన్నారు. ఎంపీ అహంకారంతో మాట్లాడుతున్నారని, నియోజకవర్గ అభివృద్ధి కోసం అవసరమైతే తాను కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు. పల్లె దవాఖానాకు తన నియోజకవర్గ నిధుల నుంచి రూ.2 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

## ఫీజుల దోపిడీ... భగ్గుమన్న ఏబీవీపీ.. హైదరాబాద్‌లో ఉద్రిక్తత, పలువురి అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ కార్యాలయం ముట్టడికి యత్నించిన పలువురు ఏబీవీపీ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు.వివరాల్లోకి వెళితే, ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ నేతృత్వంలో విద్యార్థి సంఘం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో సైఫాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయానికి చేరుకున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ క్రమంలో కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. అనంతరం పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకుని సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు.

ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని నియంత్రించేందుకు తక్షణమే 'ఫీజుల నియంత్రణ చట్టం' తీసుకురావాలని ఏబీవీపీ చాలాకాలంగా డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వ ఆదేశాలు, హామీలు ఉన్నప్పటికీ, 2026-27 విద్యా సంవత్సరానికి హైదరాబాద్‌లోని అనేక పాఠశాలలు 20 నుంచి 50 శాతం వరకు ఫీజులు పెంచేశాయని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు. దీనికి తోడు పుస్తకాలు, యూనిఫామ్‌ల పేరుతో వేల రూపాయలు అదనంగా వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారు మండిపడ్డారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫీజుల నియంత్రణకు కఠిన నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించినప్పటికీ, ఇంతవరకు సమగ్ర చట్టం కార్యరూపం దాల్చలేదు. ప్రభుత్వ
జాప్యాన్ని ఆసరాగా చేసుకుని యాజమాన్యాలు ఫీజుల భారం మోపుతున్నాయని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పటిష్ఠమైన చట్టాన్ని అమలు చేయాలని తల్లిదండ్రుల సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## దక్షిణ కోస్తాంధ్ర వరకు విస్తరించిన ద్రోణి

- మొదటి పేజీ తరువాయి

కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. మిగతా జిల్లాలో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయి. మరోవైపు ఎండ ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. గుండె సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఎండలో తిరగరాదు' అని సూచించింది.

## నీట్ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్‌పై తాత్కాలిక నిషేధం

- మొదటి పేజీ తరువాయి

టెలిగ్రామ్ సీఈఓ పావెల్ దురోవ్ స్పందించారు. కొందరు చేసే తప్పులకు భారత్‌లోని 150 మిలియన్ల మంది సాధారణ వినియోగదారులను శిక్షించడం సమంజసం కాదని ఆయన 'ఎక్స్' వేదికగా విమర్శించారు. ఈ నిషేధం వల్ల ఆశించిన ప్రయోజనం ఉండదని, లీకేజీలకు పాల్పడేవారు ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారని ఆయన అభిప్రాయపడ్డారు.కాగా, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గూగుల్ ఇప్పటికే తన ప్లే స్టోర్ నుంచి టెలిగ్రామ్‌ను తొలగించగా, యాపిల్ కూడా త్వరలోనే ఈ దిశగా చర్యలు తీసుకోనుంది.నీట్ పునఃపరీక్ష నేపథ్యంలో కొందరు కేటుగాళ్లు టెలిగ్రామ్ ఛానెళ్ల వేదికగా నకిలీ ప్రశ్నపత్రాలు విక్రయిస్తామంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పాత మెసేజ్‌లను ఎడిట్ చేస్తూ ప్రశ్నాపత్రాలు లీకైనట్లు నకిలీ ఆధారాలను సృష్టిస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. ఈ తరహా మోసాలకు అడ్డుకట్ట వేసేందుకే ప్రభుత్వం ఈ యాప్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించింది. అంతేకాకుండా, జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను కూడా నిలిపివేశారు.

## ఫ్రాన్స్‌లో జీ7 సదస్సు.. కరచాలనం చేసుకున్న మోదీ, ట్రంప్

- మొదటి పేజీ తరువాయి

వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పరం కరచాలనం చేసుకుని, ప్రత్యేకంగా చర్చించుకోవడం విశేషం.ఈ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, రష్యా చమురుపై త్వరలోనే అమెరికా మళ్లీ ఆంక్షలు విధించే అవకాశం ఉందని సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌తో ఇటీవలే కుదిరిన ఒప్పందం కారణంగా హర్మూజ్ జలసంధి గుండా చమురు సరఫరా సులభతరమైందని, ఇది రష్యాపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పిస్తుందని ఆయన వివరించారు. ఉక్రెయిన్‌పై దాడి నేపథ్యంలో మాస్కోపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు జీ7 దేశాలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.సాధారణంగా జీ7 సభ్య దేశాలు, తాము ఆహ్వానించిన ఇతర దేశాల అధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులతో కలిసి ఈ ఔట్‌రీచ్ సెషన్‌ను నిర్వహిస్తాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న కీలక ఆర్థిక, రాజకీయ సవాళ్లపై విస్తృతంగా చర్చించి, సరైన పరిష్కార మార్గాలను కనుగొనడమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం.

## కాంగ్రెస్ వైఖరిపై బండి సంజయ్ నిప్పులు.. తెలంగాణకు రూ. 10 లక్షల కోట్లు కేటాయించామని వెల్లడి

- మొదటి పేజీ తరువాయి

కట్టుబడి ఉంటుందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లా మానకొండూరులో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.దేశంలోకి అక్రమంగా చొరబడిన వలసదారుల గురించి కాంగ్రెస్ ఎందుకు మౌనంగా ఉందో సమాధానం చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులతో ఇక్కడి ముస్లిం సమాజాన్ని పోల్చడం ద్వారా కాంగ్రెస్ వారిని అవమానిస్తోందని, తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత పన్నెండేళ్లలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్రం ఏకంగా రూ. 10 లక్షల కోట్లు కేటాయించిందని వెల్లడించారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల అభివృద్ధికి వేల కోట్లు ఇచ్చామన్నారు. రాష్ట్రం వేగంగా దూసుకుపోవాలంటే 'డబుల్ ఇంజన్ సర్కార్' రావాలని, ఈసారి ఒక్క అవకాశం బీజేపీకి ఇవ్వాలని ప్రజలను కోరారు.మావోయిస్టుల గురించి మాట్లాడుతూ... సమాజంలో తుపాకీ సంస్కృతి, మారణహోమంతో సాధించేది ఏమీ లేదన్నారు. ఏమీ తెలియని మైనర్ పిల్లల చేత తుపాకులు పట్టించడం అత్యంత దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది మావోలు లొంగిపోయారని, ఇంకా ఆ ఆలోచనల్లో ఉన్నవారు భవిష్యత్తు కోసం మారాలని పిలుపునిచ్చారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్



ఏసిబి సోదాలు నిర్వహించిన తాజా ఫొటో..

# నరహరి..! ఏసిబి వలలో 'హారీ'..!

## అవినీతి తిమింగలం..! మితిమీరిన సంపాదనపై 'అనిశా' పంజా..!

ఆర్‌డిడి సర్వేయర్ నరహరి అవినీతి సంపాదనపై 'అనిశా' దాడుల్లో దిమ్మతిరిగే అక్రమాస్తులు వెలుగులోకి వస్తున్నాయి.. అవినీతి గనిలో తవ్వినా కొద్ది ఆస్తులు బయట పడుతున్నాయి.. మరోవైపు ఈ ఏసిబి దాడుల నేపథ్యంలో, పలువురు ఫిర్యాదు దారులు ఆయనను సంప్రదించిన సమయంలో, ఆర్‌డిడి నరహరి వ్యవహార శైలిపై కథలు కథలుగా వినిపిస్తున్నారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోనూ మూడు చోట్ల, సారు చేతివాటం ప్రదర్శించినట్టు ఆరోపణలు ఉన్నాయి.. బాచుపల్లి మండలం, నిజాంపేట్ గ్రామ పరిధిలోని సర్వే నెం.334 ప్రభుత్వ భూమిని సుమారు 20 గుంటలు "పావని కన్‌స్ట్రక్షన్" సంస్థ ఆక్రమణపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆర్‌డిడి సర్వేకు రాసిన లేఖను కూడా, 6 నెలలుగా బేఖాతర్.. గాజులరామారం సర్వే నెం.19 అటవీశాఖ భూమిపై "నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్" కోర్టు ఆదేశానుసారం సర్వే వ్యవహారం లోనూ, ప్రైవేటు వ్యక్తులకు కట్ట బెట్టినట్టు గ్రహించి ఎన్‌జిటి సీరియస్.. గాజులరామారంలో సర్వే నెంబర్ 328 పట్టా భూమిలో ఆర్‌డిడి సర్వే జాప్యంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జూన్ 16:

- హోదా పెద్దదే అయినా..! బుద్ధి మాత్రం అవినీతి మయం..
- గాజులరామారం ఫారెస్ట్ భూముల్లోనూ ఆర్‌డిడి సర్వేపై 'ఎన్‌జిటి' అసంతృప్తి..!
- మళ్ళీ మొదటి నుండి సర్వే నిర్వహించాలని ఎన్‌జిటి కీలక ఉత్తర్వులు..
- గాజులరామారం సర్వే నెం.328 పేరుతో 329 ప్రభుత్వ భూమికి ఏడి తప్పుడు సర్వే.
- ఆర్‌డిడికి 'రీ సర్వే' కోసం జిల్లా కలెక్టర్‌కు కుత్బుల్లాపూర్ తహశీల్దార్ లేఖ..!
- 6 నెలలు గడిచినా 'ఆర్‌డిడి సర్వే' ఊసేలేదు..!
- నిజాంపేట్ పావని కన్‌స్ట్రక్షన్‌లో, సర్వే నెం.334 ప్రభుత్వ భూమి కబ్జాలోనూ..!
- ఏడి సర్వేయర్ చేతివాటం తప్పుడు నివేదికపై 'ఆర్‌డిడి' సర్వేకు కలెక్టర్ లేఖ..
- మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆర్‌డిడి సర్వేకు లేఖ రాసినా..! నేటికీ పెండింగ్..!
- ఆర్‌డిడి నరహరి ఒక్క కుత్బుల్లాపూర్ లోనే ఇన్ని..! మరి ఇతర ప్రాంతాలలో..?

- తెలంగాణ ల్యాండ్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ నరహరి నివాసంపై ఏసిబి రైడ్స్..
- దాడుల్లో భారీగా అక్రమాస్తులు గుర్తించిన 'అవినీతి నిరోధక శాఖ' అధికారులు..
- అటకపై సంచుల్లో దాచిన రూ.1.2 కోట్ల నగదు స్వాధీనం..!
- బెడ్ కింద రూ.1.10 కోట్లు..!భారీగా బంగారు ఆభరణాలు, కీలక పత్రాలు గుర్తింపు..
- మధ్యాహ్నానికే భారీగా అక్రమాస్తులు గుర్తించినట్లు సమాచారం..
- బ్యాంక్ లాకర్లలో తనిఖీలు.. కొనసాగుతున్న సోదాలు..
- ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలో దాడులు..

-4లో



ఆర్‌డిడి నరహరి వద్ద సోదాలలో దొరికిన నగదు..




ఆర్‌డిడి సర్వే అధికారి నరహరి రావు.. ఫైల్‌ఫొటో..

# సుచిత్రలో ఉచిత యోగా శిబిరం..



## అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ఉచిత శిబిరం..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూన్ 16:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న సుచిత్ర కూడలిలో ఉచిత యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు యోగా గురూజీ కె. రవీందర్ రాజు తెలిపారు. శివోహం యోగా రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన వెల్లడించారు.. జూన్ 21న ఉదయం 5.30 గంటల నుంచి 7.30 గంటల వరకు యోగా శిబిరం కొనసాగుతుందని పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని అన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు, యోగా సాధకులు, ఆరోగ్యంపై ఆసక్తి ఉన్నవారు ఈ ఉచిత శిబిరంలో పాల్గొని యోగాభ్యాసం ద్వారా ప్రయోజనం పొందాలని నిర్వాహకులు కోరారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.





# 'అన్నదాతలకు' సంపూర్ణ భరోసా

- వానాకాలం సీజన్‌కు 26 నుంచి రైతుభరోసా నిధుల జమ
- విత్తనాల నుంచి కొనుగోళ్ల దాకా సమగ్ర ప్రణాళిక
- కార్యాచరణకు ప్రత్యేక కమిటీ
- రైతు వేదికల్లో ఎరువుల పంపిణీ
- సబ్సిడీపై 7 రకాల సన్న వడ్ల విత్తనాలు
- ఎరువుల కోటా కోసం ఎంపీలతో కలిసి దిల్లీకి మంత్రుల బృందం
- వ్యవసాయశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**వానాకాలం సీజన్‌లో విత్తనాల సరఫరా నుంచి పంట కొనుగోళ్ల వరకు అన్నదాతలకు సంపూర్ణ భరోసా కల్పించేలా సమగ్ర ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. నిర్దిష్ట కార్యాచరణకు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. మంగళవారం ఎంసీహెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఆయన వ్యవసాయశాఖపై సమీక్ష నిర్వహించారు. ఇందులో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, రైతు సమస్యల పరిష్కారానికి వ్యవసాయ కమిషన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ నిపుణుల సూచనలపై సమీక్షించారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా పథకం నిధుల విడుదలకు సన్నాహాలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ, ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. ఎకరానికి రూ.6 వేల చొప్పున రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాల కోసం రూ.9 వేల కోట్లను విడుదల చేయాలని వ్యవసాయశాఖ ప్రతిపాదించగా... దానికి ఆయన ఆమోదం తెలిపారు. ఈ మేరకు నిధులు విడుదల చేయాలని ఆర్థికశాఖకు సూచించారు. వ్యవసాయ, ఆర్థికశాఖలు ఈ నెల 18న జరిగే మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు ప్రతిపాదనలు సమర్పించనున్నాయి. ఈ నెల 26న తొలిరోజున రాష్ట్రంలో మొత్తం 73 లక్షల మంది రైతులకు ఎకరం వరకు

-4లో




# భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను.. ఎస్పీ ఆకస్మిక తనిఖీ..

## నేరాల నియంత్రణపై ఫోకస్, గస్తీ పెంచాలని ఆదేశం..

- భిక్నూర్ పీఎస్‌ను కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర ఆకస్మిక తనిఖీ..
- పెండింగ్ కేసులపై ఫైళ్లు పరిశీలించిన ఎస్పీ ప్రత్యేక సమీక్ష..
- తరచూ గస్తీ, నాకాబందీలు పెంచాలని ఆదేశం..
- రౌడీషీటర్లపై నిరంతరం నిఘా పెంచాలని సూచించిన కామారెడ్డి ఎస్పీ..
- ఫిర్యాదు దారులకు మెరుగైన సేవలు అందించేందుకు దృష్టి పెట్టాలి..

-4లో



# నరహరి..! ఏసిబి వలలో 'హరీ'..!



ఆర్‌డిడి నరహరి ఇంటివద్దకు చేరుకున్న ఏసిబి అధికారులు,




ఆర్‌డిడి సర్వే కమిషనర్ కార్యాలయం..

- 3 పేజి తరువాయి

ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో, ఆర్‌డిడి నరహరిపై ఏసీబీ పంజా విసిరింది.. సర్వే నిజం.. అవినీతి నిజం, సర్వే చేస్తే కాసుల వర్షం కురవాల్సిందేనట.. ఆర్డీడీ నరహరి మాయలు ఇంతింత కాదయా అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు.. కిలోల్లో బంగారం.. కోట్లల్లో డబ్బు స్వాధీనం, రూ.కోట్లు విలువైన ఆస్తులు గుర్తించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు.. ఒకటొకటిగా బయట పడుతున్నాయి.. సర్వే ల్యాండ్ రికార్డ్స్ మల్టీ జోన్ – 2 డిప్యూటీ డైరెక్టర్ హోదాలో పనిచేస్తున్న నరహరిపై అనేక అవినీతి ఆరోపణలు..! ప్రతీ ల్యాండ్ రికార్డ్స్ విషయంలో క్రింది స్థాయి సిబ్బందితో కలిసి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి..! ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ నేతృత్వంలో ఛత్రినాక లోని నరహరి నివాసం.. నారాయణగూడ సర్వే భవన్ తోపాటు 10 చోట్ల ఈ సోదాలు నిర్వహించారు.. అయితే దాదాపు రూ.13 కోట్లకు పైగా ఆస్తులు గుర్తించారు.. ఏసీబీ అధికారులు నరహరి రావు నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, సన్నిహితులకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో రంగారెడ్డి జిల్లాలో ఐదు ఓపెన్ ప్లాట్లు, మహేశ్వరం వద్ద 1.24 ఎకరాల వ్యవసాయ భూమి, పుప్పాలగూడలో 2,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒక ఫ్లాట్, నార్సింగ్‌లో రెండు విలాసవంతమైన ఫ్లాట్లు, రాజేంద్రనగర్‌లో మరో ఫ్లాట్ ఉన్నట్లు గుర్తించారు.. అదనంగా గచ్చిబౌలిలో టీఎన్‌జీఓస్ కాలనీలో 3 అంతస్తుల భవనం, ఛత్రినాకలో 2 అంతస్తుల నివాస భవనం ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.. సోదాల సందర్భంగా సుమారు రూ.1.54 కోట్ల నగదు, రూ.2.29 కోట్ల బ్యాంకు నిల్వలు, రూ.5.04 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, 1.3 కిలోల బంగారు ఆభరణాలు, 8 కిలోల వెండి వస్తువులు లభ్యమైనట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.. నిందిత అధికారి భార్య పేరిట ఉన్న రెండు లాకర్లను కూడా గుర్తించగా, వాటిని త్వరలో తెరిచి పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.. అంతేకాకుండా ఒక కియా క్యారెన్స్ కారు కూడా స్వాధీనం చేసుకున్నారు. సోదాల్లో ఇప్పటివరకు గుర్తించిన ఆస్తుల విలువ రూ.13.05 కోట్లకు పైగా ఉందని, మార్కెట్ విలువ దీనికంటే పలుమార్లు అధికంగా ఉండే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.. మరిన్ని ఆస్తుల వివరాలపై విచారణ కొనసాగుతోందని, నిందిత అధికారిని నాంపల్లిలోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు 'అనిశా' అధికారులు తెలిపారు..

## పిర్యాదు దారుల పట్ల నిర్లక్ష్య ధోరణి..!

ప్రస్తుతం అనిశా దాడులు ఎదుర్కొంటున్న ఆర్‌డిడి నరహరి, కలెక్టర్ లేఖను, లెక్క పెట్టకుండా గత ఆరు నెలలుగా బేఖాతర్ చేస్తున్నారని ఓ ఫిర్యాదు దారుడు పెన్ పవర్ ప్రతినిధితో ప్రస్తావించారు.. ఓ సమయంలో ఆర్‌డిడి నరహరి తనపట్ల వ్యవహారించిన తీరుపై బాధాకరమని అన్నారు.. నరహరి మాటల తీరును ఫోన్‌లో ఇలా వివరించారు.. తమకు ఇదొక్కటే కాదు, చాలా పనులు ఉంటాయనిఉంటాయని కొంచెం దురుసుగానే వ్యవహరించారట.. ఏది ఎప్పుడు జరగాలో అప్పుడే జరుగుతుందని, మమ్మల్ని అడగొద్దని కఠినమైన స్వరంతో సమాధానం, ఎంతో బాదించినదని, పేర్కొన్నారు.. ఏమన్నా ఉంటే లేఖ రాసిన కలెక్టర్‌నే అడగమని చెప్పడం గమనార్హం.. నెలక్రితం ఆర్‌డిడి అధికారి అహంకారపూరిత వ్యాఖ్యలకు ఏసిబి దాడులతో తగిన గుణపాఠం జరిగిందని సంబంధిత ఫిర్యాదు దారుడు హర్షం వ్యక్తం చేశారు..

## పావని కన్‌స్ట్రక్షన్‌పై సర్వేకు కలెక్టర్ లేఖ.. ఆర్‌డిడి బేఖాతర్..

బాచుపల్లి మండలం నిజాంపేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 331, 332, 334 భూముల సరిహద్దుల వివాదంపై జిల్లా కలెక్టర్ ఉన్నతస్థాయి సర్వే నిర్వహించాలని సర్వే సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌కు 6 నెలల క్రితమే లేఖ రాశారు.. స్థానికుల ఫిర్యాదు, పత్రికా కథనాల నేపథ్యంలో బాచుపల్లి తహసీల్దార్, సర్వే అధికారులు సమర్పించిన నివేదికలను పరిశీలించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, భూముల హద్దుల విషయంలో స్పష్టత లేదని పేర్కొన్నారు. సర్వే నంబర్ 331లోని 4 ఎకరాల 34 గుంటల పట్టా భూమికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్లు 332, 334 ప్రభుత్వ భూములపై ఆక్రమణల ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో పలుమార్లు సర్వేలు నిర్వహించినట్లు నివేదికల్లో వెల్లడైంది.. అయితే అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సమర్పించిన నివేదికలపై తహసీల్దార్ అభ్యంతరం వ్యక్తం చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. పట్టా భూమి, ప్రభుత్వ భూముల మధ్య హద్దులు ఇంకా ఖరారు కాలేదని, నివేదికల్లో పలు వ్యత్యాసాలు ఉన్నాయని తహసీల్దార్ వెల్లడించారు.. ఈ నేపథ్యంలో నిజాంపేట్ గ్రామంలోని సర్వే నంబర్లు 331, 332, 334లలో పట్టా భూములు మరియు ప్రభుత్వ భూముల మధ్య ఖచ్చితమైన సరిహద్దులను నిర్ధారించేందుకు ఉన్నత స్థాయి సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కమిషనర్‌ను కోరారు..

## అటవీశాఖ భూమిలోనూ.. ఆర్‌డిడి తప్పుడు సర్వే..

మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గజులరామారం గ్రామ శివారు సర్వే నెం.19 అటవి భూభాగం కబ్జా వివాదంపై ఎన్‌జిటి సంచలన ఆరోపణలు చేసింది.. లోప భూయిష్టమైన సర్వేగా, అక్రమ, ఆక్రమణలపై "నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సౌత్‌జోన్" కీలక ఆదేశాలు జారీ చేసింది.. అటవీశాఖ నివేదిక ప్రకారం "1957--58 పహాణి, గ్రామ నక్షా" ప్రకారం సర్వే నెం.19 మొత్తం 471--14 ఎకరాలు అటవీభూమి ఉన్నట్లు ఫారెస్ట్ నివేదికలో ఉంది.. అయితే సర్వే టీమ్ (ఆర్‌డిడి) సమర్పించిన నివేదికలో 430--00 ఎకరాలు మాత్రమే చూపించడం, ఫారెస్ట్ భూమి తగ్గడంపై ఎన్‌జిటి అసంతృప్తి వ్యక్తం చేసింది.. 146 మీటర్ల వెడల్పు, 900 మీటర్ల పొడవు ఉన్న ముఖ్య ప్రదేశాన్ని సర్వే టీమ్ ఉద్దేశపూర్వకంగానే వదిలేసినట్లు ఫారెస్ట్ శాఖ నివేదికలో ప్రస్తావించినట్లు "ఎన్‌జిటి" గుర్తు చేసింది.. "ట్రై జంక్షన్ నుండి బై జంక్షన్" వరకు 678 మీటర్లు మాత్రమే (ఆర్‌డిడి) చూపిస్తున్నారని. నిజానికి 900 మీటర్‌లు ఉండాల్సిందిగా పేర్కొంటూ, సంబంధిత తప్పుడు నివేదికను అటవీశాఖ ఆమోదించలేదు.. ఈ నేపథ్యంలోనే ఎన్‌జిటి కీలక ఆదేశాలు జారీచేసింది.. "అటు అటవీశాఖ– ఇటు ఆర్‌డీడి" సర్వే విభాగం కూడా విడివిడిగా సర్వేలు నిర్వహించాలని ఎన్‌జిటి ఆదేశించడం, ఇద్దరూ కూడా సర్వే నివేదికలు, వేరువేరుగా కౌంటర్ ఫైల్ చేయాలని "ఎన్‌జిటి ఆర్డర్"లో స్పష్టంగా పేర్కొంది.. ఫారెస్ట్ భూమిని ఎవరు, ఎక్కడ, ఎంత భూమిని కబ్జాచేశారో వివరాలతో పాటు, కబ్జాదారుల వివరాలు, ఎంత కబ్జా చేశారనే వివరాలను స్పష్టమైన ఆధారాలతో నివేదిక సమర్పించాలని "నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్" కీలక ఆదేశాలు జారీ చేసింది..


---



భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో రోల్ కాల్‌లో ఎస్పీ రాజేష్ చంద్ర ఐపీఎస్..

# భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను.. ఎస్పీ ఆకస్మిక తనిఖీ..

## నేరాల నియంత్రణపై ఫోకస్, గస్తీ పెంచాలని ఆదేశం..



- భిక్నూర్ పీఎస్‌ను కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర ఆకస్మిక తనిఖీ..
- పెండింగ్ కేసులపై ఫైళ్లు పరిశీలించిన ఎస్పీ ప్రత్యేక సమీక్ష..
- తరచూ గస్తీ, నాకాబందీలు పెంచాలని ఆదేశం..
- రౌడీషీటర్లపై నిరంతరం నిఘా పెంచాలని సూచించిన కామారెడ్డి ఎస్పీ..
- ఫిర్యాదు దారులకు మెరుగైన సేవలు అందించేందుకు దృష్టి పెట్టాలి..

**భిక్నూర్, పెన్ పవర్, జూన్ 16:** కామారెడ్డి జిల్లా ఎస్పీ ఎం.రాజేష్ చంద్ర ఐపీఎస్ మంగళవారం భిక్నూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు.. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై రోల్ కాల్ ప్రాముఖ్యతను వివరించి, వారి విధులు, బాధ్యతలపై పలు సూచనలు చేశారు.. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఆర్థిక నేరాలు, దొంగతనాలు తదితర కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.. పెండింగ్ కేసులను ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.. నేరాల నియంత్రణలో భాగంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడం తోపాటు పగలు, రాత్రి గస్తీని పెంచాలని సూచించారు..

### తనిఖీలు- నాకాబందీలు చేపట్టాలి..

తరచూ వాహనాల తనిఖీలు, నాకాబందీలు నిర్వహిస్తూ అనుమానిత వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, కేడీలు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు..సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, రోడ్డు భద్రతా అంశాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని భిక్నూర్ ఎస్‌హెచ్‌వోకు సూచించారు. గ్రామాలు, కాలనీల్లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో పోలీసులపై విశ్వాసం పెంపొందించాలని అన్నారు.. విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధత, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సిబ్బందికి సూచించిన ఎస్పీ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా విని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు..

# 'అన్నదాతలకు' సంపూర్ణ భరోసా

- 3 పేజి తరువాయి

సాయం అందేలా నిధులను విడుదల చేస్తారు. మిగిలిన రైతులకు విడతల వారీగా నిధులు జమ చేస్తారు.

**ప్రత్యేక కమిటీ వేయాలి..**

"ఏ రైతు ఏ పంట వేశారు.. ఏ గ్రామంలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో ఉన్నాయి.. ఇలా అన్ని వివరాలు కచ్చితంగా క్షేత్రస్థాయి పరిశీలనతో నమోదు చేయాలి. కేంద్రం నిర్దేశించిన కోటాలను అనుసరించి రాష్ట్రంలో ఆయా పంట ఉత్పత్తుల కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోండి. ధాన్యం కొనుగోళ్ల సమయంలో అకాల వర్షాలను గమనంలోకి తీసుకొని తూకం, రవాణా, నిల్వ, మార్కెటింగ్ వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయడం చాలా కీలకం. రైతులు ఎక్కడా ఇబ్బంది పడకుండా వచ్చే సీజన్ నుంచే కొనుగోళ్లు సాఫీగా జరిగేలా వ్యవసాయ శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆ శాఖ సంచాలకుడు, ప్రణాళిక శాఖ కార్యదర్శి, పౌరసరఫరాల సంచాలకునితో ప్రత్యేక కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలి.

**వ్యవసాయ వర్సిటీ ద్వారా సాంకేతికత**

వ్యవసాయ శాఖలో సాంకేతికత వినియోగాన్ని మరింత పెంచుకోవాలి. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని నోడల్ ఏజెన్సీగా నియమించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయాలి. ఏఐ ఆధారిత విధానాలను సమర్థంగా వినియోగించాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో ప్రారంభించిన ఏఐ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలను అధ్యయనం చేయాలి.

**వేదికలు అన్నింటికీ ఉపయోగపడాలి**

రైతు వేదికలను ఇకపై అన్నింటికీ ఉపయోగపడే కేంద్రాలుగా తీర్చిదిద్దాలి. అక్కడే రైతులకు విత్తనాలు, ఎరువుల పంపిణీ జరగాలి. ప్రతి వేదిక వద్ద వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ విభాగాల నుంచి ఒక్కో అధికారి అందుబాటులో ఉండాలి. జిల్లాల్లో వాటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను అదనపు కలెక్టర్లకు అప్పగించాలి. సన్న వడ్లు పండించే రైతులకు బోనస్ ఇస్తున్న నేపథ్యంలో వాటిని పండించే రైతుల పూర్తి వివరాలను సేకరించండి. వ్యవసాయశాఖ నిర్దేశించిన ఏడు రకాల సన్న వడ్ల విత్తనాలను సమృద్ధిగా నిల్వ చేసి రైతులకు సబ్సిడీపై ఇవ్వాలి.

**'రామగుండం' ఎరువులు తెలంగాణకే..**

అన్నిరకాల ఎరువులను యాప్ ద్వారా బుక్ చేసుకునే విధానం తేవాలి. సంబంధిత యూరియాను రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలి. యూరియా పంపిణీ బాధ్యతను అదనపు కలెక్టర్లకు అప్పగించాలి. వానాకాలం సీజన్‌కు అవసరమైన యూరియా, ఇతర ఎరువుల కోటాపై కేంద్రంపై ఒత్తిడి తేవాలి. ఎప్పటికప్పుడు లేఖలు రాయాలి. రామగుండం ఎరువుల కర్మాగారంలో ఉత్పత్తి అయ్యేవాటిల్లో అత్యధికం తెలంగాణకే కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. రాష్ట్రంలో ఎరువుల పరిస్థితిపై అన్ని పార్టీల ఎంపీలతో సమావేశం నిర్వహించి వాస్తవ పరిస్థితిని వివరించాలి. అవసరమైతే మంత్రులు, ఎంపీల బృందం దిల్లీకి వెళ్లి కేంద్రానికి విజ్ఞప్తి చేయాలి.

**మార్క్‌ఫెడ్ నష్టాలు తగ్గాలి...**

మార్క్‌ఫెడ్ నష్టాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. వ్యాపారులకు తలొగ్గకుండా ఈసారి ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరించి మొక్కజొన్న కొనుగోళ్లతో వచ్చే నష్టాన్ని తగ్గించింది. గతంలో టన్ను రూ.13 వేలకు అమ్మారు. ఈసారి దాదాపు రూ.21 వేలకు పైగా టెండర్ రేట్ వచ్చింది. అలాగే ఆయిల్‌ఫెడ్‌ను మరింత బలోపేతం చేసి లాభాల బాట పట్టించాలి. ప్రభుత్వ డెయిరీని మరింత బలోపేతం చేయాలి. పాడి రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరగాలి" అని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ఎల్‌నినో నేపథ్యంలో రాష్ట్రంలో పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు వీలుగా ప్రత్యామ్నాయ పంటలు వేసే రైతులకు బోనస్ అమలుపైనా ఈ సమావేశంలో చర్చించారు. ఆయా పంటలకు ఉత్పత్తి ఆధారంగా కాకుండా విస్తీర్ణం ఆధారంగా బోనస్ ఇవ్వాలనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీనికి సంబంధించి సమగ్ర ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం సూచించినట్లు తెలిసింది.

**వ్యవసాయం–2047 నివేదిక విడుదల**

వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య రూపొందించిన తెలంగాణ వ్యవసాయం–2047 నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. వీసీ రాసిన భారతదేశ హరితవిప్లవ రూపశిల్పి ఇందిరాగాంధీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఖాళీగా ఉన్న 550 బోధనా సిబ్బంది పోస్టుల భర్తీకి హామీ ఇచ్చారు. సంబంధిత దస్త్రాలను ఆమోదించి తన వద్దకు పంపించాలని ఆర్థికశాఖ అధికారులను ఆదేశించారు. మౌఖిక పరీక్షలు లేకుండా రాత పరీక్ష ఆధారంగా, పారదర్శకంగా పోస్టులను భర్తీ చేయాలని సూచించారు.

# ప్రేమ పేరుతో పని మనిషిని గర్భవతిని చేసిన వ్యాపారి కొడుకు

**స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో కేసు నమోదు చేయని పోలీసులు**

**రంగారెడ్డి: పెన్ పవర్:** కొడంగల్ నియోజకవర్గం కోస్గి పట్టణంలో తమ ఇంట్లో పని చేసే 20 ఏళ్ల యువతిని బంగారు వ్యాపారి కుమారుడు సాయికృష్ణ ప్రేమ పేరుతో గర్భవతిని చేసాడు. మూడు నెలల గర్భవతి కావడంతో ఆమెను పెళ్లి చేసుకోవాలని సాయికృష్ణ కుటుంబసభ్యులను యువతి కుటుంబసభ్యులు అడగగా.. సాయికృష్ణ తండ్రి స్థానిక పెద్ద మనుషులతో మంతనాలు జరిపాడు. తనను నమ్మించి గర్భవతిని చేసి మోసం చేశాడని, కులం పేరుతో దూషించి దాడి చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. స్థానిక రాజకీయ నాయకులు మాట్లాడుకుంటామని సర్ది చెప్పడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. చివరికి యువతి ఒత్తిడితో సాయికృష్ణపై అట్రాసిటీ కేసు నమోదు చేసారు. యువతిని పరీక్షల నిమిత్తం యువతిని నారాయణపేట జిల్లా కేంద్రానికి తరలించారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వైభవంగా స్వర్ణరథోత్సవం

**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీశైల దేవస్థానంఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఈ రోజు శ్రీస్వామిఅమ్మవార్లకు స్వర్ణరథోత్సవం నిర్వహించబడింది.కాగా ఆరుద్రోత్సవంలో భాగంగా ఈ రోజు వేకువజామున శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేషపూజలు నిర్వహించబడ్డాయి.అనంతరం స్వర్ణరథోత్సవం జరిపించబడింది. ఈ స్వర్ణరథోత్సవంలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని, అతివృష్టి అనావృష్టి నివారించబడాలని, ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా సకాలంలో తగినంత వర్షాలు కురిసి దేశం పాడిపంటలతో తులతూగాలని, జనులందరికీ ఆయురారోగ్యాలు కలిగి వారికి అకాల మరణాలు రాకుండా ఉండాలని, దేశంలో అగ్నిప్రమాదాలు, వాహన ప్రమాదాలు మొదలైనవి జరగకుండా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలంటూ ఆలయ అర్చకులు లోకకల్యాణానికాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. తరువాత రథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు జరిపించబడ్డాయి.అనంతరం భక్తుల శివనామస్మరణతో వేదమంత్రాల నడుమ ఉదయం గం.7.30లకు ఈ స్వర్ణరథోత్సవం ప్రారంభమైంది. గంగాధర మండపం నుంచి నందిమండపం వరకు తిరిగి అక్కడి నుండి నంది మండపం వరకు ఈ రథోత్సవాన్ని జరిపించడం జరిగింది.సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా రథోత్సవంలో పలు కళా బృందాల కోలాటం, తప్పెట చిందులు, మొదలైన జానపద కళారూపాలు కూడా ఏర్పాటు చేయబడ్డాయి. ఈ కార్యక్రమములో కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యురాలు జిల్లెల శ్రీదేవి, సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు అర్చకస్వాములు, పలువిభాగాల అధికారులు, పర్యవేక్షకులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# ఇన్నోవా వాహనంతో పాటుగా 8 ఎర్రచందనం దుంగలు స్వాదీనం..!

**సిద్దవటం రేంజర్ బి కళావతి,..**

**హైదరాబాద్ పెన్ పవర్:** సిద్దవటం బీటులో ఇన్నోవా వాహనంతో పాటుగా 8 ఎర్రచందనం దుంగలు స్వాదీనం చేసుకున్నట్లు రేంజర్ బి. కళావతి తెలిపారు.సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలోఆమె మాట్లాడుతూ కడప డిఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాలతో సిద్దవటం బీటు నల్లబండల రస్తా ప్రదేశంలో తెల్లవారుఝ్హామునఎర్రచందనం
దుంగలుతరలించేందుకులోడుచేస్తున్నారనేసమాచారంతెలిసిందన్నారుఈమేరకుసిబ్బంది.తోకలిసిదాడులునిర్వహించామన్నారు.ఈ దాడు,లలోనిందితులుపరారవగాఇన్నోవా,వాహనంతో పాటుగా 8 ఎర్రచందనందుంగలుస్వాదీనంచేసుకున్నామన్నారు.పరారైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ మక్తర్ బాషా, సెక్షన్ ఆఫీసర్ సురేష్ బాషా, ఎఫ్బీఓ ఆది విశ్వనాథ్, ఏబీఓ హైమావతి, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

# నిర్మల్ జిల్లాలో ఉద్రిక్తత గిరిజనులను అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్ పెన్ పవర్:** కడెం మండలం మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు వ్యవసాయ భూముల హద్దులు చూపిస్తూ హద్దు రాళ్లను పాతుతున్న రెవిన్యూ అధికారులను గిరిజనులు అడ్డుకున్నారు. తమ గ్రామ గిరిజనులకు భూములు కేటాయించిన తర్వాతే హద్దులు చూపించాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేసారు. అడ్డుకున్న గిరిజనులను అటవీశాఖ అధికారులు, పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 20 మంది ఆందోళన కారులను అదుపులోకి తీసుకొని జన్నారం మండలం ఇంధన్ పల్లి అటవీ రేంజ్ కార్యాలయానికి తరలించారు.150 మంది పోలీసులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది భారీ బందోబస్తు మధ్య మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూములను చదును చేస్తూ రెవెన్యూ హద్దు రాళ్లను పాతుతూ వారి పట్టా నెంబర్లను అధికారులు వేస్తున్నారు.అయితే ఈ భూములలో కొంత నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు గతంలో పోరుకులు కొట్టుకొని తాము సాగు చేశామని ఆ భూములను తమకు కేటాయించిన తర్వాతే మైసంపేట్ గ్రామస్తులకు భూములు పంపిణీ చేయాలని నచ్చన్ ఎల్లాపూర్ గోండుగూడ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. మైసంపేట్ పునరావాస గ్రామస్తులకు కేటాయించిన భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఆడపిల్ల పుట్టిందని భార్యను వదిలేసి..

## మరో మహిళతో భర్త సహజీవనం

## న్యాయం చేయాలంటూ బాధితురాలి ఆవేదన

**హైదరాబాద్ పెన్ పవర్:** సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భార్యను, కూతురును వదిలేసిన.. తరువాత భర్త మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడు. వనపర్తి జిల్లాకు చెందిన అర్చనకు 2012లో అదే జిల్లాకు చెందిన రవితో వివాహం కాగా.. అత్తింటి వేధింపులు ఎదుర్కొన్నానని ఆర్చన ఆరోపించింది. ఆడపిల్ల పుట్టిన తర్వాత భర్త, అత్తింటి వారి వైఖరిలో మార్పు వచ్చిందని, తనను నిర్లక్ష్యం చేయడం ప్రారంభించారని వాపోయింది. తనకు దూరంగా ఉంటూ హైదరాబాద్కు మకాం మార్చిన రవి, మరో మహిళతో సహజీవనం చేస్తూ ఇద్దరు మగ పిల్లలకు తండ్రిగా మారాడని ఆరోపించింది. తనకు ఆడపిల్ల పుట్టిందనే కారణంతో భర్త రవి వనపర్తి కోర్టులో విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేశాడని, అయితే ఆ పిటిషన్ను న్యాయస్థానంలో వాదనలు కొనసాగుతున్నాయని, సెటిల్మెంట్ కోసం ఈనెల 28న ఫైనల్ హియరింగ్ ఉండగా న్యాయస్థానంకు హాజరు కాకుండా తప్పించుకుని తిరుగుతున్నట్లు పేర్కొంది.ఇటీవల కుటుంబ సభ్యులు, స్థానికుల సహాయంతో భర్త నివాసం వద్దకు వెళ్లిన, అతడు మరో మహిళతో కలిసి జీవిస్తున్న విషయాన్ని గుర్తించింది. దీంతో తనకు, తన కుమార్తెకు న్యాయం చేయాలని, భరణం ఇప్పించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం భర్త ఇంటి ముందు ఆందోళనకు దిగింది. తనకు, తన కూతురుకి న్యాయం చేయాలని అధికారులను ఆశ్రయించింది.

# యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం

**యాదాద్రి భువనగిరి: పెన్ పవర్:** యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధమయింది. టెంటర్ల ప్రక్రియ ఈ నెల 12 న మొదలయింది. జూన్ 29వ తేదీన ముగియనుంది. జూలై 2వ తేదీన అధికారుఉ టెండర్లు ఓపెన్ చేయనున్నారు. మూడేళ్ల కాల పరిమితితో, రూ.255 కోట్ల వ్యయంతో పవర్ ప్లాంట్ నిర్వహించేందుకు టెండర్లు తెలంగాణ ప్రభుత్వం పిలిచింది.అయితే ప్రైవేటీకరణ చేస్తే ఆంధ్రా కంపెనీల చేతిలోకి వెళ్లిపోతుందని, ఆంధ్రా పెత్తనం పెరిగిపోతుందని 1300 మంది ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ప్రైవేటీకరణను ఆపకపోతే తీవ్రమైన ఉద్యమాలకు సిద్ధమవుతామని వైటీపీఎస్ ఎంప్లాయీస్ జేఏసీ

# బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలి

**మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విజ్ఞప్తి**

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో తెలంగాణ రాష్ట్రంలో నే యాక్సిడెంట్స్ ఎక్కవ జరుగుతున్నాయి. పది ఏండ్ల లో కేసీఆర్ రోడ్ల అభివృద్ధి ని పట్టించుకోలేదు. బిల్డర్లు అసోసియేషన్ చలో హైదరాబాద్ ను డ్రాప్ చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మూడు నెలల్లో సీఎం రేవంత్ తో మాట్లాడి బకాయిలు క్లియర్ చేయిస్తా అని వాళ్లకు హామీ ఇచ్చానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి ని దృష్టిలో పెట్టుకొని చలో హైదరాబాద్ ను విరమించుకోవాలని విజ్ఞప్తి చేసారు. మంత్రి మాట్లాడుతూ బిల్డర్లు సమ్మె ను విరమించుకుంటారని నమ్మకం ఉంది. సీనియారిటీ ప్రకారం చిన్న కాంట్రాక్టర్లకు బకాయిలు చెల్లించాము. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి పట్టించుకోలేదు. కేసీఆర్ హయాంలో 8వేల కోట్ల బకాయిలు పెండింగ్ లో పెట్టారు. టీమ్స్ ఆసుపత్రి తో కలిపి 10వేల కోట్ల బకాయి ఉంది. యాదగిరిగుట్ట లో కూడా 350 కోట్ల బకాయి ఉంది. ఇప్పటి 3వేల కోట్ల బకాయి చెల్లించాం. 2500 కోట్లు అర్జెంట్ చెల్లించాల్సిన బకాయిలు ఉంది. నాగర్ కర్నూలు శ్రీనివాస్ రెడ్డి అప్పులతో ఆత్మహత్య చేసుకున్నాడు. రఘువీర్ రెడ్డి,శంకర్ లతో సహ 5గురు కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. 25వేల కోట్ల పంచాయతీ రాజ్, =ఒడీ రోడ్లు హామ్ వర్క్స్ నడుస్తున్నాయి. 20వేల కోట్లు టెండర్లు, అగ్రిమెంట్స్ అయిపోయాయి. ఢిండి కి టెండర్లు పిలిచామని అన్నారు. కేటిఆర్ హరీష్ రావుపై మంత్రి కోమటిరెడ్డి మండిపడ్డారు. 2014 కేసీఆర్ వేసిన డబుల్ రోడ్లు, 2018 లో పామ్ హౌస్ కు వేసుకున్న టెండర్లు చుపిస్తాం. 30నెలల్లో జరిగిన అభివృద్ధి పై చర్చకు హరీష్ రావు సిద్ధమా అని అడిగారు. నేను తెలంగాణ ఉద్యమ కారుడిగా నిజాయితీగా పని చేస్తా. సన్న బియ్యం ఇవ్వాలను మాకు కేటిఆర్ చెప్పిండా. పది ఏండ్లు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు,. దోడ్డు బియ్యం ఇస్తే గొడ్లు కూడా తినలేదు. కేసీఆర్ దళితులకు ముఖ్యమంత్రి ఇస్తా అని 10వేల సార్లు చెప్పిండు. సోనియాగాంధీ దేవత ఆమె లేకుండా తెలంగాణ రాదు అన్నడు. భట్టి దళితుడు సీఎల్పి నాయకుడు కాకుండా చేసిండ్రు. దళితులకు ప్రతిపక్ష నేత గా ఉండొద్దా అని ప్రశ్నించారు.

# కుంగిపోయిన కల్వర్టుకు తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:** ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి--పెద్ద వెంకటాపురం ప్రధాన రహదారిపై కుంగిపోయిన కల్వర్టును జిల్లా కలెక్టర్ అంకిత్ ౹ా పరిశీలించారు. పరిస్థితిని గమనించిన వెంటనే వాహనం దిగి కల్వర్టును తనిఖీ చేసి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా అత్యవసరంగా మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్‌డబీ శాఖ అధికారులను ఆదేశించారు.భవిష్యత్తులో రాకపోకలకు అంతరాయం కలగకుండా సాంకేతిక పరిశీలన నిర్వహించి అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి వర్షాల సమయంలో ప్రజలకు అసౌకర్యం లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అయన సూచించారు.
ఈ పరిశీలనలో కొత్తగూడెం ఆర్డీవో మధు, తాసిల్దార్ ఉషారాణి, ఎంఈఓ శాంతారావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో హాజరు శాతం పెంచాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్:** జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచడంతో పాటు నాణ్యమైన విద్య, పోషకాహార సేవలు అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఆళ్ళపల్లి మండల పర్యటనలో భాగంగా ఆళ్ళపల్లి మండల ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్, విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలోని ప్రీ-ప్రైమరీ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం నిర్వహణపై సమీక్షించారు.
తల్లిదండ్రులతో నిరంతర సంప్రదింపులు జరిపి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న భోజనం, పాలు, బాలామృతం తదితర పోషకాహార సేవలను పరిశీలించి హాజరు తక్కువగా ఉండటంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
తరువాత పెద్ద వెంకటాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి గుత్తికోయలు నివసించే ఈ గిరిజన ప్రాంతంలో బడిఈడు పిల్లలందరూ పాఠశాలకు హాజరయ్యేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అదనపు నిల్వలను అవసరమైన చోటుకు తరలించాలని, కేంద్రాలను పరిశుభ్రంగా నిర్వహిస్తూ పిల్లల చేరికలు పెంచాలని ఆదేశించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు, పిల్లలకు నాణ్యమైన పోషకాహార సేవలు అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అయన సూచించారు.

# అటవీ ప్రాంతమైనా అక్షరాస్యతలో ములుగు ముందంజ



**హైదరాబాద్ పెన్ పవర్:** కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో, రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 50 సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క , జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి హాజరై విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, ములుగు జిల్లా నిరక్షరాస్యత అధికంగా ఉన్న వెనుకబడిన జిల్లా అయినప్పటికీ జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల సమిష్టి కృషి ఫలితంగా ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 99.30 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో మొదటి స్థానం, ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు.
ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తోందని, జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ సహకారంతో 50 సైకిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

# వైరా ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్ దివాకర

**ఖమ్మం: పెన్ పవర్:** ఖమ్మంజిల్లా వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా మంగళవారం వైరా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డ్, ఓపీ విభాగం, ల్యాబ్తో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులతో నేరుగా మాట్లాడి వైద్య సేవలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా వైద్యులు, సిబ్బంది సమయపాలనతో విధులు నిర్వహిస్తూ నాణ్యమైన వైద్య సేవలు అందించాలని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హాస్పిటల్ పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాలు, వైద్య పరికరాల వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ అనవసరమైన సి-సెక్షన్లకు తావులేకుండా తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్య సిబ్బంది ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించే విధంగా పర్యవేక్షణ చేయాలని వైద్య అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# కాంగ్రెస్ లో పదవుల పంచాయితీ

**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:** కాంగ్రెస్ పార్టీలో సీనియర్లలో అసంతృప్తి పెరుగుతుంది. ఇందుకు సీనియర్ నేత షబ్బీర్ అలి ఉదాహరణ. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీని ఇబ్బందులకు గురి చేశాయి. కాంగ్రెస్ పార్టీలో పదవులను డబ్బులు ఇచ్చిన వారికే ఇస్తున్నారని షబ్బీర్ అలి తీవ్ర స్థాయిలో విమర్శించారు. కష్టించి పనిచేసిన నేతలకు కాకుండా అప్పటికప్పుడు పార్టీలోకి వచ్చి డబ్బులు ఇచ్చిన వారికి పదవులు కట్టబెడుతున్నారని షబ్బీర్ అలి చేసిన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీలో కాక రేపాయి. గత కొంత కాలంగా షబ్బీర్ అలి అసంతృప్తితో ఉన్నారు. తనను పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదని ఆయన భావిస్తున్నారు. పైగా కామారెడ్డి నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా మరొక నేతను ప్రోత్సహించేందుకు సిద్ధమయ్యారని ఆయన భావిస్తున్నారు. గత కొంత కాలం నుంచి షబ్బీర్ అలి కి, చంద్రశేఖర్ రెడ్డి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకంటున్నారు. ఈ ఇద్దరి మధ్య వివాదం నేపథ్యంలోనే షబ్బీర్ అలీ ఈ వ్యాఖ్యలు చేశారని ప్రత్యర్థి వర్గం ఆరోపిస్తుంది. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పై ఆయన చేసిన తీవ్ర వ్యాఖ్యలపై ఏఐసీసీ కూడా అంతే స్థాయిలో స్పందించింది. షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అయితే షబ్బీర్ అలీ మాత్రం ఆ వ్యాఖ్యలకు, తనకు ఏ మాత్రం సంబంధం లేదని చెప్పారు. ఆ ఆడియోలో వినిపిస్తున్న వాయిస్ తనది కాదని అన్నారు. తన ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్ర పన్నారంటూ షబ్బీర్ అలీ వివరణ ఇచ్చారు. మహేష్ కుమార్ గౌడ్ తో తనకు సుదీర్ఘ కాలం నుంచి తెలుసునని, మంచి మిత్రుడని చెప్పారు. ఆయనపై తాను వ్యతిరేక వ్యాఖ్యలు ఎందుకు చేస్తానని షబ్బీర్ అలీ అన్నారు. షోకాజ్ నోటీసులకు అవసరమైన సమాధానాన్ని తాను ఇస్తానని కూడా షబ్బీర్ అలీ చెప్పారు. మొత్తం మీద కాంగ్రెస్ లో సీనియర్ నేతలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ నాయకత్వం కూడా పార్టీ కోసం సుదీర్ఘకాలం పనిచేసిన వారిని పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఆర్టీసీ పేరును గుర్తు చేస్తున్న బస్సులు

**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:** హైదరాబాద్‌లోని ప్రధాన మార్గాల్లో బస్సులు తరచూ బ్రేక్‌డౌన్ అవుతుండటంతో ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా నానల్‌నగర్, ఖైరతాబాద్ జంక్షన్, మాసబ్‌ట్యాంక్ కట్టమైసమ్మ దేవాలయం వంటి ప్రాంతాల్లో బస్సులు మధ్యలోనే ఆగిపోవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 'మహాలక్ష్మి' ఉచిత ప్రయాణ పథకం ప్రారంభమైన తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో బస్సులపై అదనపు ఒత్తిడి పడుతోంది. కొత్త బస్సులు రాకపోవడం, నిర్వహణ లోపించడం వల్ల ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. విడిభాగాల కొరత, ఆయిల్ సకాలంలో మార్చకపోవడం వంటి కారణాల వల్ల బస్సులు మధ్యలోనే ఆగిపోతున్నాయి. వైరింగ్, పార్ట్స్ సమస్యల వల్ల కొన్ని బస్సుల నుంచి పొగలు వస్తున్నాయి. డిపోలలో ఫిట్‌నెస్ పరీక్షలు నామమాత్రంగానే జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. మహానగరానికి 7 వేల బస్సులు అవసరం ఉండగా, ఆర్టీసీ ప్రస్తుతం 3200 బస్సులతోనే నెట్టుకొస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు కాగా, మిగిలినవి డీజిల్ బస్సులు. హైదరాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటిన బస్సులు సుమారు 250, పదేళ్లు దాటినవి 350 ఉన్నాయి. సికింద్రాబాద్ రీజియన్‌లో 15 సంవత్సరాలు దాటినవి 300, 10 సంవత్సరాలు దాటినవి 300 ఉన్నాయి. ఈ పాత బస్సులు కాలుష్యాన్ని వెదజల్లడమే కాకుండా, రోజుకు 6 నుండి 8 ట్రిప్పులు తిరుగుతున్నాయి.

# బ్యాంకు రుణాలు కావాలంటే లంచం

**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:** రాజేంద్రనగర్ సర్కిల్‌లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంక్ రుణాలు మంజూరు చేయడంలో భారీ అవినీతి జరుగుతోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కుటుంబ అవసరాలు లేదా స్వయం ఉపాధి కోసం రుణాలు కోరిన మహిళలను అధికారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, లంచాలు అడుగుతున్నారని సమాచారం. దీనిపై సర్కిల్‌లోని పలు సంఘాల మహిళలు తిరుగుబాటు చేసి, అధికారుల ప్రమేయం లేకుండా నేరుగా బ్యాంకులకు లేఖలు రాశారు. విషయం విజిలెన్స్ అధికారుల దృష్టికి వెళ్లడంతో జరిగిన విచారణలో దిగ్భ్రాంతికరమైన నిజాలు బయటపడ్డాయి. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 1,400 మంది మహిళలకు మంజూరైన రూ. 4.5 కోట్ల రుణం నుంచి రూ. 4.5 లక్షలు లంచాలకే ఖర్చయ్యాయని ఆధారాలు సేకరించారు.

ప్రతి రూ. లక్ష రుణానికి రూ. 1,000 కమీషన్ వసూలు చేస్తున్నట్లు విజయేందర్, లక్ష్మణ్, జె. ఉపేందర్, పి. విజయ్‌కుమార్ వంటి కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సీవోలు) విచారణలో ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. వీరు ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కూడా డబ్బులు వసూలు చేసినట్లు ఆధారాలు సేకరించారు. లంచం అడిగినప్పుడు ప్రశ్నించిన వారిని విధుల నుంచి తొలగించడం, వారి స్థానంలో తమకు అనుకూలమైన వారిని నియమించుకోవడం ఈ సీవోలకు అలవాటుగా మారిందని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. నివేదిక ఆధారంగా, అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళల వేధింపులను అరికట్టాలని అధికారులు కమిషనర్‌కు సిఫార్సు చేశారు.

# తెలంగాణలో విచారణల పాలిటిక్స్

**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ నేతలకు మధ్య పలు కేసుల విచారణకు సంబంధించి రాజకీయం జోరుగా సాగుతోంది. బీఆర్ ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ హయాంలో జరిగిన.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం సంచలనంగా మారిందని..దీనిని సీబీఐతో దర్యాప్తు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రానికి లేఖ రాశారు. కానీ, దీనిపై ఇప్పటి వరకు అతీ గతీ లేదని, కేసీఆర్‌ను కాపాడుతున్నారని సీఎం రేవంత్ పలుసందర్భాల్లో ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, వ్యాపారవేత్తల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారనే ఆరోపణలు వచ్చాయి. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ మాజీ అధికారులు కొందరు ఈ కేసులో అరెస్ట్ అయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎస్ఐబీ మాజీ ఉన్నతాధికారులు విదేశాలకు వెళ్లిపోవడంతో, వారిపై రెడ్‌కార్నర్ నోటీసులు జారీ చేయడానికి సీబీఐ ఇంటర్‌పోల్‌కు లేఖ రాసింది. ఫోన్‌ట్యాపింగ్ కేసులో అవినీతి కోణాలు కూడా ఉన్నాయని భావించిన రాష్ట్ర ప్రభుత్వం... ఈడీ, సీబీఐ దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తూ.. లేఖలు సంధించింది. కానీ, ఇప్పటి వరకు కేంద్రం నుంచి సరైన సమాధానం రాలేదన్నది సర్కారు చెబుతున్న మాట. ఈ విషయాన్ని కట్ చేస్తే.. తాజాగా బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని మరో డిమాండ్ చేశారు. సింగరేణి కేలరీస్ లో భారీ ఎత్తున కుంభకోణం జరిగిందని వార్తలు వస్తున్నాయని ఆయన తెలిపారు. దాదాపు 16 వందల కోట్ల రూపాయల విలువైన బొగ్గు దారి మళ్లిందని.. ఇదంతా ఎవరి హయాంలో జరిగింది? దీనివెనుక ఎవరు ఉన్నారు? అనే విషయాలను తేల్చాలని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేయించాలని కిషన్ రెడ్డి కోరారు. అంతేకాదు.. సింగరేణి భద్రతను కట్టుదిట్టం చేయాలన్నారు. కేసీఆర్ సర్కారు కేంద్రంగా ఇటు కాంగ్రెస్, అటు బీజేపీలు పరస్పరం విమర్శలు చేసుకుంటూనే ఉన్నాయి. అంతేకాదు.. ఒకరిపై ఒకరు మీరు విచారణ చేపట్టాలంటే మీరు విచారణ చేపట్టాలని నిలదీతలు కనిపిస్తున్నాయి. ఇంతకు మించి.. ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం వెనుక వీటిని రాజకీయ వస్తువులుగానే వినియోగించుకునే అవకాశం ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం. కాగా.. ప్రస్తుతం కిషన్ రెడ్డి లేవనెత్తిన సింగరేణి బొగ్గు గనుల వ్యవహారం కూడా రాజకీయపరమైన అంశంగానే కనిపిస్తోందని పరిశీలకులు చెబుతున్నారు. ఎందుకంటే.. బొగ్గుగని కార్యక్రమాలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నా.. గనుల నిల్వలు.. సరుకు రవాణా.. కేటాయింపు ఇలా.. అన్ని విషయాలు బొగ్గు, గనుల శాఖ మంత్రిగా కిషన్ రెడ్డి పరిధిలోనే ఉంటాయి. కాబట్టి.. ఈ రచ్చ ఇలా కొనసాగుతుందా.. లేక పరిష్కారం లభిస్తుందా? అనేది చూడాలి.

# ఇసుక రాంపుల వద్ద దోపిడిని అరికట్టాలి

## ప్రభుత్వానికి లారీ ఓనర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ర్యాంపుల వద్ద కొనసాగుతున్న అక్రమ వసూళ్లపై సమగ్ర విచారణ జరిపించి దోపిడీని అరికట్టాలని పెద్ద అంబర్పేట్ సాండ్ లారీ ఓనర్స్అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఖైరతాబాద్ లోని ఖనిజాభివృద్ధి సంస్థ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి చెల్లించే డిడి తో పాటు ఇసుక రీచ్ ల వద్ద అక్రమ వసూలుతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ వసూలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విజ్ఞప్తి చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. లోడింగ్ పాయింట్ల వద్ద అడుగడుగునా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. అక్రమ నిలిపివేయాలని అధికారులకు వినతి పత్రాలు అందించిన వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ జరిపించి అక్రమ దోపిడీని అరికట్టడంతో పాటు దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# బీఆర్ఎస్‌ను ట్రాక్‌లోకి తెచ్చేందుకు బస్సు యాత్ర

**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో భారత్ రాష్ట్ర సమితి అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్లీ యాక్టివ్ కాబోతున్నారనే వార్తలు గులాబీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపుతున్నాయి. కేసీఆర్ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టబోతున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించడంతో పొలిటికల్ సర్కిల్స్‌లో సరికొత్త చర్చ మొదలైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ఆ వెంటనే జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బస్సు యాత్ర చేసినప్పటికీ పార్టీ ఖాతాలో ఒక్క సీటు కూడా పడకుండా జీరో ఫలితం రావడం కేసీఆర్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఆ దెబ్బతో దాదాపు రెండేళ్లకు పైగా ఆయన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. కేవలం ఇటీవల జరిగిన పార్టీ ప్లీనరీ, అలాగే జగిత్యాల లాంటి రెండు బహిరంగ సభల్లో మాత్రమే ఆయన ప్రసంగించి వెళ్లారు తప్ప క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి రాలేదు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటిపోతున్న తరుణంలో.. కేసీఆర్ ఇప్పుడు బస్సు యాత్ర అస్త్రం చేతబట్టడం వెనుక కేవలం పార్టీ ఉనికిని చాటుకోవడమే కాకుండా, రాబోయే స్థానిక సంస్థలు లేదా సార్వత్రిక ఎన్నికల కోసం క్యాడర్‌ను సమాయత్తం చేయడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అయితే, రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం.. కేసీఆర్ ఈ యాత్ర పూర్తి చేసిన తర్వాత మళ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేంతవరకు ప్రజల్లోకి వచ్చే అవకాశాలు తక్కువే. అంతేకాదు, ఆయన ఇకపై అసెంబ్లీ సమావేశాలకు కూడా వచ్చే మూడ్‌లో లేరని స్పష్టమవుతోంది. సభలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టే పూర్తి భారాన్ని ఆయన కేటీఆర్, తన్నీరు హరీష్ రావుల భుజాలపైనే పెట్టేశారు.

అసెంబ్లీ వేదికగా గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై, అలాగే ప్రస్తుత రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సవాల్ విసిరినా కేసీఆర్ సైలెంట్‌గా ఉండటం వెనుక పెద్ద వ్యూహమే ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిత్యం వేస్తున్న పొలిటికల్ సవాళ్లకు




సమాధానం ఇచ్చేందుకు కేసీఆర్ ఏమాత్రం ఆసక్తి చూపించడం లేదు. తన స్థాయికి రేవంత్ రెడ్డి సరిపోరు, జూనియర్ నేతతో తాను నేరుగా తలపడటం వల్ల ఆయనకే ఎక్కువ పొలిటికల్ మైలేజ్ లభిస్తుంది అనే భావనలో కేసీఆర్ ఉన్నట్లు ప్యానల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. అందుకే, రేవంత్ రెడ్డిని ఢీకొట్టే బాధ్యతలను కేటీఆర్, హరీష్ రావులకు వదిలేసి.. తాను మాత్రం కేవలం ప్రజాక్షేత్రం లోనే తేల్చుకోవాలనే పంథాను ఎంచుకున్నారు. ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే.. గతంలో ఫ్లాప్ అయిన బస్సు యాత్ర ఫార్ములాతో కేసీఆర్ మళ్లీ ప్రజలను ఆకట్టుకోగలరా? అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నే. అసెంబ్లీ ఓటమి తర్వాత బీఆర్ఎస్ ఓటు బ్యాంకు దారుణంగా చెల్లాచెదురైంది. అటు బీజేపీలోకి, ఇటు కాంగ్రెస్‌లోకి కీలక నేతలు, కేడర్ వలస వెళ్లడంతో గులాబీ కోట బలహీనపడింది. ప్రస్తుతం కాంగ్రెస్ హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజల్లో కనిపిస్తున్న చిన్నపాటి అసంతృప్తిని క్యాష్ చేసుకోవడానికి కేసీఆర్ వాగ్ధాటి ఉపయోగపడుతుందని భావిస్తున్నప్పటికీ.. జనం గతాన్ని అంత సులభంగా మర్చిపోతారా అనేది అనుమానమేకేసీఆర్ బస్సు యాత్ర కేవలం ఒక ప్రచార

పర్వం మాత్రమే కాదు, అది బీఆర్ఎస్ పార్టీకి జీవన్మరణ సమస్య. కేటీఆర్, హరీష్ రావు ఎంతగా కష్టపడుతున్నా.. పార్టీని నడిపించే కరిష్మా కేవలం కేసీఆర్‌కు మాత్రమే ఉంది. ఈ యాత్ర ద్వారా ఆయన తన పాత ఓటు బ్యాంకును తిరిగి రాబట్టుకోగలిగితే తెలంగాణలో మళ్లీ ముక్కోణపు పోటీ వస్తుంది; లేదంటే తెలంగాణ రాజకీయం కాంగ్రెస్ వర్సెస్ బీజేపీగా మారిపోయి బీఆర్ఎస్ మరింత మూలనపడే ప్రమాదం ఉంది. అందుకే కేసీఆర్ సీరియస్‌గా ఈ యాత్ర చేసే అవకాశాలు ఉన్నాయి.

# పాపం మహేష్ గౌడ్...



**హైదరాబాద్, జూన్ 16 పెన్ పవర్:**
తెలంగాణ కాంగ్రెస్‌లో కొంతకాలంగా అంతర్గతంగా సాగుతున్న లీకుల రాజకీయం ఇప్పుడు పరాకాష్టకు చేరింది. ఏఐసీసీ వేదికగా జరిగిన ఒక అనూహ్య పరిణామం.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కుర్చీకే ఎసరు పెట్టే స్థాయికి చేరడం పొలిటికల్ సర్కిల్స్‌లో పెను సంచలనంగా మారింది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్వయంగా ఎంపిక చేసి బరిలోకి దించిన మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం వెనుక.. తెలంగాణ కాంగ్రెస్‌కు చెందిన కీలక నేతలే వెన్నుపోటుకు పాల్పడ్డారనే పక్కా ఆధారాలు ఢిల్లీ పెద్దలకు చిక్కాయి. ఈ తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యంపై రాహుల్ గాంధీ అత్యంత ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. మీనాక్షి నటరాజన్ అంటే రాహుల్ గాంధీ కోటరీలో అత్యంత నమ్మకమైన, విలువలతో కూడిన రాజకీయాలు చేసే సీనియర్ నాయకురాలిగా పేరుంది. మధ్యప్రదేశ్‌లో ఆమె నామినేషన్‌ను తిరస్కరించడానికి బేస్‌గా మారిన తెలంగాణ పాత ప్రైవేట్ కంప్లైంట్ వివరాలను.. ఇక్కడి కాంగ్రెస్ నేతలే స్వయంగా బీజేపీకి లీక్ చేశారనే అంశంపై ఏఐసీసీ ఇప్పటికే ఒక ప్రత్యేక విచారణ కమిటీని రంగంలోకి దించింది. పూర్తిగా కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటలు, గ్రూపు రాజకీయాల వల్లనే పార్టీ జాతీయ స్థాయిలో ఇంతటి అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చిందని రాహుల్ గాంధీకి ప్రాథమికంగానే ఒక స్పష్టత వచ్చేసింది. తన సొంత ఎంపికపైనే దెబ్బకొట్టిన ఈ అంతర్గత శత్రువులను క్షమించే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా భావిస్తున్నట్లు ఢిల్లీ వర్గాలు చెప్తున్నాయి. ఈ లీకేజీ వ్యవహారం కేవలం ఒక రాజ్యసభ సీటును కోల్పోవడం కాదు, రాహుల్ గాంధీ నాయకత్వానికే విసిరిన సవాల్‌గా ఢిల్లీ పెద్దలు చూస్తున్నారు. అందుకే, బాధ్యులపై చర్యలతో పాటు తెలంగాణ కాంగ్రెస్‌ను రూట్ లెవెల్ నుండి ప్రక్షాళన చేయాలని డిసైడ్ అయ్యారు. ఈ మొత్తం వ్యవహారంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ పాత్రపై తీవ్రమైన స్క్రూటినీ నడుస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడిగా ఉండి కూడా రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమాచారాన్ని, రహస్యాలను కాపాడటంలో, సొంత నేతలను కంట్రోల్ చేయడంలో ఆయన పూర్తిగా విఫలమయ్యారనే బలమైన అభిప్రాయానికి హైకమాండ్ వచ్చింది. ఫలితంగా, తెలంగాణలో పార్టీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు మహేష్ కుమార్ గౌడ్‌ను పక్కన పెట్టి.. గ్రూపులను అణచగల ఒక అత్యంత సీనియర్, పవర్‌ఫుల్ లీడర్‌ను టీపీసీసీ అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే ఏఐసీసీ బ్యాక్‌ఎండ్ వర్క్ కూడా ప్రారంభించినట్లు సమాచారం. ఈ ప్రక్షాళన ప్రభావం కేవలం పార్టీ కమిటీలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ పై కూడా తీవ్రంగా పడబోతోంది. ముఖ్యంగా, ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు, ఒక డిప్యూటీ సీఎంల మధ్య సాగుతున్న భీకరమైన వర్గపోరు.. ఈ లీకేజీ వ్యవహారానికి ప్రధాన కారణమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ జిల్లాల్లోని కొందరు మంత్రుల వెనుక ఉన్న ఒక బడా బిజినెస్ లాబీ.. కాంగ్రెస్‌లో ఉంటూనే సమాచారాన్ని బీజేపీకి చేరవేసే డబుల్ గేమ్ ఆడుతోందని, ఈ నటరాజన్ ఇష్యూలో కూడా ఆ వ్యాపారవేత్తల హస్తం స్పష్టంగా ఉందని నిఘా నివేదికలు చెప్తున్నాయి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన హెవీవెయిట్ మంత్రుల పోర్ట్‌ఫోలియోలను మార్చడం లేదా వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం ఖాయంగా మారింది. మరోవైపు, ఈ సంక్షోభాన్ని ఒక సామాజిక సమీకరణాల మార్పుకు కూడా వేదికగా వాడుకోవాలని కాంగ్రెస్ అధిష్టానం ప్లాన్ చేస్తోంది. చాలా కాలంగా రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల నుంచి వస్తున్న మంత్రివర్గ ప్రాతినిధ్య డిమాండ్‌ను నెరవేర్చడానికి.. ఈ లీకుల వ్యవహారంలో దొరికిపోయిన నాన్-పెర్ఫార్మర్ల మంత్రులను కేబినెట్ నుండి తప్పించనున్నారు. ఆ ఖాళీ అయ్యే స్థానాల్లో బీసీ నేతలకు, సీనియర్లకు చాన్స్ ఇవ్వబోతున్నారని తెలుస్తోంది. ఈ సర్జికల్ స్ట్రైక్ సమయంలో ప్రభుత్వం ఇబ్బంది పడకుండా ఉండేందుకు పార్టీని శాసించగల కొందరు అత్యంత పవర్‌ఫుల్ మంత్రులను ప్రస్తుతానికి టచ్ చేయకుండా.. కేవలం 'వాచ్ లిస్ట్' లో ఉంచి, తగిన సమయంలో వారి సంగతి తేల్చాలని ఏఐసీసీ భావిస్తోంది. మొత్తానికి, మధ్యప్రదేశ్‌లో తిరస్కరణకు గురైన మీనాక్షి నటరాజన్ నామినేషన్ ఎపిసోడ్, ఊహించని విధంగా తెలంగాణ కాంగ్రెస్‌లో ఒక పెను రాజకీయ భూకంపానికి దారితీసింది.

# డీఎస్సీలో కులాల లెక్కలు జాతర

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:**
డీఎస్సీ 2025 పై వైయస్సార్ కాంగ్రెస్ అదే పనిగా విషప్రచారం చేస్తోంది. అవి రోజురోజుకు శృతిమించి కులాల వద్దకు కూడా చేర్చింది వైయస్సార్ కాంగ్రెస్. గతంలో కమ్మ డీఎస్సీలు అంటూ 2019 ఎన్నికలకు ముందు హడావిడి చేసిన సంగతి తెలిసిందే. తీరా వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీకి చెందిన మంత్రి కమ్మ డీఎస్సీలు కాదు.. అన్ని వర్గాల వారికి అవకాశం ఇచ్చారని శాసనసభలో ప్రకటించారు. అయితే ఇప్పుడు డీఎస్సీ 2025 పై దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. స్పోర్ట్స్ కోటా కింద కమ్మ సామాజిక వర్గం వారికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చారని చెబుతూ.. కమ్మ డీఎస్సీ అంటూ ప్రచారాలు ప్రారంభించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం చానల్స్ లో కూర్చోబెట్టి.. రిటైర్మెంట్ తీసుకున్న అధికారులతో కమ్మ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారంటూ విషం చిమ్మడం మొదలుపెట్టారు.డీఎస్సీ 2025 పై ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ అధికారులు ఓపికగా వివరణ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు కమ్మ డీఎస్సీ ఆరోపణలపై కూడా ఏపీ ఫ్యాక్ట్ చెక్ రంగంలోకి దిగి.. అదంతా తప్పుడు ప్రచారం అని తేల్చేసింది. ఈ డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద భర్తీ చేసిన పోస్టులు 381. ఈ 381 పోస్టుల్లో ఓపెన్ క్యాటగిరి కింద ఉన్నవి కేవలం 42 పోస్టులు మాత్రమే. మిగిలిన పోస్టులన్నీ ఎస్సీ, ఎస్ టి, బిసి, మైనారిటీ వర్గాలకు దక్కాయి. ఈ వివాదానికి ప్రధాన కారణం ఆనాలపై రెండు ఓపెన్ క్యాటగిరి పోస్టులు వాటిని పరిశీలిస్తే అందులో కమ్మ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు వచ్చినవి కేవలం 9 పోస్టులు మాత్రమే. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు పది పోస్టులు, కాపు సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులకు అత్యధికంగా 16 పోస్టులు వచ్చాయి.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రచారం తప్పుడు అని అందరికీ తెలుసు. ఎందుకంటే 381 పోస్టుల్లో.. 9 పోస్టులు అంటే కనీసం మూడు శాతం కూడా లేవు. కానీ ఏ లెక్క ప్రకారం స్పోర్ట్స్ కోటా మొత్తం ఒకే కులానికి కట్టబెట్టారు.. ఇందులో భారీ స్కాం జరిగింది అంటూ తప్పుడు ప్రచారాలు మొదలుపెట్టింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పేటీఎం బ్యాచ్. కేవలం మెరిట్, క్రీడా సర్టిఫికెట్ల ప్రాతిపదికన ఆధారంగా జరిగిన ఈ నియామక ప్రక్రియను.. ఒక కులానికి ఆపాదించి వివాదం చేయడం చూస్తుంటే కుట్ర కోణం అర్థం అవుతోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ ఆరాటం కోసమే నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. దాదాపు ఆరు లక్షల మంది అభ్యర్థులు డీఎస్సీ పరీక్ష రాయడంతో వారిలో గందరగోళం రేపి రాజకీయ లబ్ధి పొందాలన్న ఆలోచన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ అది వర్క్ అవుట్ అయ్యే ఛాన్స్ లేదు. అయితే ఆధారాలు లేని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్న సదరు యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆధారాలు లేని కారణంగా ఆ యూట్యూబ్ ఛానల్ ఆ వీడియోను డిలీట్ కూడా చేసింది. కానీ వదిలిపెట్టే ప్రసక్తి కనిపించడం లేదు. నేరుగా సజ్జల ఫండింగ్ చేసిన ఆ ఛానల్ సంగతి తేల్చాలన్న అభిప్రాయం కూటమి శ్రేణుల్లో వినిపిస్తోంది.

# అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తి

**తిరుపతి, జూన్ 16, పెన్ పవర్:**
తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేత ఎన్. అమరనాథ రెడ్డి ఎక్కడున్నారు. ఆయన టీడీపీలోనే ఉన్నారా? అసలు ఏం జరుగుతుంది? పార్టీలో ఒక్కసారిగా సైలెంట్ అయిన అమరనాథ రెడ్డి తీవ్ర స్థాయిలో అసంతృప్తికి లోనవుతున్నారా? అన్న అనుమానం కలుగుతుంది. దాదాపు రెండేళ్ల నుంచి అమరనాథ రెడ్డి పార్టీ లో యాక్టివ్ గా లేరు. గతంలో రాజకీయంగా కీలకంగా వ్యవహరించే అమరనాథ రెడ్డి ఈ టర్మ్ లో మాత్రం మౌనం పాటించడం వెనక కేవలం అసంతృప్తి కారణమని పార్టీ నేతలే చెబుతున్నారు. తనకు 2024 ఎన్నికల తర్వాత ప్రాధాన్యత దక్కడం లేదన్న అభిప్రాయంలో అమరనాథ రెడ్డి ఉన్నారు. అందుకే అమరావతికి కూడా దూరంగా ఉంటూ తన పని తాను చేసుకుంటున్నారు.చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గం నుంచి అమరనాథ రెడ్డి టీడీపీ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సొంత జిల్లా చిత్తూరులో ఉన్న ఈ నేత అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం. అయితే తనకు తొలి విడత మంత్రి పదవి దక్కుతుందని భావించినప్పటికీ ఆయనకు రాలేదు. చిత్తూరు జిల్లా నుంచి కేవలం ముఖ్యమంత్రి గా చంద్రబాబు మాత్రమే ఉన్నారు. మరెవరికీ అవకాశం కల్పించలేదు. చంద్రబాబు జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు మినహా మరే సందర్భంలో వీరు పెద్దగా కనిపించడం లేదు. అలాగే విపక్షాలు చేసే విమర్శలకు సయితం స్పందించడం లేదు.1996లో పుంగనూరు నియోజకవర్గంకి జరిగిన ఉప ఎన్నికలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీకి ఎన్నికయ్యాడు. 1999లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలై, 2004లో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచాడు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు.2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలమనేరు నియోజకవర్గం నుండి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచారు. 2012లో టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు.తర్వాత జూన్ 2016లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని విడి టీడీపీలో చేరాడు. 2017లో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ విస్తరణలో భాగంగా అమరనాథ్ రెడ్డికి మంత్రి పదవి లభించింది. 2024లో ఎన్నికల్లో తిరిగి టీడీపీ నుంచి విజయం సాధించారు. ట్రాక్ రికార్డును చూసిన తర్వాత మంత్రి పదవి దక్కాల్సి ఉన్నా రాకపోవడంతో ఆయన తన పెదవి విప్పడం లేదని అంటున్నారు.

# వేమిరెడ్డికి కీలకం పదవి...

**నెల్లూరు, జూన్ 16, పెన్ పవర్:**
నెల్లూరు అంటేనే మొదటి నుంచి కాంగ్రెస్ కి తరువాత కాలంలో వైసీపీకి అచ్చి వచ్చిన జిల్లాగా పేరుంది. రెడ్లు పెద్ద ఎత్తున రాజకీయ ప్రాబల్యం కలిగిన జిల్లాగా నెల్లూరుని చెబుతారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో మొత్తం పది ఎమ్మెల్యే సీట్లు ఉంటే 2019లో పదికి పది స్వీప్ చేసి వైసీపీ శభాష్ అనిపించుకుంది. అయితే గిర్రున అయిదేళ్ల కాలం తిరిగేసరికి టీడీపీ కూటమి అదే ఫీట్ ని రివర్స్ లో చేసి వైసీపీకి భారీ షాక్ ఇచ్చేసింది. ఫలితంగా వైసీపీకి ఒక్కరంటే ఒక్కరు ఎమ్మెల్యే లేకుండా పోయారు. బలమైన నేతలు అంతా ఇపుడు టీడీపీలోనే ఉన్నారు. ఈ పరిణామాలతో వైసీపీ మొదటి నుంచి కూడదీసుకునే పనిలో ఉంది. కూటమి తన జోరుని ఎక్కడా తగ్గించడం లేదు, ప్రత్యేకించి టీడీపీ అయితే 2024లో దక్కిన విజయాన్ని ఆ రాజకీయ పట్టుని శాశ్వతం చేసుకోవాలని చూస్తోంది. దాని కోసం భారీ ఎత్తున వ్యూహ రచన కూడా చేస్తోంది.నెల్లూరు జిల్లాలో అంగ బలం అర్థ బలం దండీగా ఉన్న నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి టీడీపీ భారీ గిఫ్ట్ ఇవ్వబోతోంది అని ప్రచారం సాగుతోంది. ఆయన 2018 నుంచి 2024 దాకా రాజ్యసభ మెంబర్ గా వైసీపీలో పనిచేశారు. వైసీపీని నెల్లూరు జిల్లాలో అన్ని విధాలుగా నిలబెట్టడంలో ఆయన కీలకమైన పాత్ర పోషించారు. ఆయనకు 2024 ఎన్నికల్లో ఎంపీ ఎమ్మెల్యే సీటు ఇవ్వడానికి వైసీపీ సుముఖత వ్యక్తం చేయకపోవడంతో టీడీపీ వైపు వచ్చారని ప్రచారం సాగింది. టీడీపీ ఆయనను సాదరంగా ఆహ్వానించి అక్కున చేర్చుకుని ఆయనకూ ఆయన సతీమణి ప్రశాంతి రెడ్డికి కూడా టికెట్లు ఇచ్చింది. దాంతో మొత్తం నెల్లూరు జిల్లా టీడీపీ కూటమికి చిక్కింది. ఈ నేపథ్యంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డికి కేంద్ర మంత్రివర్గంలో పదవి దక్కుతుందని ప్రచారం ఊపందుకుంది. ఆయనకు సామాజిక పరంగానే కాదు రాజకీయంగా ప్రాంతీయ సమీకరణల దృష్ట్యా ఈ పదవిని ఇవ్వడం సముచితం అని పార్టీ పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. గ్రేటర్ రాయలసీమలో భాగంగా ఉన్న నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డికి కేంద్ర మంత్రి పదవి ఇస్తే కనుక ఆ ప్రభావం కచ్చితంగా రాయలసీమ మీద కూడా పడుతుందని వచ్చే ఎన్నికల్లో వైసీపీ హార్డ్ కోర్ రీజియన్ గా ఉన్న రాయలసీమలో సైతం కూటమి అత్యధిక స్థానాలను గెలుచుకునేందుకు ఇది ఉపకరిస్తుందని కూడా టీడీపీ పెద్దలు వ్యూహరచన చేస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీని వీడిన వారిని వెనక్కి



రప్పించే ప్రయత్నంలో వైసీపీ అధినాయకత్వం ఉంది అని ప్రచారం సాగుతోంది. ఇక వేమిరెడ్డి మీద కూడా వైసీపీ ఫోకస్ పెట్టింది అని కూడా చెప్పుకున్నారు. ఆయన విలువ ఏమిటి అన్నది వైసీపీకి 2024 ఎన్నికల ఫలితాల తరువాత తెలిసింది అని అంటున్నారు. అయితే టీడీపీలో వేమిరెడ్డికి గౌరవం దక్కుతోంది, అంతే కాదు ఆయన అనుకున్నది చేసే పరిస్థితి కూడా ఉందని అంటున్నారు. ఇపుడు ఆయనకు కేంద్ర మంత్రి పదవి కూడా దక్కితే కనుక వైసీపీకి రాజకీయంగా మరింత దెబ్బ పడే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్థ బలంతో పాటు కేంద్ర మంత్రిగా బలం కూడా తోడు అయితే నెల్లూరు జిల్లాలో ఫ్యాన్ రెక్కలు జోరందుకోకుండా బ్రేకులు పడతాయని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంత అన్నది వేచి చూడాల్సి ఉంది.

నల్లపురెడ్డి దారెటు...

నెల్లూరు జిల్లాలో రాజకీయాలు హీటెక్కాయి. ఎన్నికలకు మూడేళ్లకు ముందే టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం జరుగుతుంది. ప్రధానంగా జిల్లాలోని కోవూరు నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు నడుస్తున్నాయి. వేమిరెడ్డిని ఎదుర్కొనేందుకు ప్రసన్నకుమార్ రెడ్డి వద్ద ప్లాన్ ఏంటి? కోవూరు నియోజకవర్గంలో ప్రశాంతి రెడ్డిని ఎదుర్కొనేందుకు నల్లపురెడ్డి వద్ద ఉన్న వ్యూహాలేంటి? అన్న దానిపై చర్చ జరుగుతుంది. ఎందుకంటే బలమైన నేతను ఎదుర్కొనాలంటే అంత ఆషామాషీ కాదు. జనంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తేనే తప్ప విజయం సాధ్యం కాదు. కానీ ప్రశాంతి రెడ్డి ఆ ఛాన్స్ ను నల్లపురెడ్డికి ఎంతమేరకు ఇస్తారన్నది ప్రశ్న.కోవూరు నియోజకవర్గ రాజకీయాల్లో వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిల మధ్య తీవ్రమైన రాజకీయ మరియు విభేదాలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం చుట్టూ తిరుగుతుంది. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మరియు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మధ్య వార్ ఇంకా కొనసాగుతూనే ఉంది. వ్యక్తిగత విమర్శలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ప్రసన్న కుమార్ రెడ్డి గతంలో ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత, వ్యక్తిగత వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై ప్రశాంతి రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళా ఎమ్మెల్యే అయిన ప్రశాంతి రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో, మహిళల ఫిర్యాదు మేరకు ప్రసన్న కుమార్ రెడ్డిపై కోవూరు పోలీసులు కేసు నమోదు చేశారు.ఇటీవల వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమాన్ని వైసీపీ నిర్వహించింది. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి భారీగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేపైనా, కూటమి ప్రభుత్వంపైన తీవ్ర విమర్శలు చేశారు. దీనికి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఘాటుగా సమాధానం ఇచ్చారు. మెరుపుతీగలా కోవూరుకు వచ్చి వెళ్లే నేత గురించి పట్టించుకోవాల్సిన పనిలేదని ప్రశాంతి రెడ్డి నల్లపురెడ్డి పై విరుచుకుపడ్డారు. కోవూరు నియోజకవర్గం ప్రజలు తెలివైన వారని, వచ్చే ఎన్నికల్లోనూ ప్రసన్న గెలవలేంటూ సవాల్ విసిరారు. అంతేకాదు కోవూరు నియోజకవర్గంలో వైసీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కూడా తొలగించడం వివాదం గా మారింది. మొత్తం మీద ఎన్నికలకు మూడేళ్ల ముందే కోవూరు రాజకీయాలతో సలసల మండుతోంది.

## దాడి వీరభద్రరావు దారెటు..

**విశాఖపట్టణం, జూన్ 16, పెన్ పవర్:** ఉమ్మడి విశాఖ జిల్లాలో తెలుగుదేశం పార్టీలో సీనియర్ మోస్ట్ లీడర్ గా దాడి వీరభద్రరావు ఉన్నారు. ఆయన 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అలా వరసగా నాలుగు సార్లు గెలిచి అనేక మంత్రిత్వ శాఖలను నిర్వహించిన దాడి 2007 నుంచి 2013 దాకా శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా వ్యవహరించారు. అయితే ఆయన వైసీపీలోకి వెళ్లడంతో ఆయన రాజకీయ జీవితం మీదనే కాకుండా కుమారుడి రాజకీయ భవిష్యత్తు మీద కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది.తెలుగుదేశం పార్టీలో అయ్యన్నపాత్రుడితో సరిసమానంగా దాడి వీరభద్రరావు 1980, 1990 దశకంలో రాణించారు. ఇద్దరికీ మంత్రి పదవులు ఇచ్చి ఎన్టీఆర్ గౌరవించారు. అలాగే కీలక శాఖలను కూడా ఈ ఇద్దరు నేతలూ చూశారు. పూర్వాశ్రమంలో హిందీ మాస్టార్ గా పనిచేసిన దాడి అంటే ఎన్టీఆర్ కి ప్రత్యేకమైన అభిమానం ఉంది. అందుకే ఆయనకు కీలక స్థానం పార్టీలో కల్పించారు. ఇదిలా ఉంటే పార్టీ పదవులలో కూడా దాడికి ప్రముఖ స్థానం ఉంటూ వచ్చింది. అయితే ఆయన 2013లో తన ఎమ్మెల్సీ పదవిని రెన్యువల్ చేయలేదన్న కారణంతో టీడీపీని వీడారు. రాజకీయంగా అదే పెద్ద పొరపాటు అని ఆయన వర్గీయులు చెబుతున్నారు.అనకాపల్లిలో దాడి వీరభద్రరావు తన హవాను దశాబ్దాల పాటు చాటుకుంటూ వచ్చారు. ఎపుడైతే ఆయన టీడీపీని వీడారో నాటి నుంచే ఆయన ప్రాభవం తగ్గుతూ వచ్చింది. వైసీపీలో కూడా సరైన అవకాశాలు దక్కలేదు. దాంతో 2024 ఎన్నికల ముందు తిరిగి టీడీపీలో దాడి వీరభద్రరావు చేరారు. అయితే ఆయన కుమారుడు దాడి రత్నాకర్ కి అనకాపల్లి టికెట్ ఆశించినా దక్కలేదు. అయితే 2029 ఎన్నికల మీదనే దాడి కుటుంబం ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు.అయ్యన్నపాత్రుడు కుమారుడు విజయ్ కి రాజ్యసభ సభ్యత్వం ఇచ్చి వారసులకు తగిన ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా టీడీపీ సంకేతాలు పంపించింది. దాంతో దాడి లాంటి సీనియర్లలో కొత్త ఆశలు మొలకెత్తుతున్నాయని అంటున్నారు. తన వారసుడిని కూడా ఎమ్మెల్యేగా చూడాలని దాడి మాస్టారు ఆశ పడుతున్నారు. అనకాపల్లిలో టీడీపీ బలంగా ఉంది. ఇక దాడికి ప్రత్యేక వర్గం ఉంది. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల మీద ఫోకస్ పెట్టి దాడి కుటుంబం పనిచేస్తోంది. అయితే అనకాపల్లిలో టీడీపీకి ఎంతో మంది నాయకులు ఉన్నారు. టికెట్ కోసం భారీ పోటీ ఉంది. దాడి పార్టీని వీడాక చాలా మంది నాయకులు తయారయ్యారు. ఈ నేపథ్యంలో వారిని అందరినీ దాటుకుని అధినాయకత్వం మన్ననలు అందుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు. ఇక పార్టీలో అవకాశాలు దక్కాలీ అంటే విధేయత కొలమానంగా చూస్తున్నారు.అలాగే పార్టీ కోసం కష్టించి పనిచేసే వారికే పట్టం కడుతున్నారు. మరి దాడి కుటుంబానికి న్యాయం జరుగుతుందా అన్నదే ఆయన అనుచరుల ఆలోచనగా ఉంది. మాస్టార్ రాజకీయ వారసత్వం కొనసాగాలని ఆయన అభిమానులు కోరుకుంటున్నప్పటికీ అనకాపల్లి టీడీపీ రాజకీయం మాత్రం అంత సానుకూలంగా లేదని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

## పీక్స్ కు చేరిన బ్రదర్స్ వార్

**విజయవాడ, జూన్ 16, పెన్ పవర్:** బెజవాడ పొలిటికల్ స్క్రీన్ మీద సరికొత్త 'బ్రదర్స్ వార్' పీక్స్ కి చేరింది. నిన్నటివరకు పార్టీల మార్పు, టికెట్ల రాజకీయం చుట్టూ తిరిగిన కేశినేని సోదరుల వివాదం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకరి జాతకాలను ఒకరు రోడ్డుపైకి లాగుతూ, ఏకంగా వందల కోట్ల బ్యాంక్ స్కామ్స్, ఈడీ ఫిర్యాదుల వరకు వెళ్లడంతో ఏపీ పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. 2024 ఎన్నికల ముగిసినా వీరి మధ్య మంటలు చల్లారకపోగా.. మరింత ముదరడం గమనార్హం. ఈ పొలిటికల్ ఫైట్‌లో విజయవాడ సిట్టింగ్ ఎంపీ కేశినేని చిన్ని వేసిన సరికొత్త స్కెచ్ ఇప్పుడు సంచలనంగా మారింది. తనపై వస్తున్న బినామీ, భూ ఆక్రమణల ఆరోపణలకు చెక్ పెడుతూ.. ఆయన నేరుగా మాజీ ఎంపీ కేశినేని నాని ఆర్థిక మూలాలనే టార్గెట్ చేశారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును నాని అడ్డంగా ముంచేశారని, దాదాపు రూ. 120 కోట్ల ప్రజాధనాన్ని మొండి బకాయిలుగా మార్చేశారంటూ సంచలన ఆరోపణలు చేశారు. నిబంధనల్లోని లూప్‌హోల్స్‌ను వాడుకుంటూ నాని విజయవాడ 'విజయ్ మాల్యా'లా మారారని, చివరకు ఆయన ఉంటున్న ఇల్లు, వాడుతున్న హోటల్ కూడా బ్యాంక్ ఆధీనంలోనే ఉన్నాయంటూ చిన్ని బాంబ్ పేల్చారు. అయితే, తమ్ముడు వేసిన ఈ రివర్స్ అటాక్‌పై మాజీ ఎంపీ కేశినేని నాని కూడా ఏమాత్రం తగ్గడం లేదు. సోషల్ మీడియా వేదికగా ఆయన రీ-కౌంటర్ ఇచ్చారు. వేల కోట్ల ప్రభుత్వ భూములను ఒక కార్పొరేట్ సంస్థకు కట్టబెట్టే పెద్ద డీల్‌ను తాను సీఎంకు లేఖ రాసి అడ్డుకున్నానని, ఆ ఫ్రస్టేషన్‌తోనే తనపై కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. న్యాయ వ్యవస్థలో చిన్న లూప్ హోల్ అడ్డంపెట్టుకుని న్యాయస్థానాలనుసైతం కేశినేని నాని తప్పుదోవ పట్టించారని, తనపై పోటీ చేసిన అభ్యర్థుల్ని ఫ్రాడ్ అనటం కేశినేని నానికి అలవాటని కేశినేని చిన్ని తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ప్రజారాజ్యం పార్టీ నుంచి బయటకొస్తూ చిరంజీవి, పవన్ కళ్యాణ్‌లనూ విమర్శించాడు. ఒక్క సాక్షి మీడియా, జగన్‌ను తప్ప ఇతరులదరినీ విరమర్శించే నాని ఆంతర్యం ఏంటి? అంటూ చిన్ని ప్రశ్నించారు.జగన్ పంథాలోనే దొంగే దొంగా దొంగా అని అరిచినట్లు చేయటం నానికి అలవాటు. సామాజిక మాధ్యమం వేదికగా నాని నాపై చేసేది అసత్య ఆరోపణలే. దీనిపై పోలీసులు తమ పని తాను చేసుకెళ్తున్నారు. విజయవాడ ప్రజలకు, అలాగే చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్‌లకు మాత్రమే తాను జవాబుదారినని, సోషల్ మీడియా పోస్టులకు కాదని పేర్కొన్నారు. తనపై చేసే ఆరోపణలకు సరైన ఆధారాలు ఉంటే వాటికి సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని కేశినేని చిన్నీ స్పష్టం చేశారు.బెజవాడ పాలిటిక్స్‌లో ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడుస్తున్న ఈ కోట్ల రూపాయల మైండ్ గేమ్ రాబోయే రోజుల్లో ఇంకెన్ని సంచలనాలకు దారితీస్తుందో చూడాలి.

## రామ్మోహననాయుడికి అవకాశం లేదా...

**శ్రీకాకుళం జూన్ 16, పెన్ పవర్: :** భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రారంభానికి కూత వేటు దూరంలో నిలిచింది. వచ్చే నెలలో ప్రారంభోత్సవం ఉంటుందన్న టాక్ నడుస్తోంది. మరోవైపు ప్రైవేటు విమానయాన సంస్థలు తమ కార్యకలాపాలను జూలై 5 నుంచి ప్రారంభించనున్నాయి.



వాటికి సంబంధించి ప్రత్యేక ప్రకటన కూడా చేశాయి. ప్రస్తుతం చూస్తుంటే మాత్రం జూలైలో విమానాశ్రయం ప్రారంభం గ్యారెంటీ అని తేలిపోయింది.భోగాపురం విమానాశ్రయ నిర్మాణ పనులు శరవేగంగా జరగడంలో.. ఉత్తరాంధ్రకు చెందిన పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషి ఉంది. గత రెండేళ్లుగా ఆయన నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను పరుగెత్తించారు. అందుకే పనులు చాలా వేగంగా కొనసాగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంతోనే చాలా వేగంగా పనులు జరిగాయి. ఇక్కడ విమాన రాకపోకలకు సంబంధించి ట్రయల్ రన్ సక్సెస్ అయ్యింది. చివరిగా పెండింగ్ పనులు జరుగుతున్నాయి. వచ్చే నెలలో ప్రారంభోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోంది.అయితే ఈ విమానాశ్రయ ప్రారంభోత్సవ సమయానికి కింజరాపు రామ్మోహన్ నాయుడు పరిస్థితి ఏంటనే చర్చ నడుస్తోంది. ఆయన ప్రస్తుతం పౌరవిమానయాన శాఖ మంత్రిగా ఉన్నారు. 2024 ఎన్నికల్లో మోడీ నేతృత్వంలో ఎన్డీఏ మూడోసారి అధికారంలోకి వచ్చింది. తెలుగుదేశం పార్టీ కీలక భాగస్వామి కావడంతో ఆ పార్టీకి రెండు మంత్రి పదవులు దక్కాయి కేంద్రంలో. రామ్మోహన్ నాయుడుకు కీలకమైన పౌర విమానయాన శాఖ దక్కింది. అయితే ఆయన బాధ్యతలు తీసుకున్న నాటి నుంచి ఏదో ఒక వివాదం రేగుతూనే ఉంది. ఆయన శాఖ మార్పు ఉంటుందన్న ప్రచారం ఎప్పటినుంచో ఉంది.కేంద్ర మంత్రివర్గ విస్తరణ చేపట్టేందుకు నరేంద్ర మోడీ కసరత్తు ప్రారంభించినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ నెల 20న ముహూర్తంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈనెల 18 తో రాజ్యసభ ఎన్నికల ప్రక్రియ కూడా పూర్తవుతుంది. అందుకే మంత్రి వర్గ విస్తరణలో కొత్తవారికి చోటుతోపాటు పాత వారి శాఖల కేటాయింపు ఉంటుందన్న టాక్ ఉంది. పౌర విమానయాన శాఖ నుంచి తప్పించి.. రామ్మోహన్ నాయుడుకు పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను ఇస్తారని ఎప్పటినుంచో ప్రచారంలో ఉంది. అదే జరిగితే పౌర విమానయాన శాఖ మంత్రిగా భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవంలో.. ప్రధాని తరువాత అదే స్థాయిలో గౌరవం దక్కాల్సిన రామ్మోహన్ నాయుడుకు ఆ ఛాన్స్ లేనట్టే. చూడాలి మరి ఏం జరుగుతుందో..

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# మంగళవారం దిగొచ్చిన బంగారం, వెండి.. తెలుగు రాష్ట్రాల రేట్లివే..



**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికా ఇరాన్ శాంతి ఒప్పందం తర్వాత భారీగా పెరిగిన బంగారం రేట్లు ఇవాళ కొంత చల్లబడ్డాయి. ఇదే క్రమంలో వెండి రేట్లలో కూడా తెలుగు రాష్ట్రాల్లో భారీగా మారింది. తగ్గిన ధరల్లో ఆభరణాలు షాపింగ్ చేయాలనుకుంటున్న రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ముందుగా తమ నగరాల్లో మారిన రేట్లను పరిశీలించి నిర్ణయం తీసుకోవటం బెటర్. జూన్ 16న బంగారం రేట్లు తగ్గాయి. జూన్ 15 కంటే గ్రాముకు 24 క్యారెట్ల బంగారం రేటు దేశవ్యాప్తంగా గ్రాముకు రూ.16 తగ్గింది. దీంతో హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడప నగరాల్లో స్వచ్ఛమైన బంగారం రేటు రూ.15వేల 137గా కొనసాగుతోంది. ఈ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం రేటు గ్రాముకు రూ.13వేల 875గా కొనసాగుతోంది. మంగళవారం రోజున వెండి రేట్ల విషయానికి వస్తే.. జూన్ 16, 2026న దేశవ్యాప్తంగా కేజీకి రూ.5వేలు తగ్గింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్, వరంగల్, నిజాంబాద్, ఖమ్మం, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, కడపలో కేజీ స్వచ్ఛమైన వెండి రేటు కేజీకి రూ.5వేలు తగ్గి రూ.2లక్షల 75వేలుగా ఉంది. అంటే గ్రాము దాదాపు రూ.275 దగ్గర ఉంది.

# క్రికెట్‌లో కొత్త సెన్సేషన్... అందం, ఆట రెండింట్లోనూ అదుర్స్!



**హైదరాబాద్ పెన్ పవర్:** సోషల్ మీడియాలో ఇప్పుడు ఎక్కడ చూసినా ఒక కొత్త క్రికెటర్ పేరు మారుమోగిపోతోంది. ఆస్ట్రేలియా అండర్-19 మహిళా క్రికెట్ జట్టుకు ఆడుతున్న భారత సంతతి నటి 'ఇరా ఏరీ' ప్రస్తుతం క్రికెట్ అభిమానుల సరికొత్త క్రష్‌గా మారిపోయారు. మైదానంలో ఆమె చురుకుదనం, అద్భుతమైన బౌలింగ్ నైపుణ్యంతో పాటు ఆమెకున్న హీరోయిన్ కటౌట్ నెటిజన్లను ఫిదా చేస్తోంది. అటు ఆటతో, ఇటు అందంతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ క్రికెటర్ విశేషాలు చూద్దాం..

**ఇంటర్నెట్‌ను ఊపేస్తున్న కొత్త క్రష్:**
ఆస్ట్రేలియా మహిళా క్రికెట్‌లో ఇరా ఏరీ సరికొత్త స్టార్‌గా అవతరించారు. సాధారణంగా క్రికెటర్లు అనగానే కేవలం ఆట గురించే మాట్లాడుకుంటారు. కానీ ఈమె విషయంలో ఆటతో పాటు ఆమె లుక్స్ కూడా హాట్ టాపిక్‌గా మారాయి. ఇక గ్రౌండ్‌లో షార్ట్స్ ధరించి ఆమె అటు ఇటు పరిగెడుతున్న ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఆమెను చూసిన నెటిజన్లు "క్రికెట్ గ్రౌండ్‌లోకి హీరోయిన్ వచ్చినట్లుంది" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

**భారత సంతతి అమ్మాయే:**
ఆస్ట్రేలియా జట్టు తరపున ఆడుతున్నప్పటికీ, ఇరా ఏరీ మూలాలు భారతదేశానికి చెందినవే. భారత సంతతికి చెందిన ఈ టీనేజ్ ప్లేయర్, ఆస్ట్రేలియాలో స్థిరపడి అక్కడ క్రికెట్‌లో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకుంటోంది. ఇక విదేశీ గడ్డపై మన రక్తం ఉన్న అమ్మాయి ఇంతలా మెరిసిపోతుండటంతో భారతీయ అభిమానులు కూడా ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

**బౌలింగ్‌లో సత్తా చాటుతోంది:**
ఇరా ఏరీ కేవలం గ్లామర్‌తోనే కాదు, అంతకంటే పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో మ్యాచ్‌లను మలుపు తిప్పుతోంది. రీసెంట్‌గా జరిగిన మ్యాచ్‌ల్లో ఆమె వేసిన బంతులకు ప్రత్యర్థి టీమ్ బ్యాటర్లు వికెట్లు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇక ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఏకంగా 4 వికెట్లు, అలాగే శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 3 వికెట్లు పడగొట్టి ఆస్ట్రేలియా జట్టుకు అద్భుతమైన విజయాలను అందించింది.

**గ్లామర్ క్వీన్ అంటూ నెటిజన్ల ఫిదా:**
ఆమె ఆటను చూసిన విశ్లేషకులు ఆస్ట్రేలియా క్రికెట్‌కు ఒక మంచి ఫ్యూచర్ స్టార్ దొరికిందని అంటుంటే, ఫ్యాన్స్ మాత్రం ఆమె అందానికి ఫిదా అయిపోతున్నారు. ఇక సోషల్ మీడియాలో ఆమె ఫాలోయింగ్ రాత్రికి రాత్రే అమాంతం పెరిగిపోయింది. స్పోర్ట్స్ నైపుణ్యంతో పాటు మోడల్‌కు ఏమాత్రం తీసిపోని లుక్స్ ఉండటంతో బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు కూడా ఆమె వైపు మునుముందు చూస్తారేమో..
అందం, ప్రతిభ ఒకేచోట చేరితే ఎలా ఉంటుందో ఈమెనుని చూస్తే అర్థమవుతుంది. కేవలం లుక్స్‌తోనే కాకుండా బంతితో మ్యాజిక్ చేస్తూ జట్టులో కీలక ప్లేయర్‌గా ఎదగడం నిజంగా గ్రేట్. త్వరలోనే ఈ భారత సంతతి అమ్మాయి అండర్-19 స్థాయి నుంచి సీనియర్ నేషనల్ టీమ్‌లోకి అడుగుపెట్టి మరిన్ని రికార్డులు సృష్టించాలని ఆశిద్దాం.

# ప్లాన్-బి కాదు.. స్ట్రాటజిక్ రీలోకేషన్.. భారతీయ ఐటీ హబ్‌ల వైపు విదేశీ విద్యార్థుల చూపు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఒకప్పుడు భారతీయ మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి విద్యార్థుల జీవిత మార్గం చాలా స్పష్టంగా ఒకే మూసలో సాగిపోయేది. ఇంటర్ లేదా బీటెక్ పూర్తి కావడం ఆలస్యం.. జీఆర్ఈ , ఐఎల్టీఎస్ కోచింగ్ సెంటర్లలో చేరడం, యూఎస్ ఫాల్ ఇన్‌టేక్ పట్టుకోవడం, ఆపై లింక్డ్ఇన్ ప్రొఫైల్‌లో "లివింగ్ ద డ్రీమ్ యూఎస్" అని స్టేటస్ పెట్టడం.. ఇదీ వరుస. చివరగా "మరో రెండేళ్లలో గ్రీన్ కార్డ్ వచ్చేస్తుంది" అంటూ ఇండియాలోని తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంతో ఆ స్క్రిప్ట్ ముగిసేది. కానీ ఇప్పుడు ఆ పాత స్క్రిప్ట్‌లో ఊహించని పెద్ద ట్విస్ట్ వచ్చింది.నౌకరీ.కామ్ , లింక్డ్ఇన్ ఇండియా, స్టార్టప్ కెరీర్స్ ఇండియా వంటి దేశీయ జాబ్ పోర్టల్స్‌లో విదేశాల్లో చదువుకున్న భారతీయ విద్యార్థుల ప్రొఫైల్స్ ఒక్కసారిగా వరదలా ప్రత్యక్షం కావడం మొదలైంది. ఇది చూసి చాలామంది తల్లిదండ్రులు మొదట్లో టెక్నికల్ లోపమో లేదా వీపీఎన్ సమస్యో అనుకున్నారు. కానీ అసలు నిజం వేరే ఉంది. 'స్టూడెంట్ సర్కస్' అనే గ్లోబల్ కెరీర్ ప్లాట్‌ఫామ్ గణాంకాల ప్రకారం.. 2023 నుంచి 2024 మధ్య కాలంలో భారతదేశంలో ఉద్యోగాల కోసం వెతుకుతున్న విదేశీ విద్యార్థుల సంఖ్య ఏకంగా 89 శాతం పెరిగింది. ఈ మార్పును గమనించిన కొన్ని విదేశీ విద్యా కన్సల్టెన్సీలు అప్పుడే "రిటర్న్ టు ఇండియా ప్యాకేజీ" పేరుతో కొత్త బ్రోచర్లు కూడా సిద్ధం చేయడం విశేషం.

**"అబ్రాడ్ అడ్వాంటేజ్" నుంచి "అబ్రాడ్ అడ్వెంచర్" వైపు..**
గతంలో విదేశీ విద్య అనేది ఒక పక్కా ప్లాన్ ప్రకారం సాగే నాలుగు అంచెల ప్రోగ్రామ్... చదువు, ఉద్యోగం, పీఆర్ సెటిల్‌మెంట్. కానీ ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు ఈ రోడ్‌మ్యాప్‌ను మార్చేశాయి. గ్లోబల్ మార్కెట్‌లో వీసా నిబంధనలు నానాటికీ కఠినంగా మారుతున్నాయి, ఉద్యోగ మార్కెట్ కుంచించుకుపోతోంది. చాలా కంపెనీలు ఫ్రెషర్లకు కాకుండా "కనీసం మూడేళ్ల అనుభవం కావాలి" అని కండిషన్లు పెడుతుండటంతో విద్యార్థులు "అనుభవం కోసమే కదా మేము ఇక్కడికి వచ్చింది" అని తలలు పట్టుకుంటున్నారు. ఫలితంగా విదేశీ కలల రహదారిపై "అన్‌ఎక్స్‌పెక్టెడ్ డిటోర్" బోర్డులు దర్శనమిస్తున్నాయి.

# బంగారం కొనుగోళ్లలో భారతీయుల 'సేఫ్ గేమ్'.. లావాదేవీలు పెరిగినా.. తగ్గిన పెట్టుబడి పరిమాణం!



**హైదరాబాద్ పెన్ పవర్:** భారతదేశంలో సాంప్రదాయ బంగారానికి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే మారుతున్న కాలంతో పాటు భారతీయుల పెట్టుబడి శైలి కూడా మారుతోంది. భౌతిక బంగారం స్థానంలో డిజిటల్ గోల్డ్ వైపు మళ్లుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. తాజా గణాంకాల ప్రకారం.. మే నెలలో డిజిటల్ గోల్డ్ లావాదేవీలు సరికొత్త రికార్డులను సృష్టించాయి. అయితే ఇక్కడే ఒక ఆసక్తికరమైన మార్పు చోటుచేసుకుంది. లావాదేవీల సంఖ్య విపరీతంగా పెరిగినప్పటికీ పెట్టుబడి పెట్టిన మొత్తం విలువలో మాత్రం స్వల్ప తగ్గుదల కనిపించింది. మార్కెట్ నిపుణులు చెప్తున్న దాని ప్రకారం.. భారతీయ పెట్టుబడిదారులు ప్రస్తుతం డిజిటల్ గోల్డ్ విషయంలో కొంత జాగ్రత్త ధోరణిని అవలంబిస్తున్నారు.

**రికార్డు స్థాయిలో లావాదేవీలు.. తగ్గిన పెట్టుబడి విలువ**
తాజా మార్కెట్ నివేదికల ప్రకారం.. మే నెలలో దేశవ్యాప్తంగా జరిగిన డిజిటల్ గోల్డ్ లావాదేవీల సంఖ్య 24.9 కోట్లకు చేరుకుంది. ఇది గత నెలలతో పోలిస్తే గణనీయమైన వృద్ధిని, డిజిటల్ బంగారం పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను సూచిస్తోంది. కానీ ఈ లావాదేవీల మొత్తం విలువను గమనిస్తే విశ్లేషకులు సైతం ఆశ్చర్యపోతున్నారు. ఏప్రిల్ సాధారణ వృద్ధి ?2,499 కోట్లు కాగా.. మే నెలలో రికార్డు స్థాయిలో ?2,451 కోట్లకు పెరిగింది. ఈ గణాంకాలను బట్టి చూస్తే ఏప్రిల్ నెలతో పోలిస్తే మే నెలలో లావాదేవీల సంఖ్య పెరిగినప్పటికీ మొత్తం మార్కెట్ విలువ దాదాపు ?48 కోట్లు తగ్గింది. అంటే లావాదేవీల సంఖ్య పెరిగినా ఒక్కో కొనుగోలుకు వెచ్చించే సగటు పరిమాణం తగ్గినట్లు స్పష్టమవుతోంది.

**మారుతున్న వినియోగదారుల ఆర్థిక ప్రవర్తన.. కారణాలు ఇవేనా?**
డిజిటల్ గోల్డ్ మార్కెట్లో కనిపిస్తున్న ఈ విచిత్రమైన ధోరణి చూస్తే.. పెట్టుబడిదారులు ఒకేసారి పెద్ద మొత్తంలో కాకుండా క్రమం తప్పకుండా చిన్న చిన్న మొత్తాలను ఎస్ఐపీ తరహాలో పెట్టుబడి పెట్టే వ్యూహాన్ని అనుసరిస్తున్నారు. దీనివల్ల లావాదేవీల సంఖ్య పెరుగుతోంది. కానీ ఒకేసారి మార్కెట్లోకి వచ్చే డబ్బు పరిమాణం తగ్గుతోంది.

**ఈ మార్పుకు దారితీసిన ప్రధాన అంశాలు..**
మార్కెట్లో బంగారం ధరలు నిరంతరం పెరుగుతూ ఉండటంతో సామాన్య మరియు మధ్యతరగతి పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో రిస్క్ తీసుకోకుండా జాగ్రత్త పడుతున్నారు. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న అస్థిరతల కారణంగా, చేతిలో ఉన్న నగదును ఒకే రంగంలో భారీగా పెట్టుబడి పెట్టడానికి ప్రజలు వెనుకాడుతున్నారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలపై భారతీయ వినియోగదారులలో అవగాహన పెరిగింది. పొదుపును క్రమబద్ధీకరించుకుంటూ ప్రతి నెలా చిన్న మొత్తాలను డిజిటల్ గోల్డ్ లో దాచుకుంటున్నారు.

**మోదీ వ్యాఖ్యల ప్రభావమా?**
ఇటీవల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజలను బాధ్యతాయుతమైన పెట్టుబడుల వైపు దృష్టి సారించాలని.. ఆలోచించి అడుగులు వేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తూ చిన్న మొత్తాలతోనే కొనుగోళ్లు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారని కొంతమంది విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే మే నెలలో కనిపించిన ఈ మార్పుకు ప్రధాని మోదీ వ్యాఖ్యలే ప్రత్యక్ష కారణమని నిర్ధారించడానికి ప్రస్తుతం ఎలాంటి అధికారిక ఆధారాలు లేవు.సంఖ్యలు పెరుగుతున్నా.. పెట్టుబడి విలువ తగ్గడం అనేది భారతీయ వినియోగదారుల పరిణతి చెందిన ఆర్థిక ప్రవర్తనకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. డిజిటల్ గోల్డ్ పట్ల భారతీయుల ఆసక్తి ఎంతమాత్రం తగ్గలేదని.. కేవలం వారు పెట్టుబడి ఫెుట్టే విధానాన్ని మాత్రమే మార్చుకున్నారని మే నెల గణాంకాలు నిరూపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో బంగారం ధరలు స్థిరపడితే.. లావాదేవీల సంఖ్యతో పాటు మొత్తం పెట్టుబడి విలువ కూడా మళ్లీ పుంజుకునే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# విజయ్ కోరిక.. ఆయనలో కలిగిన మార్పు.. భవిష్యత్తు బంగారు మయం!



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తాజాగా తీసుకున్న ఒక నిర్ణయం అందరి హృదయాలను గెలుచుకుంటోంది. తనను మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చిన ప్రముఖ నటుడు విశాల్ తెచ్చిన సాంప్రదాయ శాలువా, బొకేలను ఆయన సున్నితంగా తిరస్కరించారు. వాటికి పెట్టే ఖర్చుతో పేద పిల్లల చదువుకు సాయం చేయాలని కోరారు. సీఎం మాటలతో స్ఫూర్తి గా తీసుకున్న విశాల్.. ముగ్గురు పేద విద్యార్థినుల చదువు బాధ్యతలను స్పాన్సర్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ గ్రేట్ మూమెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు చూద్దాం..

**సీఎం విజయ్‌తో విశాల్ ముచ్చట్లు:**
తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను నటుడు విశాల్ రీసెంట్‌గా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మీటింగ్ తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, విజయ్ అన్నను కలవడం ఒక 'ఫ్యాన్ బాయ్ మూమెంట్' అని విశాల్ చెప్పుకొచ్చారు. గతంలో కరుణానిధి, జయలలిత, స్టాలిన్, ఉదయనిధి వంటి ఎందరో రాజకీయ నాయకులను కలిసినప్పటికీ.. విజయ్ అన్నను కలవడంలో ఉన్న ఆత్మీయతే వేరని విశాల్ ఎమోషనల్ అయ్యారు.

**శాలువా వద్దు.. చదువు ముద్దు:**
సాధారణంగా పెద్ద నాయకులను కలవడానికి వెళ్లినప్పుడు శాలువాలు కప్పడం, బొకేలు ఇవ్వడం ఒక ఆనవాయితీ. విశాల్ కూడా అలాగే వెళ్లారు. కానీ సీఎం విజయ్ మాత్రం వాటన్నింటినీ సున్నితంగా పక్కన పెట్టేశారు. శాలువాలు, బొకేల వల్ల పెద్దగా ఉపయోగం ఉండదని.. వాటికి పెట్టే ఖర్చుతో ఎవరైనా పేద బాలికల చదువుకు సాయం చేస్తే బాగుంటుందని విజయ్ ఒక మంచి సలహా ఇచ్చారు.

**ముగ్గురు అమ్మాయిల చదువుకు భరోసా:**
సీఎం విజయ్ చెప్పిన మాట విశాల్ మనసుకు బలంగా తాకింది. వెంటనే ఆయన ఒక అద్భుతమైన నిర్ణయం తీసుకున్నారు. బొకేలు, శాలువాలకు అయ్యే ఖర్చును తమిళనాడులోని ముగ్గురు నిరుపేద విద్యార్థినుల విద్యాభ్యాసానికి కేటాయించారు. ఇక సీఎం విజయ్ పేరు మీదుగానే ఆ మొత్తాన్ని విరాళంగా అందించి, ఆ ముగ్గురు అమ్మాయిల చదువు బాధ్యతలను తన భుజాల మీద వేసుకున్నారు.

**బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థిని:**
ఈ సాయం అందుకున్న వారిలో పుష్ప అనే విద్యార్థిని కూడా ఉంది. ఆమె ప్రస్తుతం బిఎస్సీ కంప్యూటర్ సైన్స్ చదువుతోంది. ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్న ఆమె తో పాటు మరో ఇద్దరు అమ్మాయిల కాలేజీ ఫీజులను, చదువు ఖర్చులను ఇకపై విశాల్ తన సొంత డబ్బులతో భరించబోతున్నారు. సీఎం విజయ్ చూపిన బాటలో విశాల్ చేసిన ఈ సాయంపై ప్రశంసలు కురుస్తున్నాయి. రాజకీయాల్లో మార్పు అంటే పెద్ద పెద్ద స్పీచ్‌లు ఇవ్వడం కాదు.. ఇలాంటి చిన్న చిన్న పనులతోనే సమాజంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని తమిళనాడు సీఎం విజయ్ నిరూపించారు. అలాగే ఆయన మాటను గౌరవించి ముగ్గురు విద్యార్థినుల జీవితాల్లో వెలుగులు నింపిన నటుడు విశాల్ నిజంగా గ్రేట్ అని చెప్పాలి. ఈ ఇద్దరు స్టార్స్ చేసిన పని మిగతా వారికి కూడా ఒక మంచి స్ఫూర్తిగా నిలుస్తుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు.

# తగ్గేదేలే.. సమయం వచ్చినప్పుడు సమాధానం చెప్తా : హోంమంత్రి అనిత స్ట్రాంగ్ రియాక్షన్

**హైదరాబాద్ పెన్ పవర్:** హోంమంత్రి అనితపై మాజీ మంత్రి, వైసీపీ నేత గుడివాడ అమరనాథ్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. హోంమంత్రి అనితను మాత్రమే కాకుండా యావత్ మహిళాలోకాన్ని అవమానించేలా అమరనాథ్ విమర్శలు ఉన్నాయని కూటమి నేతలు ఎదురుదాడి చేస్తున్నారు. ఇక ఈ అంశంపై మంగళవారం ఉప ముఖ్యమంత్రి పవన్ ట్వీట్ చేయగా, హోంమంత్రి అనిత కూడా 'ఎక్స్'లో తన అధికారిక అకౌంట్ నుంచి మాజీ మంత్రి విమర్శలపై విరుచుకుపడుతూ పోస్ట్ పెట్టారు. దీంతో మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ విమర్శలు రేపిన కాక ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదని అంటున్నారు. "ఒక బహిరంగ సభలో, కెమెరా ముందు ఒక వైఎస్సార్‌సీపీ నాయకుడు నా గురించి అన్న మాటలు కేవలం నన్ను అవమానించడం మాత్రమే కాదు. రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక మహిళను, ఒక దళితురాలిని అవమానించే లక్ష్యంతో చేసిన నీచమైన, కులతత్వ దాడి" అంటూ హోంమంత్రి అనిత ట్వీట్ చేశారు. మాజీ మంత్రి వాడిన భాష అవమానకరమైనదంటూ మండిపడ్డారు. ఇలాంటి సంస్కృతిని వైఎస్సార్‌సీపీ పెంచి పోషిస్తోందని విమర్శించారు. "ఒక మహిళ తన సొంత కష్టంతో, దృఢ సంకల్పంతో, ప్రజా సేవతో పైకి వచ్చినప్పుడు కొంతమంది పురుషులు ఇలాంటి దాడులు చేస్తారు" అంటూ ఆ ట్వీట్ లో హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక దూషణలు, బెదిరింపులకు పాల్పడతారన్నారని ధ్వజమెత్తారు. తన జీవితంలో ఇలాంటి దాడులను ఎన్నో చూశానని పేర్కొన్నారు. ఇలాంటి దాడులు తన సంకల్పాన్ని మరింత బలపరుస్తాయని స్పష్టం చేశారు. మాజీ మంత్రి చేసిన విమర్శలతో తన గొంతు నొక్కేయలేరని, ఎవరికీ తలవంచే రకం కాదని మంత్రి తేల్చిచెప్పారు. ఇలాంటి బెదిరింపులకు బెదిరేది లేదంటూ స్పష్టం చేశారు. తన ట్వీట్ లో మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ పేరు ఎక్కడా ప్రస్తావించకుండానే తనపై చేసిన వ్యాఖ్యలను ఎండగట్టే ప్రయత్నం చేశారు మంత్రి అనిత. ఇక కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో హోంశాఖ సాధించిన పురోగతిపైనా మంగళవారం మంత్రి అనిత మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలోనే మాజీ మంత్రి విమర్శలపై స్పందించాల్సిందిగా మీడియా ప్రతినిధులు కోరారు. అయితే ప్రభుత్వ విజయాలు, పోలీసుల గొప్ప పనితీరును చెప్పేందుకు తాను వచ్చానని, ఇలాంటి సందర్భంలో విజ్ఞత లేని వారి కోసం మాట్లాడి తనను తాను తగ్గించుకోలేనని వ్యాఖ్యానించారు. కానీ, ఆయన మాటలపై కచ్చితంగా స్పందిస్తానని, ఆ సమయం దగ్గరలోనే ఉందని అనిత స్పష్టం చేశారు.

**వైసీపీ ఎదురుదాడి**
కాగా, కూటమి నేతలు, మంత్రులు మాజీ మంత్రి గుడివాడను టార్గెట్ చేయడంపై వైసీపీ రియాక్ట్ అయింది. ఆ పార్టీకి చెందిన మహిళా నేతలు ఈ విషయంపై వరుసగా స్పందిస్తూ హోంమంత్రి అనితపై మాటల దాడి ముమ్మరం చేస్తున్నారు. అనిత కంటే ముందుగా మంత్రి పదవి చేపట్టి ఆరు శాఖలను సమర్థంగా నిర్వహించిన మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ ను వాడు, వీడు అంటూ హోంమంత్రి వ్యాఖ్యానించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పదవులు శాశ్వతం కాదని హోంమంత్రి గుర్తుంచుకోవాలని, మాజీ మంత్రిపై అమర్యాదగా మాట్లాడటం మానేయాలని హితవుపలకారు. మొత్తానికి మాజీ మంత్రి అమరనాథ్ చేసిన కామెంట్లు రాష్ట్ర రాజకీయాల్లో సంచలన చర్చనీయాంశంగా మారాయని అంటున్నారు.

# వరుసగా మూడో రోజు కూడా దూసుకెళ్లిన స్టాక్ మార్కెట్! 76,800 దాటిన సెన్సెక్స్..నిఫ్టీ 23,980 మార్క్ క్రాస్!

దేశీయ స్టాక్ మార్కెట్ వరసగా మూడో రోజు కూడా లాభాల బాట పట్టింది. గ్లోబల్ మార్కెట్లు డల్‌గా ఉన్నా.. ఇండియన్ స్టాక్ మార్కెట్ మాత్రం ఐటీ, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్ల పుణ్యమా అని రాకెట్‌లా దూసుకెళ్లింది. ఈరోజు మంగళవారం (జూన్ 16) బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 544.15 పాయింట్లు (0.71%) ఎగబాకి.. 76,808.48 పాయింట్ల గరిష్ట స్థాయి వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 135.25 పాయింట్లు (0.57%) లాభపడి, 23,989.15 మార్కును దాటేసింది. వరుసగా మూడు రోజులు మార్కెట్ ఇలా లాభాల్లో ముగియడంతో ఇన్వెస్టర్ల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. భారత మార్కెట్ ఇంతలా ఊపందుకోవడానికి దేశంలోని కొన్ని దిగ్గజ కంపెనీలు వెన్నుదన్నుగా నిలిచాయి. ప్రముఖ ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీ హిందుస్థాన్ యూనిలివర్ (HUL), అలాగే పవర్ సెక్టార్ దిగ్గజం ఎన్‌టీపీసీ (NTPC) షేర్లు ఏకంగా 2% చొప్పున లాభపడి మార్కెట్‌ను ముందుకు నడిపించాయి. అన్నిటికంటే ముఖ్యంగా ఈరోజు ఐటీ (IT) రంగం అత్యధికంగా లాభపడిన రంగంగా నిలిచింది. వీటితో పాటు మీడియా, ఫైనాన్షియల్ సర్వీసెస్, FMCG రంగాలు కూడా మార్కెట్‌కు మంచి బూస్ట్ ఇచ్చాయి. మార్కెట్ మొత్తం లాభాల్లో ఉన్న.. కొన్ని రంగాలు మాత్రం కాస్త నిరాశపరిచాయి. మెటల్స్, హెల్త్‌కేర్, సిమెంట్, ఫార్మా



రంగాల్లో నేడు అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా ఉండటంతో నష్టాల్లో ముగిశాయి. ఆసియా మార్కెట్లలో జపాన్‌కు చెందిన 'టోపిక్స్' సూచీ 0.2% పడిపోగా, హాంగ్‌కాంగ్‌కు చెందిన 'హాంగ్ సెంగ్' ఏకంగా 1.2% నష్టపోయింది. ఆస్ట్రేలియా, షాంఘై, అలాగే అమెరికాకు చెందిన నాడ్రా 500 ఫ్యూచర్స్ యథాతథంగా నిలిచాయి. యూరప్ మార్కెట్లు కూడా స్థిరంగా ఉన్నాయి.

# కళ్ళ ముందే ఉన్న కనిపెట్టలేరు.. చైనా సృష్టించిన కంటికి కనిపించని దోమ డ్రోన్.. నెక్స్ట్ లెవెల్ టెక్నాలజీ!



సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో హీరోలు శత్రువుల స్థావరాల్లోకి కంటికి కనిపించని సూక్ష్మ పరికరాలను పంపి రహస్యాలన్నీ తెలుసుకోవడం చూసే ఉంటాం కదా.. ఇప్పుడు అలాంటి టెక్నాలజీని చైనా నిజం చేసింది. ఒక చిన్న దోమ సైజులో ఉండే గూఢచారి డ్రోన్‌ను చైనా సైన్యం తయారు చేసింది. శత్రువుల ముక్కు ముందే తిరుగుతున్నా.. అది డ్రోన్ అని కనిపెట్టడం ఎవరికీ సాధ్యం కాదన్నమాట. చైనాలోని రోబోటిక్స్ ల్యాబ్ సృష్టించిన ఈ క్రేజీ గ్యాడ్జెట్ గురించిన ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు చూద్దాం....

**అసలు ఎలా ఉంటుంది ఈ 'దోమ' డ్రోన్**

చైనా మిలిటరీ టీవీ ఛానెల్ (జజుఎ 7) ప్రసారం చేసిన ఒక రిపోర్ట్ ప్రకారం, ఈ మైక్రో-డ్రోన్‌ను నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ డిఫెన్స్ టెక్నాలజీ పరిశోధకులు అభివృద్ధి చేశారు. దీని డిజైన్ సరిగ్గా మన ఇంట్లో తిరిగే దోమలాగే ఉంటుంది. దీనికి సన్నని శరీరం, రెండు చిన్న రెక్కలు, వెంట్రుకంత సన్నటి మూడు కాళ్లు ఉంటాయి. ఇది ఎంత చిన్నదంటే.. మనం రెండు వేళ్ల మధ్య చాలా ఈజీగా పట్టుకోవచ్చు. పరిశోధకులు దీనితో పాటు స్మార్ట్‌ఫోన్‌తో కంట్రోల్ చేయగల నాలుగు రెక్కల మరో మోడల్‌ను కూడా చూపించారు.

**శత్రువుల గుండెల్లో వణుకు**

ఈ ప్రాజెక్ట్‌లో పనిచేసిన స్టూడెంట్ లియాంగ్ హెక్సియాంగ్ చెప్పిన దాని ప్రకారం.. ఈ దోమ రోబోట్‌ను యుద్ధ సమయంలో రహస్య నిఘా కోసం, అత్యంత ప్రమాదకరమైన మిషన్ల కోసం తయారు చేశారు. సాధారణంగా పెద్ద పెద్ద డ్రోన్‌లను శత్రువుల రాడార్లు లేదా నిఘా కెమెరాలు సులభంగా పసిగట్టేస్తాయి. కానీ, ఈ దోమ డ్రోన్ అంత సున్నితమైన ప్రాంతాల్లోకి కూడా ఎవరికీ అనుమానం రాకుండా చొరబడిపోగలదు. శత్రువుల పక్కనే కూర్చుని అక్కడి రహస్యాలను, దృశ్యాలను లైవ్‌గా తన దేశ ఆర్మీకి పంపించేస్తుంది.

**ఇంత చిన్న డ్రోన్ వెనుక ఎంత పెద్ద కష్టముందో**

చూడటానికి చిన్న దోమలా ఉన్నా, దీన్ని తయారు చేయడం శాస్త్రవేత్తలకు ఒక పెద్ద సవాల్. ఎందుకంటే, అంత చిన్న బాడీలో కెమెరా సెన్సార్లు, బ్యాటరీ, కంట్రోల్ సర్క్యూట్లు, సిగ్నల్స్ పంపే కమ్యూనికేషన్ సిస్టమ్స్ అన్నింటినీ అమర్చాలి. పైగా గాల్లో ఎగిరేటప్పుడు బ్యాలెన్స్ తప్పకుండా, ఒక కీటకంలాగే కదిలేలా చేయడం కోసం మైక్రో-ఇంజనీరింగ్ అండ్ బయోనిక్స్ వంటి ఎన్నో అధునాతన సాంకేతికతలను వాడారు.

**మిగతా దేశాలు కూడా**

ఇలాంటి సూక్ష్మ డ్రోన్ల తయారీలో చైనా ఒక్కటే లేదు. ప్రపంచవ్యాప్తంగా మరికొన్ని దేశాలు కూడా ఇలాంటి ప్రయోగాలు చేస్తున్నాయి. చైనా దీన్ని మిలిటరీ కోసం తయారు చేసినప్పటికీ, ఇలాంటి మైక్రో-రోబోల వల్ల భవిష్యత్తులో మానవాళికి ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. చివరగా ఈ దోమ సైజు డ్రోన్ల రాకతో భవిష్యత్తులో గూఢచర్యం, యుద్ధాల తీరు పూర్తిగా మారిపోబోతోంది. అయితే, ఇవి ఎవరి వ్యక్తిగత ప్రైవసీని దెబ్బతీయకుండా, ఎలాంటి నైతిక సమస్యలు తీసుకురాకుండా వాడడమే ఇప్పుడు ప్రపంచం ముందున్న అతిపెద్ద సవాల్.

# E20 పెట్రోల్ వాడితే ఇన్సూరెన్స్ క్లెయిమ్స్ రిజెక్ట్ అవుతాయా? ICICI ఏమంటోందంటే..

దేశంలో కాలుష్యాన్ని తగ్గించడానికి, క్రూడ్ దిగుమతులను అదుపు చేయడానికి ప్రభుత్వం ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ అందుబాటులోకి తెస్తోంది. అయితే ఈ మార్పు వాహనదారుల్లో ఒక పెద్ద గందరగోళానికి కారణమైంది. ముఖ్యంగా పాత వాహనాల్లో జు20 ఇంధనాన్ని వాడితే.. భవిష్యత్తులో వచ్చే ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను కంపెనీలు తిరస్కరిస్తాయనే వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనికి కారణం ఇన్సూరెన్స్ సంస్థ ఐసీఐసీఐ లోంబార్డ్ గతంలో పెట్టిన ఒక బ్లాగ్ పోస్టే. వాహనానికి సరిపడని పెట్రోల్ వేరియంట్స్ వాడటం అనేది నిర్లక్ష్యం కిందికే వస్తుంది, కాబట్టి క్లెయిమ్‌లను తిరస్కరించే అవకాశం ఉందని ఆ బ్లాగ్‌లో ఐసీఐసీఐ పేర్కొనడంతో నెటిజన్లు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. దీంతో జు20 పెట్రోల్ వల్ల వాహనదారులకు కొత్త తలనొప్పులు మొదలయ్యాయంటూ సోషల్ మీడియాలో ప్రచారం మట్నదలైంది.

ఈ వివాదంపై నెటిజన్ల నుంచి వ్యతిరేకత రావడంతో.. ఐసీఐసీఐ లోంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ తక్షణమే స్పందించి ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. వాహనదారుల భయాలను పటాపంచలు చేస్తూ సంస్థ కీలక విషయాలను వెల్లడించింది.. లి పాలసీలు పూర్తిగా వర్తిస్తాయి: జు20 ఇంధనాన్ని ఉపయోగించినంత మాత్రాన మోటార్ ఇన్సూరెన్స్ పాలసీలు రద్దు కావు. అవి ఎప్పటిలాగే పూర్తిగా చెల్లుబాటు అవుతాయి.

**నిర్లక్ష్యంగా భావించము:** పాత వాహనాల్లో జు20




ఇంధనాన్ని ఉపయోగించడాన్ని తాము నిర్లక్ష్యంగా పరిగణించబోమని కంపెనీ స్పష్టం చేసింది. పైగా ఇథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్‌ను పర్యావరణహితమైన ప్రగతిశీల అడుగుగా స్వాగతిస్తున్నట్లు తెలిపింది.

**ఇంధనం ఆధారంగా రిజెక్షన్స్ ఉండవు:** పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ లాగే జు20 కూడా ఒక ఇంధనమే. క్లెయిమ్ అడ్మిసిబిలిటీని నిర్ణయించడంలో ఇంధనం రకం ఎన్నడూ ప్రామాణికం కాదని తేల్చి చెప్పింది. సాంప్రదాయ ఇంధనంతో క్లెయిమ్ ఎలా వస్తుందో.. జు20 ఇంధనంతోనూ అలాగే లభిస్తుంది.

**క్లెయిమ్‌లను ఎలా అంచనా వేస్తారు?**

ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లు అనేవి వాహనంలో వాడే ఇంధనం మీద కాకుండా, జరిగిన ప్రమాదం లేదా సంఘటన ఆధారంగా మాత్రమే అంచనా వేయబడతాయని ఐసీఐసీఐ లోంబార్డ్ స్పష్టం చేసింది. పాలసీదారులు ఎంచుకున్న కవరేజ్ పరిధిలోకి వచ్చే ప్రమాదాలు జరిగినప్పుడు ఖచ్చితంగా క్లెయిమ్ లభిస్తుంది.

1. వాహన ప్రమాదాలు
2. దొంగతనాలు
3. థర్డ్-పార్టీ లయబిలిటీస్
4. యజమాని-డ్రైవర్ లేదా ప్రయాణికులకు జరిగే వ్యక్తిగత ప్రమాదాలు

**వాహనదారులకు ఎందుకు ఊరట?**

ప్రభుత్వం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని ఎంత ప్రోత్సహిస్తున్నా.. వాహనదారులు తమ పాత బండ్ల ఇన్సూరెన్స్ విషయంలో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఐసీఐసీఐ లోంబార్డ్ ఇచ్చిన ఈ అధికారిక స్పష్టతతో వాహనదారులకు పెద్ద ఊరట వచ్చింది. కేవలం ఇంధనం మార్పును సాకుగా చూపి ఏ ఇన్సూరెన్స్ కంపెనీ కూడా క్లెయిమ్‌లను తిరస్కరించలేదని ఈ ప్రకటన ద్వారా స్పష్టమైంది. సో జు20 ఇంధనం వాడుతున్న వారు ఎలాంటి భయాలు అక్కర్లేదు ఇన్సూరెన్స్ కవరేజీ, క్లెయిమ్స్ విషయంలో.

## స్పేస్‌ఎక్స్ IPO ధమకా: రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మారిన వేల మంది ఉద్యోగులు




ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ కార్పొరేట్ చరిత్రలో కనీవిని ఎరుగని భారీ సంపద సృష్టికి తెరలేపింది. అందరూ మస్క్ ఆస్తుల గురించే మాట్లాడుకుంటున్నారు కానీ.. అసలు సిసలైన మ్యాజిక్ ఆ కంపెనీ ఉద్యోగుల జీవితాల్లో జరిగింది. సాధారణ స్టార్టప్‌గా మొదలై మల్టీ-ట్రిలియన్ డాలర్ల దిగ్గజంగా ఎదిగే వరకు కంపెనీని నమ్ముకున్న ఇంజనీర్లు, టెక్నీషియన్లు, కాంట్రాక్టర్లు ఈ ఐపీఓ పుణ్యమా అని రాత్రికి రాత్రే కోటీశ్వరులుగా మారిపోయారు. నాస్‌డాక్ స్టాక్ మార్కెట్లో స్పేస్‌ఎక్స్ షేరు ధర రూ.12వేల 825 వద్ద లిస్ట్ అయింది. దీనితో కంపెనీ ప్రారంభ విలువ సుమారు రూ.168 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ ఏకంగా రూ.7.12 లక్షల కోట్ల (వి75 బిలియన్) నిధులను సేకరించింది. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఈ స్పేస్ దిగ్గజం మార్కెట్ క్యాప్ రూ.190 లక్షల కోట్ల మార్కును దాటేసి ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీల్లో ఒకటిగా నిలిచింది. స్పేస్‌ఎక్స్‌లో పనిచేస్తున్న, పని చేసి మానేసిన సుమారు 4వేల 400 మందికి పైగా ఉద్యోగుల చేతిలో ఒక్కొక్కరికి ఇప్పుడు కనీసం రూ.9.5 కోట్లు విలువైన స్టాక్స్ ఉన్నాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. దాదాపు 400 మంది ఉద్యోగుల వాటా విలువ ఒక్కొక్కరికి రూ.950 కోట్లు పైనే ఉంటుంది. ఒకే ఒక్క ఐపీఓ ఇంత పెద్ద సంఖ్యలో సాధారణ ఉద్యోగులను అపర కుబేరులను చేయడం సోషల్ మీడియాలో క్రేజీ టాపిక్‌గా మారింది.

ఇందుకు ఉదాహరణే ట్రెవర్ హైస్ అనే ఉద్యోగి. ఈయన 2011లో జనరల్ ఎలక్ట్రిక్ ఆఫర్‌ను వదులుకుని మరీ స్పేస్‌ఎక్స్‌లో చేరాడు. 12 ఏళ్ల సర్వీసులో ఆయన సంపాదించిన లక్ష షేర్ల విలువ ఇప్పుడు రూ.128 కోట్లకు చేరింది. అలాగే 2015లో కేవలం గంటకు రూ.2,660 చొప్పున జీతానికి చేరిన జువాన్ హెర్నాండెజ్ అనే కాంట్రాక్ట్ వెల్డర్ స్టాక్ హోల్డింగ్స్ విలువ ఇప్పుడు ఏకంగా రూ.8.5 కోట్లకు చేరింది. మాజీ లాంచ్ ఇంజనీర్ గావిన్ పెటిట్ కూడా వేలాది షేర్లతో భారీ లాభాలను అందుకున్నాడు.

సాధారణ కంపెనీలలా కాకుండా.. స్పేస్‌ఎక్స్ మొదటి నుండి తన ఉద్యోగులకు జీతాలతో పాటు స్టాక్ ఆప్షన్స్ భారీగా ఇచ్చింది. కంపెనీ విలువ చాలా తక్కువగా ఉన్నప్పుడు ఇంజనీరింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, ఆపరేషన్స్ విభాగాల్లోని సిబ్బందికి షేర్లను కేటాయించారు. ఇప్పుడు కంపెనీ విలువ రాకెట్ వేగంతో దూసుకుపోవడంతో.. ఆ షేర్ల విలువ ఊహించని స్థాయికి పెరిగి వేలాది కుటుంబాల తలరాతలను మార్చేసింది.

## భారత వెండి మార్కెట్‌లో బిగ్ ట్విస్ట్: 87% పడిపోయిన దిగుమతులు




గ్లోబల్ సిల్వర్ మార్కెట్‌లో ఇప్పుడు ఒకటే టాక్.. 'ఇండియా దిగుమతులు తగ్గించేసింది' అని. అవును ప్రపంచంలోనే అత్యధికంగా వెండిని వినియోగించే భారతదేశం ఒక్కసారిగా తన దిగుమతులకు బ్రేకులు వేసింది. మే నెలలో భారత వెండి దిగుమతులు ఏకంగా 87% పడిపోయి.. 3 ఏళ్ల కనిష్ట స్థాయికి చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న దూకుడు నిర్ణయాలు, కఠినమైన ఆంక్షల వల్లే వెండి మార్కెట్‌లో సైలెంట్ షాక్ నమోదైంది.

గతేడాది మే నెలలో రూ.5వేల 380 కోట్లుగా ఉన్న వెండి దిగుమతులు, ఈ ఏడాది మే నాటికి కేవలం రూ.719 కోట్లకు పరిమితమయ్యాయి. పరిమాణం పరంగా చూస్తే.. ఇది 94% భారీ పతనంతో కేవలం 33 మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ఫిబ్రవరి 2023 తర్వాత ఈ స్థాయిలో దిగుమతులు పడిపోవడం ఇదే మొదటిసారి అని భారత వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ లెక్కలు బయటపెట్టాయి.దిగుమతుల భారీ పతనానికి ప్రధాన కారణం కేంద్ర ప్రభుత్వం విధించిన ఉక్కుపాదమే.

మే మధ్యలో దాదాపు అన్ని రకాల వెండి దిగుమతులపై ఆంక్షలు విధించిన ప్రభుత్వం.. ఇటీవల సిల్వర్ గ్రెయిన్, పౌడర్‌లను కూడా నియంత్రిత జాబితాలోకి చేర్చింది. వీటికి ముందస్తు అనుమతులు తప్పనిసరి చేసింది. దీనికి తోడు విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడానికి వెండి, బంగారంపై దిగుమతి సుంకాలను 6% నుండి ఏకంగా 15%కి పెంచేసింది.భారతదేశం తన వెండి అవసరాల్లో 80%

కంటే ఎక్కువ యూఏఈ, బ్రిటన్, చైనాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో దేశం రికార్డు స్థాయిలో 12 బిలియన్ డాలర్లను జస్ట్ వెండి దిగుమతి కోసం ఖర్చు చేసింది. ప్రస్తుత ఆంక్షల వల్ల దిగుమతులు తగ్గడం భారత వాణిజ్య లోటును తగ్గించడానికి, రూపాయి విలువపై ఒత్తిడిని అదుపు చేయడానికి ఎంతగానో సహాయపడుతుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.దేశీయంగా ఆభరణాలు, కాయిన్స్, సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వెండికి విపరీతమైన డిమాండ్ ఉంది. ముఖ్యంగా ఈ మధ్యకాలంలో 'సిల్వర్ ఈటీఎఫ్'లలో పెట్టుబడులు రికార్డు స్థాయికి చేరాయి. అయితే ప్రభుత్వం విధించిన ఆంక్షల వల్ల మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పటికీ సప్లై కష్టంగా మారిందని, దీనివల్ల స్థానికంగా వెండిపై ప్రీమియం ధరలు పెరగడం మొదలైందని ముంబైకి చెందిన బులియన్ డీలర్లు చెబుతున్నారు.

# పిక్కకు పోషణ




అర్ధరాత్రి మంచి గాఢనిద్రలో ఉండగా పిక్క కండరాలు పట్టేయటం, తీవ్రమైన నొప్పితో నిద్రలోంచి లేవటం చాలామందికి అనుభవమే. ఇది వృద్ధుల్లో మరింత ఎక్కువ. పిక్కలు పట్టేయటానికి ప్రధాన కారణం కదలికలకు తోడ్పడే చలన నాడులు వేగంగా, మాటిమాటికీ ఉత్తేజితం కావటం. వయసు మీద పడుతున్నకొద్దీ ఈ నాడులు క్షీణిస్తూ వస్తాయి కాబట్టి వృద్ధాప్యంలో మరింత ఎక్కువగా పిక్కలు పట్టేస్తుంటాయి. అరవై ఏళ్లు పైబడ్డవారిలో సుమారు మూడింట ఒకరు, 80 ఏళ్లు దాటినవారిలో దాదాపు సగం మంది పిక్క కండరాలు పట్టేయటంతో సతమతమవుతుంటారు. కండరాలు బలంగా ఉండటానికి, పిక్కలు పట్టేయకుండా చూసుకోవటానికి వ్యాయామం కీలకమే అయినా పోషకాహారమూ ముఖ్యమే. కండరాల పనితీరును కాపాడే అలాంటి కొన్ని పోషకాలు ఇవిగో..

మెగ్నీషియం: ఇది కండరాలు వదులుగా ఉండేలా చేస్తుంది. మెగ్నీషియం మోతాదులు తగ్గితే తరచూ కండరాలు పట్టేస్తుంటాయి, బిగుసుకుపోతుంటాయి. వృద్ధుల్లో ఇది మరింత ఎక్కువ.

విటమిన్ డి: ఇది కండరాలు బలోపేతం కావటానికి, సమన్వయంతో పని చేయటానికి తోడ్పడుతుంది. క్యాల్షియాన్ని శరీరం గ్రహించుకునేలా చేయటంలో సాయం చేస్తుంది. దీంతో కండరం సరిగా సంకోచించేలా చేస్తుంది. విటమిన్ డి తగ్గితే కండర బలహీనత, కింద పడిపోయే ముప్పు పెరుగుతున్నట్టు అధ్యయనాలు చెబుతున్నాయి.

విటమిన్ ఇ: యాంటీఆక్సిడెంట్‌గా పనిచేసే ఇది రక్త ప్రసరణను పెంచుతుంది. వాపు ప్రక్రియను తగ్గిస్తుంది. ఇలా కండరాలు కోలుకోవటానికి తోడ్పడుతుంది. నిస్సత్తువను నివారిస్తుంది. కాడ్ లివర్ నూనె: ఇందులో సహజంగానే విటమిన్ డి,

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలుంటాయి. ఇవి వాపు ప్రక్రియ తగ్గటానికి, కండరాలు కోలుకోవటానికి సహకరిస్తాయి. అందువల్ల కండరాలు బలంగా ఉండేలా చూసుకోవటానికి కాడ్ లివర్ నూనె మంచి పోషకమని చెప్పుకోవచ్చు. పిక్కలు పట్టేయటాన్ని తగ్గించుకోవటానికి, కదలికలు సాఫీగా సాగటానికి వృద్ధులకు బాగా తోడ్పడుతుంది. కదలికలకు, ఇతరుల మీద ఆధారపడకుండా ఉండటానికి, మొత్తంగా ఆరోగ్య సంరక్షణకు కండరాలే కీలకం. మెగ్నీషియం, విటమిన్ డి, విటమిన్ ఇ వంటి పోషకాలను తగినంతగా తీసుకోవటం.. అలాగే చురుకుగా ఉండటం ద్వారా కండరాలను బలంగా ఉంచుకోవచ్చు. ఆహారం, అవసరమైతే మాత్రలు లేదా తేలికైన జీవనశైలి మార్పులతో కండరాలను కాపాడుకోవటం మీద శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా వయసు మీద పడుతున్నకొద్దీ హాయిగా జీవించటానికి ఇది అత్యవసరమని గుర్తించాలి.




# ఒక్క తిత్తుల జబ్బే కాదు మొత్తం శరీర సమస్య

పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ (పీసీఓఎస్). తేలికగా అర్థమయ్యేలా చెప్పాలంటే- అండాశయ నీటి తిత్తుల సమస్య. ఈ పేరు వినగానే ఎవరికైనా ఇదేదో ఆడవారిలో అండాశయాల్లో తలెత్తే తిత్తులతో ముడిపడిన జబ్బనే అనిపిస్తుంది. కానీ ఇది ఒక్క అండాశయాలకే పరిమితం కాకపోతే? శరీరం మొత్తాన్ని ప్రభావితం చేసేదైతే? ఆ మాటకొస్తే తిత్తులతో సంబంధమే లేకపోతే? అందుకే అంతర్జాతీయ వైద్య పరిశోధకులు, నిపుణులు సుదీర్ఘంగా ఆలోచించారు. పీసీఓఎస్ పేరును పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఒవేరియన్ సిండ్రోమ్(పీఎంఓస్)గా మార్చారు. ఒక్క తిత్తులతోనే కాకుండా పలు హార్మోన్లు, జీవక్రియలతో ముడిపడిన అండాశయ సమస్యగా చూడాలనేది దీని ఉద్దేశం.

ఆడవారిలో పీసీఓఎస్ అనగానే ముందుగా గుర్తుకొచ్చేది అండాశయాల్లో నీటి తిత్తులే. వీటి మూలంగా అండాశయాలు చెడిపోయాయనో, నెలసరి రాదనో, పిల్లలు పుట్టరనో, లావుగా అయిపోతామనో భావిస్తుంటారు. చాలామంది మనసుల్లో ఇలాంటి ఆలోచనలు, భయాలే ముసురుకుంటుంటాయి. నిజానికి పీసీఓస్ ఒక్క రుతుక్రమానికి, సంతాన సమస్యలకు మాత్రమే సంబంధించింది కాదు. మొత్తం శరీర జీవక్రియలతో ముడిపడిన సమస్య. అందువల్ల దీని పేరును పాలీఎండోక్రైన్ మెటబాలిక్ ఒవేరియన్ సిండ్రోమ్‌గా మార్చటం సమంజసమే. దీంతో జబ్బు పట్ల మన అవగాహన మారుతుందనటంలో సందేహం లేదు. పీఎంఓస్‌లో హార్మోన్ల సమతుల్యత దెబ్బతినటం, జీవక్రియలు అస్తవ్యస్తం కావటం వల్ల మధుమేహం వంటి దీర్ఘకాల జబ్బుల ముప్పు పెరిగేలా చేస్తుంది కూడా. కొందరికి అండాశయ, గర్భసంచి క్యాన్సర్లు తలెత్తే ప్రమాదమూ ఉంది. అందువల్ల దీని విషయంలో నిరంతర పర్యవేక్షణ, జాగ్రత్త అవసరం.

**ఎక్కడివీ తిత్తులు?**

తిత్తులు ఏర్పడటంలో మెదడు, అండాశయాల్లో పుట్టుకొచ్చే హార్మోన్ల మధ్య సంబంధం కీలకపాత్ర పోషిస్తుంది. ముందుగా మెదడులోని హైపోథలమస్ నుంచి విడుదలయ్యే గొనడోట్రోఫిన్ రిలీజింగ్ హార్మోన్ పీయూషగ్రంథిని ప్రేరేపిస్తుంది. అప్పుడు ఫాలికల్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ పుట్టుకొచ్చి, అండాశయాలను ఉత్తేజితం చేస్తుంది. దీంతో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లు తయారవుతాయి. ఈస్ట్రోజన్ ఒక స్థాయికి చేరుకోగానే పీయూషగ్రంథి ల్యూటినైజింగ్ హార్మోన్‌ను ఉత్పత్తి చేసి, అండం విడుదలను ప్రేరేపిస్తుంది. దీన్నే హైపోథలమస్-పిట్యుటరీ-ఓవరీ యాక్సిస్ అంటారు. ఇవన్నీ ఒకదానిపై మరోటి ప్రభావం చూపుతాయి. ఈస్ట్రోజన్ మరీ ఎక్కువగా ఉత్పత్తి అయితే హార్మోన్ల సమాచార వ్యవస్థ కుంటుపడుతుంది. ల్యూటినైజింగ్ హార్మోన్ పెరగటం వల్ల టెస్టోస్టిరాన్ వంటి మగ హార్మోన్ల మోతాదులూ ఎక్కువవుతాయి. ఇవి అండాశయాల్లో అండాలు పరిపక్వమవటాన్ని, విడుదల కావటాన్ని అడ్డుకుంటాయి. ఇలా పరిపక్వం కాని అండాలే బుడిపెలు బుడిపెలుగా.. నీటి తిత్తుల్లా కనిపిస్తాయి.

**నాలుగు రకాలుగా..**

పీఎంఓఎస్‌లో చూడాల్సింది ఒక్క తిత్తులనే కాదు. ఇవి అందరిలో ఉండాలనీ లేదు. మగ హార్మోన్లు పెరగటం (హైపర్ఆండ్రోజెనీమియా), రుతుక్రమం అస్తవ్యస్తం కావటం (ఓలిగోమెనోరియా), అండం విడుదల కాకపోవటం (అనావ్యులేషన్) వంటి సమస్యలూ కనిపిస్తుంటాయి. వీటి తీరును బట్టి పీఎంఓస్‌ను నాలుగు రకాలుగా విభజించొచ్చు.

ఎ రకం: దీన్ని పూర్తిస్థాయి సమస్య అనొచ్చు. ఇందులో మగ హార్మోన్లు ఎక్కువగా ఉండటం, నెలసరి సరిగా అవకపోవటం, అండాశయాల మీద తిత్తులు అన్నీ ఉంటాయి. అంతేకాదు.. రక్తపోటు, బరువు, రక్తంలో ట్రైగ్లిజరైడ్లు కూడా పెరుగుతాయి.

బి రకం: ఇందులో తిత్తులు స్పష్టంగా ఉండవు. కానీ మగ హార్మోన్లు పెరగటం, అండం విడుదల కాకపోవటం కనిపిస్తాయి.

సి రకం: ఇందులో అండం సరిగానే విడుదలవుతుంది గానీ మగ హార్మోన్లు పెరుగుతాయి. తిత్తులు స్పష్టంగా ఉంటాయి. చాలావరకూ ఇది సంతాన పరీక్షల సమయంలో బయట పడుతుంటుంది.

డి రకం: ఇందులో మగ హార్మోన్లు పెరగటంతో ముడిపడిన లక్షణాలేవీ ఉండవు. అయితే నెలసరి సరిగా రాదు. తిత్తులు తలెత్తుతాయి.

రకాన్ని బట్టి లక్షణాలు

కొందరికి రెండు మూడు నెలలైనా నెలసరి రాదు. ఒకవేళ వస్తే రుతుస్రావం ఆగదు. లేదా కొంచెం కొంచెం కనిపించొచ్చు.

బరువు పెరగటం, ఊబకాయం

మొటిమలు

గడ్డం, మీసాలు, కాళ్లూ, చేతుల వంటి భాగాల్లో వెంట్రుకలు మొలవటం.

జుట్టు ఊడిపోవటం

గర్భధారణలో ఇబ్బంది

మెడ చుట్టుపక్కల, చంకలు, గజ్జల్లో చర్మం నల్లబడటం

నిస్సత్తువ

మూడ్ మారటం

**నిర్ధారణ ఎలా?**

చాలావరకూ లక్షణాలను బట్టే తిత్తుల సమస్యను అంచనా వేస్తారు. కొన్ని రక్త పరీక్షలూ అవసరమవుతాయి. వీటితో హార్మోన్లు, గ్లూకోజు మోతాదులు తెలుస్తాయి. థైరాయిడ్ జబ్బు, ప్రొలాక్టిన్ హార్మోన్ పెరగటం, అండాశయాల్లో మగ హార్మోన్లను ఉత్పత్తి చేసే కణితులు వంటివేవైనా ఉన్నాయేమో కూడా చూడాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇవీ తిత్తులకు దారితీయొచ్చు. అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తే సమస్య స్పష్టంగా బయటపడుతుంది. నీటి తిత్తులు 2-9 మి.మీ. సైజులో 20 కన్నా ఎక్కువగా ఉంటేనే పీఎంఓస్‌గా నిర్ధారిస్తారు.

అయితే రజస్వల అయ్యాక 18 ఏళ్లు వచ్చేంతవరకూ నిర్ధారించటం తగదు. రుతుక్రమం కుదురుకోవటానికి కొంత కాలం పడుతుంది. పైగా రుతుక్రమం ఆరంభమయ్యే సమయంలో ఎదుగుదల వేగంగా సాగటానికి ఇన్సులిన్ నిరోధకత తప్పనిసరి. వీరికి అండం సరిగా విడుదల కాదు. అందువల్ల తిత్తులున్నా 14, 15 ఏళ్ల పిల్లలకు సమస్య ఉందని చెప్పకూడదు. దీన్ని మల్టీ సిస్టిక్ ఓవరీస్‌గానే భావించాలి. ఇది జబ్బు కాదు.

**ప్రధాన సమస్య ఇన్సులిన్ నిరోధకత**

పీఎంఓఎస్‌తో తలెత్తే ఇబ్బందుల్లో చాలావాటికి కారణం ఇన్సులిన్ నిరోధకతే. అంటే కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించకపోవటం అన్నమాట. దీంతో కణాల్లోకి గ్లూకోజు అంతగా వెళ్లదు. ఫలితంగా రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతూ వస్తాయి. ఇది టైప్2 మధుమేహానికి దారితీస్తుంది. అలాగని పీఎంఓఎస్ ఉన్నంత మాత్రాన అందరికీ మధుమేహం రాదు. కాకపోతే ముప్పు పెరుగుతుంది. మనదేశంలో రోజురోజుకీ మధుమేహం బారినపడుతున్నవారి సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో దీన్ని గుర్తుంచుకోవటం ముఖ్యం.

కణాలు ఇన్సులిన్‌కు సరిగా స్పందించనప్పుడు దీన్ని భర్తీ చేయటానికి శరీరం మరింత ఇన్సులిన్‌ను విడుదల చేస్తుంది. ఇది అండాశయ హార్మోన్ల ఉత్పత్తి మీద ప్రభావం చూపుతుంది. ఇన్సులిన్ మోతాదులు ఎక్కువగా ఉండటం వల్ల మగ హార్మోన్ల ఉత్పత్తి కూడా ప్రేరేపితమవుతుంది. దీంతో మొటిమలు రావటం, అవాంఛిత రోమాలు పెరగటం, జుట్టు ఊడటం, అధిక బరువు, అండం విడుదల కాకపోవటం వంటి ఇబ్బందులు మొదలవుతాయి. నెలసరి సరిగా రాకపోతే లావైపోతారని మనదగ్గర అపోహ పడుతుంటారు. నిజానికి లావైతేనే నెలసరి సరిగా రాదని తెలుసుకోవాలి.

ఇన్సులిన్ నిరోధకత, బరువు పెరగటం రెండూ ఒకదాన్ని మరోటి ప్రోత్సహించుకుంటాయి. ఒకవైపు ఇన్సులిన్ నిరోధకత బరువు పెరగటానికి దారితీస్తే, బరువు పెరగటం ఇన్సులిన్ నిరోధకతకు దారితీస్తుంది. అలాగని సన్నగా ఉన్నామనే ధీమా కూడా పనికిరాదు. సన్నగా ఉన్నవారిలోనూ ఇన్సులిన్ నిరోధకత తలెత్తొచ్చు. దీనికి కారణం సన్నగా ఉన్నా పొట్టలో, అవయవాల చుట్టూరా కొవ్వు (విసరల్ ఫ్యాట్) ఎక్కువగా ఉండటం. ఇది కరిగి, కొవ్వు ఆమ్లాలుగా మారి ఇన్సులిన్ పనితీరును అడ్డుకుంటుంది.

**చికిత్స- జీవనశైలి ముఖ్యం**

పీఎంఓస్‌కు రకరకాల జన్యువులు కారణమవుతుంటాయి. ఇది తల్లి కడుపులో ఉండగానే నిర్దేశితమై ఉంటుంది. అయితే జన్యు స్వభావం ఉన్నప్పటికీ అతిగా తినటం, శారీరక శ్రమ చేయకపోవటం వంటివి జన్యువులను ప్రేరేపించి సమస్యకు దారితీస్తుంటాయి. అందువల్ల జీవనశైలి మార్చుకోవటం చాలా ముఖ్యం. పొట్టలో కొవ్వు, బరువు తగ్గితే దాదాపు అన్ని సమస్యలూ తగ్గుతాయి. ఆహార నియమాలతో 75%, వ్యాయామంతో 25% బరువు తగ్గుతుంది. కాబట్టి క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సమతులాహారం తినాలి. ఇప్పుడు బరువు తగ్గించే మందులూ ఉన్నాయి. వీటితో ముమ్మందు కొన్ని సమస్యలు తలెత్తొచ్చు. అందువల్ల జీవనశైలి మార్పులతోనే బరువు తగ్గించుకునే ప్రయత్నం చేయాలి.

హార్మోన్ మాత్రలు: కాస్త చిన్నవయసు వారికైతే నెలసరి సక్రమంగా రావటానికి హార్మోన్ మాత్రలు ఉపయోగపడతాయి.

మెట్‌ఫార్ఫిన్: మధుమేహంలో వాడే మెట్‌ఫార్మిన్ మందు బాగా పనిచేస్తుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతను తగ్గిస్తుంది. గర్భధారణ అవకాశాలు పెరుగుతాయి.

ఇనొసిటాల్స్: ఇవీ ఒకరకం చక్కెరలే. వీటిల్లో మయో-ఇనొసిటాల్, డి-కిరో-ఇనొసిటాల్ వంటి రకాలున్నాయి. చిక్కుళ్లు, ధాన్యాలు, బాదం వంటి వాటిల్లో ఉంటాయి. ఇవి ఇన్సులిన్ నిరోధకత తగ్గటానికి, నెలసరి సరిగా రావటానికి, అండాశయాలు సరిగా పనిచేయటానికి తోడ్పడతాయి. వీటితో బరువూ తగ్గుతుంది. అవసరమైతే వీటిని మందుల రూపంలో తీసుకోవాలి. థైరాయిడ్ సమస్య గలవారిలోనూ అండం విడుదల కాదు. పరిపక్వం కాని అండాలు బుడిపెలుగానూ కనిపిస్తాయి. థైరాయిడ్‌కు చికిత్స తీసుకుంటే ఇవీ తగ్గుతాయి. : కొందరికి మగ హార్మోన్ల ప్రభావాన్ని నిలువరించే మందులు అవసరమవుతాయి. ఇవి కొత్త రోమాలు మొలవకుండా నిలువరిస్తాయి. కాకపోతే అంతకుముందున్నవి అలాగే ఉంటాయి.

## ఆధ్యాత్మికం : బుద్ధి అంటే ఏంటీ.. బుద్ధి లేకపోతే వచ్చే నష్టాలు ఏంటీ..

# యోగస్థితి లేకపోతే బుద్ధి ఉండదా..?

కర్మాచరణం.. బుద్ధి యోగంతో చెయ్యమని కదా చెప్పింది. ఆ బుద్ధి అన్ని సమయాల్లో సరిగ్గా పని చేయకపోవటానికి కారణం ఏమిటి? ఇష్టపడి కానీ, అయిష్టంతో కాని ఇంద్రియాలతో వ్యవహరించినట్టయితే మానవుడు ఇంద్రియాలలోనే నివసించటం జరుగుతుంది. ఏదైనా కావాలనే అభిలాషతోనైనా నిరంతరం తలుచుకుంటూ ఉండవచ్చు. కోరికని జయించాలనే భావంతో దానినే అనుక్షణం తలచుకుంటూ ఉండవచ్చు.రెండు సందర్భాలలోనూ ఇంద్రియాలకి లక్ష్యాలైన వాటిని తలచుకుంటూ ఉండటం వల్ల వాటితో సంబంధం ఏర్పడుతుంది. సంబంధం వల్ల కోరిక కలుగుతుంది. తెలియని వస్తువు కావాలనిపించదు కదా. ముందుగా ఇష్టం లేని వస్తువు మీద కోరిక కలుగుతుంది. దీనినే వైరభక్తి అనవచ్చునేమో. దీనికి ఉదాహరణగా ప్రస్తుత కాలంలో చాలామందికి ఉన్న చాలా అలవాట్లని (మద్యం, పొగాకు, గంజాయి మొదలైనవి) చెప్పవచ్చు. ఇవి కావాలని ఎవరూ. అనుకోరు. మొదటిమారు రుచి చూసినప్పుడు నచ్చకపోయినా, వాటి సాన్నిహిత్యం వాటికి అలవాటు పడేట్టు చేస్తుంది. అంటే ఇష్టం వల్ల మాత్రమే కాదు, తీవ్రమైన అయిష్టం వల్ల కూడా సంగం కలుగుతుంది. సంగం వల్ల కోరిక కలుగుతుంది. కోరిక క్రోధానికి దారి తీస్తుంది. ఎట్లాగంటే. అనుకున్న కోరిక తీరకపోయినా, తీరటానికి అవరోధాలు కలిగినా వచ్చేది కోపమే కదా. ఆ కోపం నిలబడిపోతే అది క్రోధం అవుతుంది. కామము.. క్రోధము జంటగా ఉంటాయి. క్రోధం ఉన్నప్పుడు. తెలివికి పొర కమ్ముతుంది. దీనివల్ల అంతకుముందు. తెలిసిన విషయాలు కూడా గుర్తు రావు. మామూలుగా కూడా కోపంలో ఒకదానికి బదులు మరొకటి చేయటం, అసలు విషయం గుర్తురావటం లేదని బాధపడుతూ ఉండటం గమనించవచ్చు. తెలిసిన మంచి విషయాలే మరపుకి రావటంతో బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశిస్తే సమస్తం నాశనమైనట్టే కదా..!

బుద్ధి నశించకుండా దానితో కలిసి ఉండటం (బుద్ధి యోగం) వల్ల రాగద్వేషాలు తొలగిపోతాయి. అంటే తీవ్రమైన ఇష్టం కానీ, అయిష్టం కాని ఉండవు. ఇంద్రియాలు ఇంద్రియార్థాలలో వర్తిస్తున్నా ఇంద్రియాలు తన ఆధీనంలోనే ఉంటాయి. సమర్థుడైన యజమాని ఆధీనంలో ఉన్న సేవకులలాగా ఇంద్రియాలు వర్తిస్తూ ఉంటాయి. యజమాని మంచి వాడైనప్పుడు సేవకులు బలవంతంగా కాక ప్రేమతో, ఇష్టంగా పనిచేస్తారు.. అప్పుడు సేవకులు తాము చేసే పనిని సంతోషంగా చేస్తారు. వారికి కూడా ఆనందం లభిస్తుంది - జీత భత్యాలతో పాటు. అదేవిధంగా ఇంద్రియాలు తన అధీనంలో ఉన్నప్పుడు కన్ను తనకి నచ్చిన రూపంలో.




వర్తిస్తున్నా, చెవి తనకి ఇష్టమైన శబ్దమునందు వర్తిస్తున్నా, నాలుక కోరిన రుచియందు వర్తిస్తున్నా, ముక్కు తనను ఆకర్షించిన వాసనను ఆస్వాదిస్తున్నా, శరీరం స్పర్శను ఆనందిస్తున్నా అవి తన ఆధీనంలో ఉంటాయి. వాటిని నిరోధించే ప్రయత్నం చేస్తే ఎదిరించటానికి సిద్ధం అవుతాయి. వాటిపై నిఘా ఉంచి వాటి పనిని వాటిని చేసుకోనిస్తే మంచిది. కాస్త అలుసు ఇస్తే మాత్రం నెత్తికెక్కి పెత్తనం చేస్తాయి. బానిసని చేసుకుంటాయి. అంటే అతిగా ఇష్టపడ్డా, కోప్పడ్డా సంగమే కదా. ఇంద్రియాలు తన ఆధీనంలో ఉంటే అభిముఖ్యం కాని, వైముఖ్యం కాని తన చేతిలోనే ఉంటాయి కాని ఇంద్రియాలకి ఉండని స్థితి వస్తుంది. అంటే ఇంద్రియాల మీది పెత్తనం మనసు చేతిలో నుండి బుద్ధి చేతికి అప్పచెప్పటం జరుగుతుంది. అప్పుడు మనిషి తన పట్ల విధేయత ఉన్న తనలోని భాగాలు ఉన్నవాడు అవుతాడు. దీని వల్ల జీవుడు ప్రసన్నంగా ఉంటాడు. కదలని నీటిలో ఆకాశం, సూర్యుడు, చంద్రబింబం, నక్షత్రాలు మొదలైన శాశ్వత తత్వాలు యథాతథంగా ప్రతిబింబించినట్టురాగద్వేషాదుల చేత, ఇతరుల గురించి, వస్తువుల గురించి, అభిప్రాయాల చేత కలుషితం కాని మనసులో ఎదుటివారి యందున్న దైవీతత్వం ప్రతిబింబిస్తుంది. అదే ప్రసన్నమైన మనసు. దీనివల్ల దుఃఖానికి కారణాలైనవి అన్నీ పోతాయి. దుఃఖం పోతే మిగిలేది బుద్ధి. అదే తానై ఉండటం.

యోగస్థితి లేక పోతే బుద్ధి ఉండదు. బుద్ధి మనసుగా, ఇంద్రియాలుగా చెల్లా చెదురైపోతూ ఉంటుంది. చెదిరిన స్థితిలో, దానిలో ప్రతిబింబించే భగవత్తత్త్వం కూడా సమగ్రంగా ఉండదు. అలలున్న కోనేటిలో సూర్యుడి ప్రతిబింబంలాగా ముక్కలు ముక్కలుగా కనపడుతుంది. భగవన్మయమైన ప్రకృతి లేక వాతావరణం కల్లోలంగా ఉన్న మనసు మీద ప్రతిబింబించితే భగవంతుడుగా కాక వస్తువులుగా, కోరికలుగా, బంధుత్వాలుగా, శతృత్వాలుగా, సుఖ దుఃఖాలుగా కనపడుతుంది. కనుక దైవభావన ఉండదు. ఇంక శాంతి ఎట్లా ఉంటుంది? శాంతి లేని వాడికి సౌఖ్యం ఉండదు కదా..

దీనికి మంచి పోలిక చెపుతాడు శ్రీకృష్ణుడు. బాగా అర్థమై వంటపట్టటానికి, ఉప్పెన వచ్చినప్పుడు గాలి వాలుకి వెడుతున్న కెరటాలు ఎటు తీసుకెళ్తే నావ అటు వెళ్ళినట్టు.. ఇంద్రియాలు అనే అలల చేత కదపబడుతున్న ప్రజ్ఞ కూడా అవి తీసుకువెళ్ళిన తీరానికే చేరుతుంది. కానీ గమ్యం అది కాదు కదా. అనుకున్న గమ్యం చేరటానిక్ ప్రజ్ఞని బుద్ధితో యోగం చెయ్యాలి. యోగం అంటే కలయిక అని కదా అర్థం. అంటే ప్రజ్ఞని బుద్ధితో చేర్చాలి. ఇదే గొప్ప నేర్పు. ఈ నేర్పు లేకపోతే లక్ష్యం చేరలేము. అందుకే 'బుద్ధి నాశాత్ ప్రణశ్యతి' అని నశించకుండా ఉండే మార్గం తెలియజేశాడు జగద్గురువు శ్రీకృష్ణుడు..

# ఫిఫా వరల్డ్ కప్‌లో కోహ్లీ హవా.. విరాట్ వరల్డ్ కప్ గెలుస్తాడా?

# అంటూ ఫ్యాన్ టార్చర్.. ఐషోస్పీడ్ ఏం చేశాడంటే!






**హైదరాబాద్ పెన్ పవర్:** అమెరికాలో జరుగుతున్న ఫుట్‌బాల్ వరల్డ్ కప్ 2026లో కూడా కింగ్ విరాట్ కోహ్లీ రేంజ్ ఏంటో తెలిసే ఒక క్రేజీ అండ్ ఫన్నీ సీన్ చోటు చేసుకుంది. వరల్డ్ ఫేమస్ యూట్యూబ్ స్ట్రీమర్ ఐషోస్పీడ్ ఒక లైవ్ స్ట్రీమింగ్‌లో ఉండగా.. ఒక ఫ్యాన్ పదే పదే కోహ్లీ గురించి అడిగిన ఒకే ఒక ప్రశ్న స్పీడ్‌కు పిచ్చెక్కించింది. దాంతో విసిగిపోయిన స్పీడ్.. తనదైన స్టైల్ లో ఇచ్చిన రియాక్షన్ ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతుంది.

**కోహ్లీ కప్ గెలుస్తాడా బ్రో?:**

ఫిఫా వరల్డ్ కప్ జరుగుతున్న ఒక నగరంలో ఐషోస్పీడ్ రోడ్డుపై నడుస్తూ ఫ్యాన్స్ మధ్య లైవ్ స్ట్రీమింగ్ చేస్తున్నాడు. అక్కడ ఉన్న ఫుట్‌బాల్ వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తూ అందరితో ముచ్చట్లు పెడుతున్న టైమ్‌లో.. గుంపులో ఉన్న ఒక ఫ్యాన్ గట్టిగా అరుస్తూ, ఈజ్ విరాట్ కోహ్లీ విన్నింగ్ ద వరల్డ్ కప్? (విరాట్ కోహ్లీ వరల్డ్ కప్ గెలుస్తాడా?) అని పదే పదే అడగడం స్టార్ట్ చేశాడు. అయితే, మొదట స్పీడ్ ఆ ప్రశ్నను పెద్దగా పట్టించుకోకుండా లైట్ తీసుకున్నాడు. కానీ ఆ ఫ్యాన్ మాత్రం అస్సలు తగ్గలేదు.. స్పీడ్ లైవ్ స్ట్రీమింగ్‌కు అడ్డొచ్చేలా కంటిన్యూస్‌గా అదే క్వశ్చన్‌ను రిపీట్ చేశాడు.

**చిరాకుతో ఊగిపోయిన ఐషోస్పీడ్:**

ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్నతో లైవ్‌కు డిస్టర్బెన్స్ రావడంతో.. ఐషోస్పీడ్ తన ట్రేడ్‌మార్క్ యానిమేటెడ్ అగ్రెసివ్ స్టైల్‌లో గట్టిగా అరుస్తూ, విరాట్ కోహ్లీ ఈజ్ విన్నింగ్ ద వరల్డ్ కప్! (హా.. విరాట్ కోహ్లీనే వరల్డ్ కప్ గెలుస్తున్నాడు!) అంటూ కోపంగా ఆన్సర్ ఇచ్చాడు. ఆ సీన్ చూడగానే చుట్టూ ఉన్న వాళ్లంతా ఒక్కసారిగా నవ్వేశారు. ఈ క్లిప్ సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.

**ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌లో క్రికెట్ పంచాయితీ:**

ఈ వీడియో చూసిన నెటిజన్లు తెగ నవ్వుకుంటున్నారు. అక్కడ జరుగుతోంది ఫిఫా ఫుట్‌బాల్ వరల్డ్ కప్ కాబట్టి.. ఆ ఫ్యాన్ అడిగిన ప్రశ్న వచ్చే ఏడాది (2027) జరగబోయే ఐసీసీ క్రికెట్ వరల్డ్ కప్ గురించి అయి ఉంటుందని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు. ఇక క్రిస్టియానో రొనాల్డోకి పెద్ద ఫ్యాన్ అయిన ఐషోస్పీడ్‌కు.. గతంలో ఇండియా వచ్చినప్పుడు విరాట్ కోహ్లీ క్రేజ్ ఏంటో ఆల్రెడీ రుచి చూశాడు. ఇప్పుడు ఫుట్‌బాల్ వరల్డ్ కప్ వంటి ఒక గ్లోబల్ ఈవెంట్‌లో కూడా కోహ్లీ పేరు ఇలా మారుమోగిపోవడం చూసి కింగ్ ఫ్యాన్స్ విరాట్ కోహ్లీ రేంజ్ అన్ స్టాపబుల్ బ్రో అంటూ కాలర్ ఎగరేస్తున్నారు.

# మెస్సీ అంటే ప్రపంచానికి పిచ్చి.. అతడి ఆట కోసం వెయిటింగ్.. కోచ్ వ్యాఖ్యలు వైరల్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచ కప్ లో భాగంగా ఈరోజు ( జూన్ 17న తెల్లవారుజామున, బుధవారం) రాత్రికి అల్జీరియాతో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా తమ తొలి మ్యాచ్ ఆడబోతుంది. ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సికి ఇది 200వ ఇంటర్నేషనల్ మ్యాచ్ కావడం విశేషం.. ఈ ఫిఫా ప్రపంచ కప్ మెస్సికి చివరిదంటూ వార్త కథనాలు వస్తున్నాయి. దీంతో మెస్సిని మైదానంలో చూడాలని భారీగా ఫ్యాన్స్ వెయింటింగ్ చేస్తున్నారు. కొంతకాలంగా కండరాల గాయంతో ఇబ్బంది పడుతున్న లియోనల్.. పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు టాక్. ఇక అర్జెంటీనా ప్రధాన కోచ్ లియోనెల్ స్కలోని.. మెస్సిపై ప్రశంసలు గుప్పించాడు. ప్రపంచ మొత్తం అతడి కోసం వేచి చూస్తోందని వెల్లడించాడు.

**మెస్సి కోసం ప్రపంచం మొత్తం వెయిటింగ్:**

అర్జెంటీనా ఫ్యాన్స్ మాత్రమే కాదు.. ప్రపంచం మొత్తం లియోనల్ మెస్సిని గ్రౌండ్ లో చూడాలని ఈగర్ గా వెయిటింగ్ చేస్తుంది. అతడు కేవలం మా జట్టుకే కాదు ప్రపంచ ఫుట్‌బాల్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.. మెస్సి గురించి చెప్పడానికి ఏమీ లేదు.. అతడు ఎప్పుడూ జట్టుకు అండగా నిలిచాడు.. టీమ్ విజయాల్లో మెస్సి పాత్రే అత్యంత కీలకం అన్నాడు. మెస్సి ఫుట్‌బాల్ దేవుడు అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని స్కలోని చెప్పుకొచ్చాడు.

**మెస్సితో కలిసి ఆడటం గర్వంగా ఉంది:**

ఖతార్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచ కప్ 2022 టైటిల్‌ను అర్జెంటీనా దక్కించుకున్న విషయం తెలిసిందే. మరోసారి టైటిల్‌ను నిలబెట్టుకోవాలనే టార్గెట్ తో బరిలోకి మెస్సి సేన దిగబోతుంది. ఈ సందర్భంగా మెస్సి సహచరుడు నికోలస్ ఒటమెండీ మాట్లాడుతూ.. ఖతార్‌లో సాధించిన గెలుపు దేశాన్ని ఒక్కటి చేసిందన్నాడు. ఆ జ్ఞాపకాలు మాకు మరింత బలాన్ని ఇస్తున్నాయి.. అదే పట్టుదలతో మళ్లీ బరిలోకి దిగబోతున్నామని వెల్లడించారు. కానీ, మెస్సితో కలిసి ఆడటం నాకు చాలా గర్వంగా అనిపిస్తుంటుంది.. అతడు అసాధారణ వ్యక్తి.. స్టేడియంలో మెస్సి ఓ యోధుడు కనిపిస్తాడని పేర్కొన్నాడు.

# శ్రేయస్?ను పక్కన పెట్టి సూర్యను పెట్టారేంటి.. సోనీ స్పోర్ట్స్‌పై నెటిజన్స్ ఫైర్







**హైదరాబాద్ పెన్ పవర్:** భారత టీ20 జట్టు కెప్టెన్సీ లొల్లి ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. టీ20 వరల్డ్ కప్ గెలిచిన తర్వాత బీసీసీఐ ఊహించని విధంగా సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి.. అతని ప్లేస్‌లో శ్రేయస్ అయ్యర్‌ను కొత్త కెప్టెన్‌గా ప్రకటించింది. ఈ ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ల కోసం కొత్త టీమ్ ని ప్రకటించింది. అఫీషియల్ బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ చేసిన ఒక పెద్ద పొరపాటుపై ఇప్పుడు నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

**కొత్త కెప్టెన్‌కు నో ఛాన్స్.. పాత కెప్టెన్‌తో ప్రోమో:**

ఈరోజు (జూన్ 16, మంగళవారం) మధ్యాహ్నం 12:18 గంటలకి సోనీ స్పోర్ట్స్ ఇంగ్లాండ్ సిరీస్ కోసం భారీ హైప్ ఇచ్చేలా విడుదల చేసిన ప్రోమో వీడియోను ఎక్స్ (శ) లో పోస్ట్ చేసింది. గత ఏడాది ఇంగ్లాండ్‌తో జరిగిన 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ విజువల్స్‌ను వాడుకుంటూ ఈ వైట్-బాల్ సిరీస్ కోసం బిల్డప్ ఇచ్చింది. కానీ, ఇక్కడే సోనీ టీమ్ ఒక పెద్ద బ్లండర్ మిస్టేక్ చేసింది. టీమిండియా లేటెస్ట్ అప్‌డేట్స్‌ను మర్చిపోయి.. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ విజువల్స్ పెట్టకుండా, మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను మెయిన్ ఫేస్‌గా చూపిస్తూ ప్రోమో వదిలింది.

**ప్రోమోలో లేని అయ్యర్.. మీమ్స్‌తో ఫ్యాన్స్ లొల్లి:**

ఈ వీడియో కాస్తా క్షణాల్లో సోషల్ మీడియాలో వైరల్ అయిపోయింది. దాంతో క్రికెట్ ఫ్యాన్స్ బీసీసీఐ ఏమో సూర్యను కెప్టెన్సీ నుంచి తీసేస్తే.. సోనీ స్పోర్ట్స్ ఏమో ప్రోమో నుంచి కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను తీసేసి సూర్యను తెచ్చిందంటూ మీమ్స్ వేసి జోకులు పేల్చారు. ఫ్యాన్స్ తప్పును ఎత్తిచూపడంతో అలర్ట్ అయిన సోనీ స్పోర్ట్స్.. వెంటనే ఆ ట్వీట్‌ను డిలీట్ చేసింది. ఇప్పటి వరకు కొత్త ప్రోమో అయితే రాలేదు కానీ, తప్పును సరిదిద్దుకుని త్వరలోనే కొత్తది రిలీజ్ చేయనున్నారు.

**కావాలనే శ్రేయస్‌ను పక్కన పెట్టలేదు:**


సాధారణంగా భారత్ లో జరిగే హోమ్ మ్యాచ్‌ల బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్ స్టార్ స్పోర్ట్స్ (ఘుతీ వాజూశీతీం) దగ్గర ఉన్నాయి. కొత్త కెప్టెన్, పంజాబ్ కింగ్స్ కెప్టెన్ అయిన శ్రేయస్ అయ్యర్ గత చాలా కాలంగా ఇండియా తరఫున టీ20 మ్యాచ్‌లు ఆడలేదు.. దాంతో సోనీ స్పోర్ట్స్ దగ్గర శ్రేయస్ బ్లూ జెర్సీలో ఉన్న విజువల్స్ ఏవీ అందుబాటులో లేవు.. అందుకే వాళ్లు సూర్యకుమార్ యాదవ్ ఫుటేజ్‌ని వాడాల్సి వచ్చింది.

**ఇంగ్లాండ్ టూర్‌కు వెళ్లే టీమిండియా:**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, రవి బిష్ణోయ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి, మహమ్మద్ సిరాజ్, సంజు శాంసన్ (వికెట్ కీపర్), అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, ఇషాన్ కిషన్, వాషింగ్టన్ సుందర్, అర్ష్‌దీప్ సింగ్, శివమ్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ.



# ఆ మూవీతో సమంత స్పెషల్ బాండ్.. 'అదే నా బెస్ట్'





టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా కాలం తర్వాత 'మా ఇంటి బంగారం' సినిమాతో మన ముందుకు రాబోతున్నారు. నందిని రెడ్డి దర్శకత్వంలో వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ జూన్ 19న విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా ప్రమోషన్స్ లో ఫుల్ బిజీగా గడుపుతున్న సమంత.. తాజాగా పాల్గొన్న ఒక ఇంటర్వ్యూలో తన కెరీర్, సినిమాలపై కొన్ని ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ముఖ్యంగా తన మొదటి సినిమా 'ఏ మాయ చేసావే' పై ఆమె చూపించిన ప్రేమ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ వివరాలు చూద్దాం..

**ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో సమంత ఇంట్రెస్టింగ్ ఆన్సర్స్:**

ఇక ప్రమోషన్స్ లో భాగంగా జరిగిన ఒక ఇంటర్వ్యూలో సమంతకు కొన్ని క్రేజీ ప్రశ్నలు ఎదురయ్యాయి. ర్యాపిడ్ ఫైర్ రౌండ్‌లో ఆమె నటించిన హిట్ సినిమాలలో ఒకదాన్ని ఎంచుకోమని అడిగారు. ముందుగా 'ఏ మాయ చేసావే' లేదా 'ఈగ' అని అడగగా.. సమంత ఏమాత్రం ఆలోచించకుండా 'ఏ మాయ చేసావే' వైపే మొగ్గు చూపారు. ఆ సినిమానే తనకు కెరీర్ ఇచ్చిందని, అది లేకపోతే 'ఈగ' లాంటి పెద్ద ప్రాజెక్టులు వచ్చేవి కావని క్లారిటీ ఇచ్చారు.

**'రంగస్థలం', 'ఓ బేబీ'లకే ఓటు వేసిన సామ్:**

ప్రశ్నలు కొనసాగుతూ.. 'ఓ బేబీ' లేదా 'అ ఆ' అని అడగగా ఆమె 'ఓ బేబీ'ని ఎంచుకున్నారు. అలాగే లేడీ ఓరియెంటెడ్ ఫిల్మ్ 'యశోద' లేదా 'రంగస్థలం' లలో దేన్ని ఇష్టపడతారని అడిగితే.. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సరసన నటించిన 'రంగస్థలం' చిత్రానికే సమంత ఓటు వేశారు. ఇక వెబ్ సిరీస్ ల విషయానికి వస్తే 'సిటాడెల్' కంటే 'ది ఫ్యామిలీ మ్యాన్' వైపే మొగ్గు చూపారు.

**'ఫ్యామిలీ మ్యాన్' ని కాదని మళ్ళీ 'ఏ మాయ చేసావే':**

అయితే అసలైన ట్విస్ట్ చివర్లో ఎదురైంది. సమంతకు భారీ గుర్తింపు తెచ్చిన 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ లేదా ఆమె మొదటి చిత్రం 'ఏ మాయ చేసావే' లో ఏది బెస్ట్ అని హోస్ట్ అడిగారు. దానికి కూడా సమంత 'ఏ మాయ చేసావే' సినిమానే ఎంచుకున్నారు. "ఆ సినిమా లేకపోతే ఈ రోజు నేను ఇక్కడ ఉండేదాన్ని కాదు, అది నా జీవితాన్ని మార్చేసింది" అంటూ తన డెబ్యూ మూవీపై ఉన్న స్పెషల్ బాండ్ ను బయటపెట్టారు.

**నెట్టింట తెగ వైరల్ అవుతున్న వీడియో:**

సమంత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. దీనికి ఒక ముఖ్యమైన కారణం కూడా ఉంది. 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌కు సమంత భర్త రాజ్ నిడిమోరు దర్శకుడు కాగా.. 'ఏ మాయ చేసావే' సినిమాలో ఆమె మాజీ భర్త నాగచైతన్య హీరోగా నటించారు. అయినప్పటికీ, సమంత వ్యక్తిగత విషయాలను పక్కన పెట్టి.. తన సినీ ప్రయాణానికి పునాది వేసిన మొదటి చిత్రానికే పెద్ద పీట వేయడం నెటిజన్ల మనసులను గెలుచుకుంటోంది... చివరగా చెప్పాలంటే, ఎంత ఎదిగినా ఒదిగి ఉండడం అంటే ఇదేనేమో. సమంత నేడు పాన్-ఇండియా స్టార్‌గా ఎంతటి గుర్తింపు తెచ్చుకున్నా.. తనను ఇండస్ట్రీకి పరిచయం చేసిన మొదటి సినిమాను, ఆ పాత్రను గుండెల్లో దాచుకుందని ఈ ఇంటర్వ్యూతో ప్రూవ్ అయింది. మరి జూన్ 19న రాబోతున్న 'మా ఇంటి బంగారం' సినిమాతో సమంత ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేయబోతుందో చూడాలి!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965